thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 82 కరీంనగర్ ఆదివారం, 1 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదు

కోచి : రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై సంతకాలు చేసేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించడం సబబేనని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కె.ఎం.జోసెఫ్ అన్నారు. ఇందుకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఎలాంటి తప్పు చేయలేదన్నారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి నిర్ణయం అవసరమని తెలిపారు. కోచిలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 'గవర్నర్ల అధికారాల్లో న్యాయ వ్యవస్థ' పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. బిల్లుల ఆమోదంలో గవర్నర్ల పాత్ర పరిమితంగా ఉంటుందని తెలిపారు.






# తెలంగాణలో పెద్ద పండుగ..

## జూన్ 2న కొత్త పథకాలు ప్రారంభం

హైదరాబాద్ : తెలంగాణ అవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో పెద్ద పండుగ రాబోతుంది. పలు సంక్షేమ పథకాలకు జూన్ 2న ముహుర్తంగా ఫిక్స్ చేసింది రేవంత్ సర్కార్. కీలక నిర్ణయాలు, కొత్త పథకాల అమలు జూన్ 2 నుంచే మొదలు కానుంది. ఇప్పటికే పలు పథకాలపై అప్డేట్ వచ్చిన సంగతి తెలిసిందే. మరి జూన్ 2 తెలంగాణలో మొత్తం ఎన్ని కొత్త పథకాలు మొదలు కాబోతున్నాయి.. ఎలాంటి కీలక నిర్ణయాలు అమల్లోకి రానున్నాయి అంటే.. జూన్ 2, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం, రాజీవ్ యువ వికాసం తొలి విడత నిధులు మంజూరు, మిగిలి ఉన్న రైతులకు రైతు భరోసా నిధులు, ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏ ప్రకటన వంటి పథకాలు, నిర్ణయాలు అమలు చేసేందుకు రెడీ అవుతోంది. వీటితో పాటు గ్రామ పాలన అధికారులకు అపాయింట్మెంట్లు ఇవ్వనుంది. అసైన్డ్ భూములు సాగు చేస్తున్న పేద రైతులకు పట్టాలు మంజూరు చేయనున్నారు. అలానే జూన్ మూడో తేదీన... భూ సమస్యల పరిష్కారం, రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన కోసంనుంచి రెవెన్యూ సదస్సులను ప్రారంభించనుంది. ఇప్పటికే పైలెట్ మండలాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు అధికారులు. వీటికి మంచి స్పందన వస్తోంది అంటున్నారు అధికారులు. జూన్ 3 రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు నిర్వహించనున్నారు. అలానే రైతు భరోసా పథకం కింద పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేయనుంది. మే నెలలో వీటిని చెల్లించాల్సి ఉండే. కానీ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల వాయిదా పడింది. అలానే గ్రామ స్థాయిలో మెరుగైన పరిపాలన అందించేందుకు గాను రేవంత్ స్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా.. తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఆఫీసర్ (జీపీవో) పోస్టులను భర్తీ చేస్తోంది. ఈ క్రమంలో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దాదాపు 3,500 మందిని రెవెన్యూ శాఖలోకి తీసుకునేందుకు రేవంత్ సర్కార్ సిద్ధం అయ్యింది. వీరికి జూన్ 2 రీఅపాయింట్మెంట్ లెటర్లు అందజేయనున్నారు. అలానే ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపైనా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 2న కీలక ప్రకటన చేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నారు. దీనిలో భాగంగా పెండింగ్ డీఏ విడుదలపై ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. తెలంగాణ అవిర్భావ దినోత్సవాన్నిపురస్కరించుకుని.. కాంగ్రెస్ ప్రభుత్వం పలు నూతన సంక్షేమ పథకాలు, కీలక నిర్ణయాలు ప్రకటించి..రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొనేలా చేయనుంది. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త పథకాల ప్రకటన, నిధుల మంజూరు వంటి కార్యక్రమాలతో రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొననుంది. ప్రజలు కూడా వీటి కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.



## గోశాలలపై సీఎం రేవంత్ ఫోకస్.. బీజేపీకి చెక్?

హైదరాబాద్ : బక్రీద్‌కు ముందు తెలంగాణలో గోవధపై పెద్ద ఎత్తున గొడవ జరుగుతోంది. గోవుల అక్రమ రవాణా, బలవంతంగా ఆవులను కబేళాలకు తరలిస్తున్నారంటూ గో సంరక్షకా దళాలు రచ్చ చేస్తున్నాయి. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎప్పటిలానే సీన్‌లోని వచ్చారు. ఇలాంటి సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అధికారులతో కీలక సమీక్ష నిర్వహించారు. గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని ఆదేశించారు.

**50 ఎకరాలకు తగ్గకుండా..** గోవుల సంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేలా.. విశాలంగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు ముఖ్యమంత్రి. మొదటిదశలో తెలంగాణలోని వెటర్నరీ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీ, దేవాలయాలు, కాలేజీలకు చెందిన భూముల్లో గోశాలల నిర్మాణం చేపట్టాలని సూచించారు. కనీసం 50 ఎకరాలకు తగ్గకుండా.. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలని ఆదేశించారు.

**ఆధునిక సౌకర్యాలతో..** ఇరుకు స్థలాల్లో, బంధించినట్టుగా కాకుండా.. గోవులు మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు సీఎం. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు నిర్మాణానికి పూర్తిస్థాయి ప్రణాళికలు, బడ్జెట్ అంచనాలు సిద్ధం చేయాలన్నారు. నిర్వహణ, సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు.

**సరికొత్త డిజైన్...** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు సీఎం రేవంత్‌రెడ్డి. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులు చెప్పారు. నాలుగైదు రోజుల్లోగా తుది మోడల్‌ను ఖరారు చేయనుంది సర్కారు.




బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కొత్త కార్యాలయంలోకి అడుగుపెట్టింది. బంజారాహిల్స్ లోని తన ఇంటి దగ్గర కొత్త ఆఫీసును మే 31న సాయంత్రం 4గంటలకు ప్రారంభించింది. పూజాకార్యక్రమాలు చేసి తెలంగాణ జాగృతి కార్యాలయాన్ని ప్రారంభించింది కవిత. ఆఫీసులోపల కేసీఆర్,కవిత, ప్రొఫెసర్ జయశంకర్ ఫోటోలు తప్ప ఎవరీ ఫోటోలు కనిపిచండం లేదు. అలాగే తెలంగాణ జాగృతి పేరుతో ఏర్పాటు చేసిన బ్యానర్ లో కూడా కేసీఆర్, జయశంకర్ ఫోటోలు తప్ప మిగతా వారి ఫోటోలు ఎవరివీ లేవు. గత కొన్ని రోజులుగా కేసీఆర్‌కు లేఖతో తెలంగాణ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయడం తనకు ఇష్టం లేదని చెబుతున్న కవిత.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని చేసిన కామెంట్స్ పెను సంచలనంగా మారాయి. బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న కవిత.. తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు చేస్తోంది. ఎక్కడ ఏ కార్యక్రమం చేసినా ఎవరి ఫోటో పెట్టడం లేదు. ఈ క్రమంలోనే కవితన సామాజిక తెలంగాణ లక్ష్యంగా కొత్త పార్టీ పెడతారని ప్రచారం జరుతోంది. మరో వైపు కాళేశ్వరం కమిషన్ కేసీఆర్ ను జూన్ 5న విచారించనుంది. దీంతో జూన్ 4న హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ దగ్గర భారత జాగృతి ఆధ్వర్యంలో నిరసన చేపట్టాలని ఆమె నిర్ణయించారు




హైదరాబాద్: ఉత్కంఠగా సాగిన 72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయిలాండ్ సుందరి ఓపల్ సుచాత చువాంగ్‌శ్రీ ప్రపంచ సుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని సుచాతా చువాంగ్‌కు ధరించారు. 1వ రన్నర్ అప్‌గా ఇథియోపియా, 2వ రన్నర్ అప్‌గా మిస్ పోలెండ్, 3వ రన్నర్ అప్‌గా మిస్ మార్టినిక్ నిలిచారు. మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుచాతకు.. రూ. 8.5 కోట్ల ప్రైజ్ మనీ అందనుంది. సుచాత.. థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించారు. మొత్తం 108 దేశాలకు చెందిన కంటెస్టెంట్‌లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. సుచాతకు ప్రపంచ సుందరి కిరీటం దక్కడంతో థాయిలాండ్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. సుచాత.. 'ఓపల్ ఫర్ హర్' నినాదంతో మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ నినాదం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రభావం చూపాలన్నదే తన లక్ష్యమని ఇటీవల 'ఈటీవీ'కి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె పేర్కొన్నారు. 16 ఏళ్ల వయస్సులోనే క్యాన్సర్ ముప్పు నుంచి బయటపడిన ఆమె.. థాయ్‌లాండ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్నారు. క్యాన్సర్ బాధితులకు అండగా ఉండేందుకు నిధుల సేకరించడంతోపాటు, కొన్ని సంస్థలతో కలిసి పని చేస్తున్నారు. ప్రభావితం చూపే లక్ష్యంతో యువత ముందడుగు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.




## మావో నేత నంబల్లా హత్యను ఖండిస్తూ

# 10 న దేశవ్యాప్త బంద్!

## జూన్ 11 నుండి 3 అగస్టు వరకు నిరసనలు : అధికారప్రతినిధి అభయ్ పిలుపు

చురకలు హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్, మే, 31 : అమర్ రహే కామ్రేడ్ బసవరాజ్ (నంబాల కేశవరావు), భారత విప్లవ ఉద్యమ నాయకుడు, భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు. బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్ట్ ఆర్ ఎస్ ఎస్, బిజిపి కేంద్రం మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం కామ్రేడ్ బసవరాజ్ సహా 27 మంది పార్టీ మరియు పి ఎల్ జి ఏ కార్యకర్తలను హత్య చేసినందుకు నిరసనగా జూన్ 10న దేశవ్యాప్త బంద్ పాటించాలని సీపీఐ మావొయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ . 28 నుండి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా కామ్రేడ్ బసవరాజ్ (బిఆర్) సహా 27 మంది అమరవీరుల స్మారక సమావేశాలను నిర్వహించాలని, భారత విప్లవ ఉద్యమ చరిత్రలో మే 21 ఒక చీకటి దినం అని, ఆ రోజున, బ్రాహ్మణీయ హిందూత్వ ఫాసిస్ట్, రక్త దాహం, హంతక దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు, దేశ హెూంమంత్రి అమిత్ షా, భారత సైన్యం, కేంద్ర భద్రతా దళం, కమాండో దళం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీసులు నారాయణ్‌పూర్ జిల్లాలోని మాడ్ ప్రాంతంలో సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బసవరాజ్‌తో సహా పార్టీ, పిఎల్‌జిఎ యొక్క వివిధ స్థాయిలకు చెందిన 27 మంది సహచరులను హతమార్చారని అభయ్ పేర్కొన్నారు. ఈ ఊచకోతను నిర్వహించిన భద్రతా దళాల పట్ల ప్రధానమంత్రి గర్వం వ్యక్తం చేశారని, అమిత్ షా దీనిని చారిత్రాత్మక విజయంగా అభివర్ణించారని,ఈ ప్రకటనల ద్వారా ప్రధానమంత్రి మరియు హెూంమంత్రి మరోసారి సిగ్గు లేకుండా తమ రక్తపిపాసి మరియు హత్యాకాండ స్వభావాన్ని ప్రకటించారని పేర్కొన్నారు. ఈ ఊచకోతకు నిరసనగా జూన్ 10న దేశవ్యాప్త బంద్ పాటించాలని దేశ ప్రజలను అభ్యర్థిస్తున్నాట్లు, జూన్ 11 నుండి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా కామ్రేడ్ బసవరాజ్ సహా 27 మంది అమరవీరుల స్మారక సమావేశాలను నిర్వహించాలని దేశ ప్రజలను అభ్యర్థిస్తున్నాట్లు పేర్కొన్నారు. మార్చి చివరి వారంలో, జస్టిస్ చంద్రకుమార్ నేతృత్వంలో హైదరాబాద్‌లో శాంతి చర్చల కమిటీ ఏర్పడిందని, మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపడానికి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశాయని,. ఈ పత్రికా ప్రకటనను స్వాగతిస్తున్నాట్లు,. మార్చి 28న, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు అనుకూలమైన/అనుకూలమైన పరిస్థితులను సృష్టిస్తే మా పార్టీ శాంతి చర్చలకు సిద్ధంగా ఉందని పేర్కొంటూ మేము ఒక పత్రికా ప్రకటన విడుదల చేసామని,తరువాత, కేంద్ర కమిటీ మీడియా ప్రతినిధి కామ్రేడ్ అభయ్ మరియు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ వాయువ్య సబ్-జోన్ మీడియా ప్రతినిధి కామ్రేడ్ రూపేష్ రెండుసార్లు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలను 'మురికి యుద్ధాన్ని' ఆపాలని మరియు శాంతి చర్చలకు అనుకూలమైన పరిస్థితులను సృష్టించాలని డిమాండ్ చేశారని పేర్కొన్నారు. కానీ ఈ పత్రికా ప్రకటనను విస్మరించి, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాణాంతకమైన ఫాసిస్ట్ 'కగార్' యుద్ధాన్ని కొనసాగిస్తున్నాయని, ఏప్రిల్ 1 నుండి దేశవ్యాప్తంగా దాదాపు 85 మంది కామ్రేడ్స్ హత్యకు గురయ్యారని,. ఏప్రిల్ 21న, జారండ్‌లోని బొకారో జిల్లాలో మా కేంద్ర కమిటీ సభ్యుడు వివేక్ (ప్రయాగ్ మాంఝీ) హత్యకు గురయ్యారని, ఏప్రిల్ 24 నుండి **(మిగతా 4వ పేజీలో)**





# కవిత వ్యవహారం.. అదంతా ఫ్యామిలీ డ్రామా

హైదరాబాద్: భారాస ఎమ్మెల్సీ కవిత వ్యవహారం అంతా ఫ్యామిలీ డ్రామా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. తెలంగాణలో కల్వకుంట్ల ఆర్ట్స్ క్రియేషన్ జరుగుతోందని ఎద్దేవా చేశారు. "భారాసలో చార్‌పత్తా ఆట నడుస్తోంది. కల్వకుంట్ల సినిమాకు ప్రొడక్షన్ చేస్తున్నది కాంగ్రెస్. భాజపా–భారాస ఎప్పుడూ కలవవు. కవిత అరెస్టు జరగకుండా ఉండేందుకు మా పార్టీతో కలిసేందుకు ప్రయత్నించారు. అవినీతి భారాసతో భాజపా కలవదు. కాంగ్రెస్–భారాస మాత్రమే కలిసి పనిచేశాయి. వేములవాడ రాజన్న గోశాలలో కోడెలు చనిపోవడం బాధాకరం. ఈ ఘటనపై ఈవోతో మాట్లాడతాను. కోడెల సంఖ్యకు అనుగుణంగా గోశాలను విస్తరించాలి. రాజన్న ఆలయం నిధులను మాజీ సీఎం వేరే చోట ఖర్చు చేశారు.

మన సైన్యం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయి. పాక్‌పై యుద్ధం ఇంకా కొనసాగుతుందని ప్రధాని మోదీ చెప్పారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు యుద్ధం కొనసాగుతుంది " అని బండి సంజయ్ అన్నారు.



# పార్టీ మారిన నేతలను కలవలేదు

హైదరాబాద్: పీసీసీ అధ్యక్ష హోదాలో ఉంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.

భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌తో భారాస నేతలు రహస్యంగా సమావేశమయ్యారంటూ మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. "బట్ట కాల్చి మీద వేసినంత మాత్రాన అబద్ధాలు నిజం కావు. మా పార్టీ నుంచి వెళ్లిన నేతలను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు. పెళ్లిలోనో, చావులోనో కలిసిన సందర్భాలే తప్ప వ్యక్తిగతంగా కలవలేదు. మీరు విలువలు విస్మరించి రేవంత్‌రెడ్డి బాటలోనే నడుస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు మానుకొని స్థాయికి తగ్గట్లు వ్యవహరించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, హామీల అమలుపై దృష్టిపెట్టాలి" అని హరీశ్‌రావు తెలిపారు.

# తెలంగాణలో అత్యాధునిక గోశాలల ఏర్పాటు: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో అత్యాధునిక గోశాలల ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. గోశాలల ఏర్పాటు కోసం కమిటీని నియమించాలని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించిన డిజైన్లను నాలుగైదు రోజుల్లో ఖరారు చేయాలని చెప్పారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధశాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. గోశాలల ఏర్పాటుపై కమిటీ అధ్యయనం చేసి.. గడువులోగా పూర్తి స్థాయి ప్రణాళిక రూపొందించాలని సీఎం స్పష్టం చేశారు. తొలి విడతలో పశు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, దేవాలయాల భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరుకుగా గోవులను బంధించినట్టుగా ఉండకూడదని, స్వేచ్ఛగా తిరిగేలా అత్యాధునిక సదుపాయాలతో నిర్మించాలని సీఎం స్పష్టం చేశారు. కనీసం 50 ఎకరాల్లో నిర్మించేందుకు వీలుగా స్థలాలను గుర్తించాలన్నారు. గోశాలల నిర్వహణలో ధార్మిక సంస్థలను భాగస్వామ్యం చేసే అంశం పరిశీలించాలని సూచించారు.

# వెనుకబడిన వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: భట్టి విక్రమార్క

పాల్వంచ: ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయా వర్గాలకు రాజకీయ అధికారం కల్పించేందుకు చిత్తశుద్ధితో ఉన్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నిర్వహించిన ఆదివాసీ కాంగ్రెస్ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యమన్నారు. "వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూగరిష్ఠ పరిమితి చట్టం చేసింది. భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది. 6.70 లక్షల ఎకరాలను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసింది. పేదలకు పంచిన భూములను వారు దున్నుకోకుండా భారాస ప్రభుత్వం అడ్డుకుంది. గిరిజనుల భూమికి సాగునీటి కోసం



'ఇందిరా సౌర గిరిజల వికాసం' పథకాన్ని ప్రారంభించాం. దీనికోసం రూ.12,500 కోట్లు కేటాయించాం. 2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే" అని భట్టి విక్రమార్క వివరించారు.

# ఆపరేషన్ సిందూర్‌పై మేం రాజకీయం చేయడం లేదు: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్: వాయుసేనకు ఫైటర్ జెట్స్, ఆయుధాలు సరైన సమయానికి అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ ఎన్ని యుద్ధ విమానాలను కోల్పోయిందో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. "రఫేల్ విమానాలు కూలాయని రాహుల్ చెబితే దేశ వ్యతిరేకులు అన్నారు. రఫేల్ విమానాలు కూలాయని సీడీఎస్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. సీడీఎస్ వ్యాఖ్యలపై ఏం చెప్తారు..

ఆయన్ని దేశ వ్యతిరేకి అంటారా? పాకిస్థాన్ ఫైటర్ జెట్స్ ఎన్ని కూలాయో కూడా స్పష్టం చేయాలి. సరిపడా యుద్ధ విమానాలు లేవు .. ఇది దేశానికి మంచిది కాదు. ఆపరేషన్ సిందూర్‌పై కాంగ్రెస్ రాజకీయం చేయడం లేదు. యుద్ధ విషయాలు ప్రపంచానికి



బహిరంగంగానే చెప్పాలి. విజయాలతో పాటు లోటుపాట్లను కూడా ప్రజలకు చెప్పాలి" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.



# ములుగులో లొంగిపోయిన 8 మంది మావోయిస్టులు

ములుగు: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన 8 మంది దళ సభ్యులు ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఎదుట లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడు ఒకరు, ఏరియా కమిటీ సభ్యులు ఇద్దరు, పార్టీ సభ్యులు ముగ్గురు, మిలీషియా సభ్యులు ఇద్దరు ఉన్నారు. వీరంతా ములుగు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జనజీవన స్రవంతిలో కలిశారు.

# కేసీఆర్‌కు ఒక కన్ను భారాస .. రెండో కన్ను జాగృతి సంస్థ: ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పనిచేసిందని భారాస ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన 'తెలంగాణ జాగృతి' నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పడింది. ఈ సంస్థను ప్రారంభించి 18ఏళ్లు అయింది. ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి కార్యాలయం ఉండేది.. ఇప్పుడు బంజారాహిల్స్‌కు మార్చాం. ఇకపై ఇక్కడి నుంచే సంస్థ కార్యకలాపాలు కొనసాగిస్తాం. ఇన్నేళ్ల ప్రయాణంలో ఎందరో ఆశీస్సులు అందించారు. మేము చేసిన ఉద్యమాల వల్ల చాలా జీవోలు వచ్చాయి. గత పదేళ్ల కేసీఆర్ పాలనకు.. ఇప్పటి కాంగ్రెస్ పాలనకు ఎంతో తేడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా 'జై తెలంగాణ' అనాలి. అమరవీరులకు నివాళులు అర్పించాలి. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైనా రేవంత్‌రెడ్డి.. 'జై తెలంగాణ' అనాలి. జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి కానీ, రాజీవ్ యువ వికాసం అని ఉండకూడదు. కేసీఆర్‌కు రెండు కళ్లలా పనిచేస్తాం.. ఒక కన్ను భారాస అయితే, రెండోది జాగృతి సంస్థ. కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోం. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే.. యావత్ తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్టే. ఈ రాష్ట్రానికి ఆయన ఏం చేశారో ప్రజలందరికీ తెలుసు తెలంగాణ తెచ్చిన వ్యక్తికి నోటీసులు ఇస్తారా? అది కాళేశ్వరం కమిషన్ కాదు.. కాంగ్రెస్ కమిషన్. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తాం. మహాధర్నాలో నోటీసుల కుట్ర మొత్తం వివరిస్తాం.

గోదావరి–కావేరీ లింకేజీతో నదీ జలాలు తెలంగాణకు శాశ్వతంగా దూరమవుతాయి. బనకచర్ల ద్వారా ఏపీ ప్రభుత్వం నీళ్లు తీసుకుపోతుంటే రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారు? నదుల అనుసంధానాన్ని కేసీఆర్ వ్యతిరేకించారు. తుపాకుల గూడెం వద్ద రివర్ లింకేజీ ఉండాలని ఆయన సూచించారు. ఇచ్చంపల్లి వద్ద రివర్ లింకేజీ పెడతామని కేంద్రం చెప్పింది. జూన్ 2న నదీ జలాలపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలి. అపెక్స్ కౌన్సిల్ సమావేశం పెట్టాలని డిమాండ్ చేయాలి'' అని కవిత డిమాండ్ చేశారు. బంజారాహిల్స్ కార్యాలయంలో ఆచార్య జయశంకర్, కేసీఆర్ ఫొటోలతో తెలంగాణ జాగృతి బ్యానర్ పెట్టారు. కొత్త కార్యాలయంలో బీఆర్ అంబేడ్కర్, ఆచార్య జయశంకర్, తెలంగాణ తల్లి, జ్యోతిబా ఫులే, సావిత్రిబాయి ఫులే విగ్రహాలతో పాటు అమరవీరుల స్థూపాన్ని ఏర్పాటు చేశారు.

# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో రేవంత్‌రెడ్డి స్కామ్ చేస్తున్నారు



హైదరాబాద్: ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్కామ్ చేస్తున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం తన అనుచరులకు ఇచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వ పాలనలో గురుకులాలు అధో:పాతాళానికి వెళ్తున్నాయని ఆక్షేపించారు. చాలామంది పేద పిల్లలు రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గాల పట్ల ఐఏఎస్ అలుగు వర్షిని వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. అందరికంటే పెద్ద మాదిగ,పెద్ద మాల తానే అని రేవంత్ రెడ్డి అంటారని.. కానీ పేద పిల్లలు టాయిలెట్స్ వాళ్లే కడుక్కోవాలని ఐఏఎస్ అధికారితో ఎలా చెప్పిస్తారని ప్రశ్నించారు. ఎస్సీలు ఇంజనీర్లు, డాక్టర్లు కావాలని మాజీ సీఎం కేసీఆర్ గురుకులాలు ఏర్పాటు చేశారని గుర్తుచేశారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్.

**ఎస్సీ గురుకులాల పట్ల వివక్ష...** రేవంత్ ప్రభుత్వం ఎస్సీ గురుకులాల పట్ల వివక్షతో వ్యవహరిస్తోందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తల్లిదండ్రులను కూర్చోబెట్టి మాట్లాడలేని అధికారులను సాంఘిక సంక్షేమ శాఖలో ఎందుకు నియమించారని ప్రశ్నించారు. గురుకుల విద్యార్థిని ఆగసార నందినికి గోల్డ్ మెడల్ వస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు నగదు ప్రోత్సాహం ఇవ్వరని నిలదీశారు. గౌలిదొడ్డిలోని గురుకుల పాఠశాల సిబ్బందిని తొలగిస్తున్నారని చెప్పుకొచ్చారు. గౌలిదొడ్డిలో ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులను బయటకు పంపాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలం గురుకుల బాట చేపడితే తమను లోపలికి రానివ్వలేదని మండిపడ్డారు. ఇదేనా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని చెబుతున్న రాజ్యాంగ నీతి అని ప్రశ్నించారు. సంపన్న వర్గాల పిల్లలకు ఒక రూల్ పేద పిల్లలకు ఒక రూలా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు.

**డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదు..** ఎస్సీలకు బాయ్స్, గర్ల్స్‌కు ఒకే చోట తరగతులు ఉండకూడదని ప్రభుత్వం అంటోందని.. అమ్మాయిలకు భువనగిరిలో సైనిక స్కూల్ ఏర్పాటు చేస్తే దాన్ని ఎందుకు మూసివేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం మొద్దు నిద్రపోతుందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 30 గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ రోజు డిగ్రీ కాలేజీల్లో ఒక్క అడ్మిషన్ కూడా కాలేదని అన్నారు. గురుకుల మహిళా డిగ్రీ కాలేజీలు మూతపడే విధంగా రేవంత్ రెడ్డి, అలుగు వర్షిని కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. గురుకుల భవనాలు కట్టడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం ఇచ్చిందని గుర్తుచేశారు. గురుకుల ఇంటర్ కాలేజీల్లో విద్యార్థులు ఫెయిల్ అయితే ప్రభుత్వం ఎందుకు సప్లమెంటరీ ఫీజు కట్టలేదని ప్రశ్నించారు. గురుకులాల విద్యార్థులు రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ దగ్గరకు వెళ్తే ఆయన ఏం చేయలేకపోయారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడించారు.

**కేర్ టేకర్స్‌ను తొలగించారు..** గురుకులాల అసిస్టెంట్ కేర్ టేకర్స్‌ను అలుగు వర్షిని తొలగించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో గురుకులాల్లో సమ్మర్ క్యాంపులు పెట్టారని.. రేవంత్‌రెడ్డి పాలనలో సమ్మర్ క్యాంపులను రద్దు చేశారని ధ్వజమెత్తారు. అందాల పోటీలకు వచ్చిన వారికి 30 తులాల బంగారం ఇవ్వడానికి రేవంత్ ప్రభుత్వానికి బడ్జెట్ వస్తుంది.. కానీ పేద పిల్లల చదువుకు మాత్రం బడ్జెట్ లేదా అని నిలదీశారు. గురుకులాల్లో ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. మంత్రులు భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ, ఎస్సీ ఎమ్మెల్యేలు రేవంత్ రెడ్డిని ఎందుకు నిలదీయడం లేదని అడిగారు.

కాంగ్రెస్‌లోని దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు బానిస బతుకులు ఎందుకు బతుకుతున్నారని ప్రశ్నించారు. పేద ప్రజలపై బాధ్యత లేని అధికారులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. గురుకులాలు రాష్ట్రంలో ప్రమాదంలో ఉన్నాయని హెచ్చరించారు. గురుకులాలను కాపాడుకోవాల్సిన అవసరం రాష్ట్రంలో ఉందని చెప్పారు. టాయిలెట్లను విద్యార్థులు కడగాలని ఆదేశాలు ఇచ్చిన అలుగు వర్షినిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలుగు వర్షినిని వెంటనే సస్పెండ్ చేయాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

# భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఎంతో దూరంలో లేదు: ట్రంప్



భారత్‌తో వాణిజ్యఒప్పందం కుదిరే సమయం ఆసన్నమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. న్యూదిల్లీపై ట్రంప్ దాదాపు 26శాతం సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈక్రమంలోనే శుక్రవారం (స్థానిక కాలమానం ప్రకారం) ఎయిర్‌ఫోర్స్‌వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఆ దేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. అంతేకాకుండా భారత్– పాక్‌లు ఘర్షణలకు దిగితే వారితో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలనే ఆసక్తి తనకు పోతుందని వ్యాఖ్యానించారు. ఈసందర్భంగా వాణిజ్య చర్చలు జరిపేందుకు పాకిస్థాన్ ప్రతినిధులు కూడా వచ్చేవారం వాషింగ్టన్‌కు రానున్నట్లు తెలిపారు.

కాగా.. ఇప్పటికే ఇరుదేశాల మొదటి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్నాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్‌తో సమావేశమయ్యారు. ఈ ఏడాది సెప్టెంబరు–అక్టోబరు నాటికి తొలి దశ ఒప్పందాన్ని ఖరారు చేయాలనే లక్ష్యంతో ఉన్నారు. ఈ చర్చల్లో ప్రధానంగా పరస్పర మార్కెట్ల వినియోగం.. స్థానిక నిబంధనల అమలు, టారిఫ్ మినహాయింపులకు పరిమితులపై ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఏప్రిల్‌లో ట్రంప్ పలు దేశాలపై టారిఫ్‌ల మోత మోగించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే 90 రోజుల పాటు ఈ సుంకాల అమలుకు అమెరికా విరామం ప్రకటించింది. ట్రంప్ విధించిన సుంకాలపై చాలా దేశాలు ప్రతీకార చర్యలకు దిగాయి. అయితే, భారత్ మాత్రం విభిన్నంగా ఆలోచించి.. ప్రతికార సుంకాలకు బదులుగా అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై దృష్టిసారించింది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి అడుగులు పడిన సంగతి తెలిసిందే. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా ఒప్పందం చేసుకునేలా దేశాధినేతలు అంగీకారం తెలిపారు. ఈనేపథ్యంలోనే చర్చలు జరుగుతున్నాయి.




# బాల లందరికీ విద్య ఉత్త మాటేనా? చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా!

## - జూన్ 1...అంతర్జాతీయ బాలల దినోత్సవం

నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా- దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యా వ్యాప్తికి ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యాగంధం లేక బాలకార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్య త్తును అంధకార మయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హొటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపు తున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించు కునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశిం చింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవ త్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించ డానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువు పట్ల అవ గాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పించేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాద నపై ఆధార పడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# జాతి నిర్మాణానికి యువ శక్తి కీలకం




జాతి నిర్మాణం లో యువత పాత్ర చాలా కీలకం అన్నది నిర్వివాదాంశం. నేటి యువతే రేపటి భవిత అంటారు. యువతకు గల శక్తి అంతులేనిది, అపారమైనది. దేశ ఉన్నతికి, ఔన్నత్యానికి ఈ శక్తిని ఫణంగా పెడితే అన్నీ తిరుగులేని విజయాలే ఉంటాయి. వారి విజయాలు వ్యక్తిగతం మాత్రమే కాదు, సామాజికమైనవి. తద్వారా జాతీయం, అంతర్జాతీయం అయినవి. ఈ శక్తి ఎప్పుడూ అనుకూల పథంలో సాగాల్సి ఉంది. యువ శక్తి దేశానికి ఎంత మేలు చేస్తుందో .. గతి తప్పితే అంతకు రెట్టింపు కీడుచేస్తుంది. యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలి. యువత మద్యపానం, దూమపానం, మాదక ద్రవ్యాలు వంటి దురలవాట్లకు బానిసలు కాకుండా ఉండాలి. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి , గ్రామాభివృద్ధికి కృషి చేయాలి , యువత ఉద్యోగ అవకాశాలను వినియోగించు కోవాలి. 50 శాతం యువత నేడు ఉద్యోగాల కోసం ఆన్ లైన్ ద్వారా అన్వేషించడం చూస్తే ఉద్యోగ వేట తీరుతెన్నులూ మారిపోతు న్నాయని తేలుతోంది. అంతేకాదు, రోజూ రవాణా రద్దీలో ఇరుక్కునే కన్నా ఇంటి నుంచి ఆన్‌లైన్‌లో పనిచేయడానికి ఇష్ట పడుతున్నారు. ఐటీ విప్లవం వల్ల కంపెనీలూ దీన్ని నెమ్మదిగా ప్రోత్సహిస్తున్నాయి. పని వేళలను మార్చుకునే సౌలభ్యాన్నీ ఇస్తున్నాయి. భారత్‌లో ఇప్పటికే 43 శాతం ఉద్యోగులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించు కుంటున్నారని ఒక సర్వే తెలిపింది. అదే సమయంలో తమకు ఇష్టమైన ఉద్యోగాలను, వేతనాలను పొందగలమనే నమ్మకం యువతలో ఉండటం లేదనీ స్వయంగా రిజర్వు బ్యాంకు అధ్యయనం తెలిపింది. అందుకే భారత్‌లో సంభవిస్తున్నది...ఉపాధి రహిత అభివృద్ధి అని రాజకీయ పార్టీలు విమర్శిస్తున్నాయి. ఈ పరిస్థితిలో యువత ఉద్యోగాన్వేషణ కన్నా సొంత వ్యాపారాలు పెట్టుకోవడం మేలని భావిస్తున్నారు. నేటి తరానికి బాధ్యతలు గుర్తు చేసేందుకు, ప్రభుత్వాలు, యువతకు గల శక్తిని చాటి చెప్పేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతునే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి ఆకాంక్షలకు దన్నుగా వివిధ పథకాలతో ముందుకు వస్తున్నది. వారు ఉద్యోగ వ్యాపారాల్లో రాణించడానికి కావలసిన నైపుణ్యాలను అందించడానికి స్కిల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రకటించింది. కానీ, ఈ పథకాలు ఆచరణలో ఆశించిన ఫలితాలను ఇవ్వలేక పోతున్నాయి. నైపుణ్యాలను తాజా పరచుకోవడానికి, కొత్త నైపుణ్యాలను అలవరచు కోవడానికి, ఈ సహస్రాబ్ది యువత కృషి చేయక తప్పదు. అందుకు అవసరమైన వసతులను అమర్చడం తమ బాధ్యత అని ప్రభుత్వం, కార్పొరేట్ రంగం, విద్యా వ్యవస్థలు గుర్తించి కార్యోన్ముఖం కావాలి. రేపటి ప్రపంచంలో రాణించడానికి తగు నైపుణ్యాలను అలవరచు కోవాలి. కాలంతోపాటు తామూ మారుతూ సమయస్ఫూర్తితో అవకాశాలను అంది పుచ్చుకోవాలి. ఉదాహరణకు ఆటోమేషన్, ఏఐ వల్ల ఐటీ రంగంలో ఉద్యోగాలు తగ్గడంతో ఇంజినీరింగ్, సైన్స్ పట్టభద్రులు డిజిటల్ మార్కెటింగ్ వంటి కొత్తదారులు వెతుక్కుంటున్నారు. సిబ్బంది అంతా ఒకే కార్యాలయంలో లేక కారా?నాలో కలిసి పనిచేసే రోజులు పోతున్నాయి. మేనేజర్ ఒకచోట ఉండి, వేర్వేరు ప్రాంతాల్లోని సిబ్బందితో పనిచేయించే రోజులు వచ్చాయి. సామాజిక మాధ్యమాల్లో, స్మార్ట్ ఫోన్లలో మాటామంతీ జరపడంలో ఆరితేరిన నేటి తరం, ఈ తరహా రిమోట్ నిర్వహణలో సులువుగా ఇమిడి పోగలుగుతుంది. ఆశలు, ఆశయాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను గుర్తించి, వాటిని అధిగమించడానికి ఆచరణీయ ప్రణాళికలను చేపట్టడం ప్రభుత్వ విధి. కార్పొరేట్ రంగం కూడా యువ సిబ్బంది ఉద్యోగంలో, జీవితంలో విజేతలుగా ఎదగడానికి తోడ్పడే నిర్వహణ విధానాలను అనుసరించాలి. 21వ శతాబ్దంలో విజయ సాధన అంత తేలిక కాదని యువతరం అనుభవంలో తెలిసి వస్తున్నది. నేడు జీవితంలో రాణించాలంటే ఐఐటీ, ఐఐఎంల వంటి ఉత్కృష్ట విద్యా సంస్థల్లో పట్టభద్రులవక తప్పదనే భావన నెలకొంది. రేపటి కృత్రిమ మేధ యుగంలో భారత్ తరహా బట్టీ చదువులకు స్థానం ఉండదు. అలాంటి చదువులతో చేసే ఆనవాయితీ పనులను మనుషులకన్నా యంత్రాలే అత్యంత సమర్థంగా చేయ గలుగుతాయి. నాలుగో పారిశ్రామిక విప్లవానికి సృజనశీల విద్య చోదకశక్తి కానుంది. ఆ విప్లవంలో అగ్రగాములుగా ఎదగాలంటే అభ్యాస, ఆచరణలను అత్యుత్తమంగా మేళవించాలి. అటువంటి ఉత్తమ గుణ సమ్మేళనం జర్మనీ, ఫిన్లాండ్ వంటి దేశాల విద్యా విధానాల్లో కనిపిస్తున్నది.

వాటి నుంచి ఇతర దేశాలు నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మొక్కుబడి చదువులు, బట్టీయం చదువులకు మున్ముందు స్థానం ఉండదు. ఈ వాస్తవాన్ని గుర్తెరిగి విద్యార్థులు చొరవ, సృజన శీలతలను ఇనుమడింప జేసుకోవాలి. వారికి కావలసిన ప్రాతిపదికను తల్లిదండ్రులు, గురువులు, పాలకులు ఏర్పరచాలి. ఆ పని చేసినప్పుడు మాత్రమే యువతరం భారత సామాజిక, ఆర్థికాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలబడగలుగుతుంది!

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ప్రభుత్వం, బీసీసీఐ మౌనంపై ప్రశ్నలు!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటే దేశవ్యాప్తంగా కోట్లాది మందికి క్రికెట్ పండుగ. కానీ ఈ ఉత్సాహం వెనుక, నిశ్శబ్దంగా ఓ తీవ్రమైన సమస్య పెరిగిపోతోంది: ఆన్‌లైన్ బెట్టింగ్ , 'ఫాంటసీ గేమింగ్' ప్లాట్‌ఫామ్‌లు. భారత క్రికెట్ స్టార్లే ఈ ప్లాట్‌ఫామ్‌లకు మద్దతు ఇవ్వడం ఈ సమస్యను మరింత జటిలం చేస్తోంది.

**-బెట్టింగ్ పై తల్లిదండ్రుల ఆవేదన...** పెద్దలు, ముఖ్యంగా తల్లిదండ్రులు ఈ పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఈ విషయంలో నిస్సహాయంగా మౌనం వహించడం వారిని మరింత కలవరపరుస్తోంది. చాలా మంది దీన్ని "మౌనమైన మహమ్మారి"గా అభివర్ణిస్తున్నారు. మెట్రో నగరాల నుంచి చిన్న పట్టణాల వరకు, పదేళ్ల వయస్సున్న యువత కూడా ఈ బెట్టింగ్ యాప్‌ల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఆశ, తమ అభిమాన క్రికెట్ స్టార్ల ప్రచారాలు యువతను ఈ వలలోకి లాగుతున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనివల్ల విద్యపై దృష్టి తగ్గడం, ఆర్థిక నష్టాలు, మానసిక ఒత్తిళ్లు పెరిగి, వారి భవిష్యత్తు అంధకారంగా మారుతోంది. ఢిల్లీకి చెందిన మనీష్ అనే తండ్రి తన ఆవేదనను పంచుకున్నారు: "ఇది గుండెను పిండే విషయం. ఒకప్పుడు క్రికెట్ అంటే స్ఫూర్తి, ఆటలో నైపుణ్యం. ఇప్పుడు మా పిల్లలను వ్యసనాల బాటకు నడిపిస్తోంది. నా కుమారుడు ?50,000 నష్టపోయిన తర్వాత అతని ఫోన్ నుండి మూడు బెట్టింగ్ యాప్స్‌ను తొలగించాల్సి వచ్చింది. నా హీరోలు ఈ ప్రమాదకరమైన యాప్స్‌కు ఎందుకు మద్దతు ఇస్తున్నారు?" అని ప్రశ్నించారు. మరో తల్లిదండ్రులు బీసీసీఐ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు: "బీసీసీఐకి డబ్బే ముఖ్యం. మా పిల్లల భవిష్యత్తుపై వారికి శ్రద్ధే లేదు. పేరొందిన ఆటగాళ్లు బెట్టింగ్ యాప్స్‌కు ప్రచారం చేస్తున్నారు. కొన్ని యాప్స్ ఐపీఎల్‌కి స్పాన్సర్‌గా కూడా వస్తున్నాయి. ఇవి ఫాంటసీ స్పోర్ట్స్ అంటూ పేరు పెట్టుకుంటున్నా, వాస్తవానికి ఇవి జూదానికి మార్గం," అని దుయ్యబట్టారు.

**-స్టేడియాల్లోనూ బెట్టింగ్: నిస్సహాయతలో అభిమానులు...** ఇటీవల జరిగిన ఓ మ్యాచ్‌కి హాజరైన ఒక కుటుంబం స్టేడియంలోనే బెట్టింగ్ చేస్తున్న కుర్రాళ్లను చూసి షాక్‌కు గురైంది. "అక్కడే ఫోన్‌లో బెట్లు వేస్తున్నారు. యువకులు లైవ్ బెట్టింగ్ చేస్తున్నారు. ఇది చూస్తూ పిల్లల్ని ఎలా తీసుకెళ్లాలి?" అని ఆత్మవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటన సమస్య ఎంత లోతుగా పాతుకుపోయిందో తెలియజేస్తోంది.

**-చట్టాలు లేని చోట, అదుపులేని వ్యాపారం...** చట్టసంస్థలు అప్పుడప్పుడు బెట్టింగ్ గ్యాంగ్‌లను అరెస్టు చేసినా, బహిరంగంగా పనిచేస్తున్న ఫాంటసీ యాప్స్‌పై ఇప్పటివరకు ఎలాంటి నియంత్రణ లేదు. ఇవి 'గేమింగ్' పేరుతో పనిచేస్తూ యువతను జూదపు అలవాట్లకు తోడ్పడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- ప్రభుత్వం, బీసీసీఐ మౌనంపై ప్రశ్నలు..** ప్రభుత్వం గానీ, బీసీసీఐ గానీ ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. పలు సంఘాలు, తల్లిదండ్రులు బీసీసీఐపై ఒత్తిడి తెస్తున్నారు: ఈ బెట్టింగ్ కంపెనీల స్పాన్సర్‌షిప్‌లు, క్రికెటర్ల మద్దతును నిషేధించాలని, ఆటగాళ్లు బాధ్యతాయుత ప్రవర్తనకు నిదర్శనంగా నిలవాలని కోరుతున్నారు. "క్రికెట్ గౌరవం తెచ్చే ఆట. ఇప్పుడు అది వ్యసనాలకు మార్గం అవుతోంది. ఇది ఆగాలి," అని ఓ అభిమాని కామెంట్ చేశారు. ప్రఖ్యాత ఆటగాళ్లు దేవతలుగా ఆదరించబడే దేశంలో, వారు ఇచ్చే సందేశాలు మరింత బాధ్యతతో ఉండాలి. ఆట మళ్లీ నైపుణ్యం, క్రీడాస్ఫూర్తికి నిలయంగా మారాలని ప్రజల ఆకాంక్ష. ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించి, యువత భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత బీసీసీఐ, ప్రభుత్వంపై ఉంది.

# కెనడా చరిత్రలోనే అత్యంత ఘోరమైన కార్చిచ్చు

కెనడా దేశం ప్రస్తుతం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భీకర కార్చిచ్చులతో అల్లాడుతోంది. పశ్చిమాన సస్కెట్చివాన్ ప్రావిన్స్‌లో కార్చిచ్చు తీవ్రంగా వ్యాపించడంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇప్పటికే మాంటోబా ప్రావిన్స్‌లో దీని కారణంగా వేలాది మంది ప్రజలను వారి ఇళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ కార్చిచ్చులు కేవలం కెనడాకే పరిమితం కాకుండా, పొగ రూపంలో సరిహద్దులు దాటి అమెరికాలోని పలు రాష్ట్రాల ప్రజలనూ శ్వాసకోశ సమస్యలకు గురిచేస్తున్నాయి. సస్కట్చెవాన్ ప్రావిన్స్ ప్రీమియర్ స్కాట్‌మో మాట్లాడుతూ.. తమ ప్రావిన్స్ తీవ్రమైన పరిస్థితిని ఎదుర్కొంటుందని, విపత్తును ఎదుర్కోవడానికి అన్ని చర్యలూ తీసుకున్నామని తెలిపారు. ఇక్కడ ఇప్పటికే 4,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అగ్ని కీలలు అంచనాలకు మించి 6,69,000 ఎకరాల్లో విస్తరించి, భీకరంగా వ్యాపిస్తున్నాయి. పరిస్థితి



ఏమాత్రం అనుకూలంగా లేదని, రానున్న రోజుల్లో మరింత సంక్లిష్టంగా మారే అవకాశముందని అగ్నిమాపక సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాంటోబా ప్రావిన్స్‌లో బుధవారం నుంచే అత్యవసర పరిస్థితి కొనసాగుతోంది. చిన్నచిన్న గ్రామాలు, వాడలను అధికారులు ఖాళీ చేయిస్తున్నారు. ఈ ప్రావిన్స్‌లో ఇప్పటికే 1,73,000 ఎకరాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇటీవల కాలంలో ఈ స్థాయిలో కార్చిచ్చును తాము చూడలేదని అధికారులు పేర్కొన్నారు. ప్రజలను సురక్షితంగా తరలించేందుకు కెనడా వైమానిక దళం కూడా రంగంలోకి దిగింది. రెండు లేదా మూడు రోజులు భారీ వర్షాలు పడితే గానీ ఈ కార్చిచ్చు అదుపులోకి రాదని నిపుణులు భావిస్తున్నారు.

**అమెరికాకూ ముప్పు...** కెనడాలోని ఈ రెండు ప్రావిన్సుల నుంచి వెలువడుతున్న దట్టమైన పొగ పొరుగునున్న అమెరికా రాష్ట్రాలైన మిన్నెసోటా, మిషిగాన్ తదితర ప్రాంతాల వైపు వెళుతోంది. దీని కారణంగా అమెరికాలో ప్రజలు శ్వాసకోశ ఇబ్బందులు పడుతున్నట్లు ది అమెరికన్ లంగ్ అసోసియేషన్ 2025లో విడుదల చేసిన 'స్టేట్ ఆఫ్ ది ఎయిర్' నివేదిక పేర్కొంది. ఈ కార్చిచ్చులు కేవలం పర్యావరణానికే కాకుండా ప్రజల ఆరోగ్యానికీ పెను సవాలుగా మారాయి.

**కెనడా చరిత్రలో భారీ నష్టం...** 2025లో ఈ రెండు ప్రావిన్సుల్లోనే మొత్తం 15 లక్షల ఎకరాలకు పైగా భూమి కార్చిచ్చులకు ఆహుతయ్యాయి. కెనడా సహజ వనరుల విభాగం లెక్కల ప్రకారం.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా మొత్తం 6,000 కార్చిచ్చులు సంభవించగా, అవి 3.7 కోట్ల ఎకరాలను కాల్చివేశాయి. ఈ సంఖ్య కెనడా చరిత్రలోనే అత్యధిక నష్టంగా రికార్డుల్లో నిలిచింది. పర్యావరణ మార్పుల ప్రభావం, సుదీర్ఘ పొడి వాతావరణం ఈ కార్చిచ్చులకు ప్రధాన కారణాలుగా విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# గాజాలో కాల్పుల విరమణకు బ్రేక్..

గాజాలో కొనసాగుతున్న భీకర యుద్ధానికి తెరదించి, బందీలను విడుదల చేయడానికి అమెరికా చేసిన కాల్పుల విరమణ ప్రతిపాదనకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ప్రతిపాదనను హమాస్ తిరస్కరించినట్లు ఆ సంస్థ నాయకుడు బీబీసీకి తెలిపారు. అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ చర్చించిన అంశాలకు.. ప్రస్తుతం చేసిన ప్రతిపాదనలకు మధ్య పూర్తి వ్యతిరేకత ఉందని హమాస్ నాయకులు ఆరోపించారు. ఈ తిరస్కరణతో గాజాలో శాంతి నెలకొనే ఆశలు మరింత సన్నగిల్లాయి.

**షరతులకు హమాస్ నిరాకరణ...** అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ ముందుకు తెచ్చిన కాల్పుల విరమణ ప్రతిపాదనలో కొన్ని కీలక అంశాలు ఉన్నాయి. దీని ప్రకారం హమాస్ తమ వద్ద సజీవంగా ఉన్న 10 మంది బందీలను, అలాగే 18 మంది మృతదేహాలను రెండు దశల్లో అప్పగించాలని డిమాండ్ చేసింది. ఇజ్రాయెల్ దీనికి ప్రతిగా 60 రోజుల పాటు కాల్పుల విరమణను పాటించడంతోపాటు, తమ ఆధీనంలో ఉన్న పాలస్తీనా ఖైదీలను విడుదల చేయాలి. వాస్తవానికి, హమాస్ వద్ద సుమారు 58 మంది బందీలు ఉన్నారని, వారిలో



కనీసం 20 మంది సజీవంగా ఉన్నారని ఇజ్రాయెల్ బలంగా నమ్ముతోంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం దీనిపై అధికారికంగా స్పందించనప్పటికీ ప్రధాని నెతన్యాహూ బాధిత కుటుంబాలతో మాట్లాడుతూ తాను ఈ ఒప్పందానికి అంగీకరిస్తానని చెప్పినట్లు వార్తలు వచ్చాయి. అయినప్పటికీ, హమాస్ ఈ ప్రతిపాదనను తమ షరతులకు అనుకూలంగా లేదని తిరస్కరించింది.

**గాజాలో విస్తృత ఆపరేషన్...** ప్రస్తుతం ఇజ్రాయెల్ గాజాను పూర్తిగా మూసివేసి, మార్చి 18 నుండి ఎదురుదాడులను కొనసాగిస్తోంది. దీంతో అప్పటివరకు అమెరికా, ఖతార్, ఈజిప్ట్ సంయుక్తంగా కుదిర్చిన కాల్పుల విరమణ ఒప్పందం పూర్తిగా విఫలమైంది. ఇటీవల మే 19 నుండి ఇజ్రాయెల్ దళాలు గాజాలో మరింత విస్తృతంగా ఆపరేషన్ చేపట్టాయి. గాజాను పూర్తిగా తమ అధీనంలోకి తీసుకుంటామని అప్పట్లో నెతన్యాహూ ప్రకటించారు. గత 10 వారాల్లో దాదాపు 4,000 మంది ప్రజలు గాజాలో మరణించినట్లు హమాస్ ఆధ్వర్యంలోని ఆరోగ్య శాఖ లెక్కలు చెబుతున్నాయి, ఇది పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**వెస్ట్‌బ్యాంక్‌లో కొత్త యూదు ఆవాసాలు...** ఇక, యుద్ధ వాతావరణం మధ్యే ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో 22 కొత్త యూదు ఆవాసాల ఏర్పాటుకు ఇజ్రాయెల్ పచ్చజెండా ఊపింది. అంతేకాదు, ప్రభుత్వం అనుమతి లేకుండా నిర్మించిన అవుట్‌పోస్టులకూ చట్టబద్ధత కల్పించనుంది. ఈ మేరకు గురువారం ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈ కీలక నిర్ణయం పాలస్తీనా దేశం ఏర్పడకుండా అడ్డుకుంటుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ పేర్కొనడం గమనార్హం. 1967 యుద్ధంలో ఇజ్రాయెల్ వెస్ట్‌బ్యాంక్‌ను ఆక్రమించింది. అప్పటినుంచి అక్కడికి ఇజ్రాయెలీ పౌరులను భారీగా తరలిస్తూ, వారికోసం వందల సంఖ్యలో అపార్ట్‌మెంట్లు, సకల సదుపాయాలూ కల్పించింది. ఈ తరలింపును వెస్ట్‌బ్యాంక్‌లోని 30 లక్షల మంది పాలస్తీనియన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇజ్రాయెల్ తాజా నిర్ణయం ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.

చురకలు

## సంపాదకీయం

## పాక్ మీద మోడీ సర్కార్ ఉగ్ర స్వరం

## ఏమి జరగనుంది ?

పాకిస్థాన్ మీద కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉగ్ర రూపం చూపిస్తోంది. పాకిస్థాన్ పీచమణుస్తామని అంటోంది. రెండు రోజుల పాటు గుజరాత్ లో మోడీ పర్యటించారు. ఈ సందర్భంగా పాక్ మీదనే విమర్శలు చేస్తూ విరుచుకుపడ్డారు పాక్ ఎయిర్ బేస్ మొత్తం కోమాలో ఉందని ఎద్దేవా చేశారు. మాతో పెట్టుకుంటే ఏమి జరుగుతుందో అదే చేసి చూపించామని కూడా ఖండితంగా చెప్పారు. అక్కడ నుంచి బీహార్ లో రెండు రోజులు మోడీ పర్యటించారు. ఆ మీదట యూపీలో పర్యటించారు. ఎక్కడ చూసినా మోడీ స్వరంలో కఠినంగానే పాక్ మీద ఉంది. పాక్ ఉగ్ర దాడులకు తిరుగులేని జవాబు ఇచ్చామని చెప్పిన మోడీ ఆపరేషన్ సిందూర్ ఆగేది కాదని మరోసారి చెప్పారు. అది నిరంతరం సాగుతుందని అన్నారు. భారత్ స్వదేశీయ రక్షణ వ్యవస్థతోనే పాక్ మీద దాడులు చేశామని ఆయన చెప్పారు. పాక్ కి ఎలా బుద్ధి చెప్పాలో తెలుసు అని మరో వైపు హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆయన జమ్మూ అండ్ కాశ్మీర్ లో పర్యటిస్తూ పాక్ మీద తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పాక్ లో ఉగ్ర భూతం ఉందని అన్నారు. దానికి భారత్ ధీటైన సమాధానం చెప్పిందని ఇంకా చేయాలనుకుంటే తగిన జవాబు సిద్ధంగా ఉందని అన్నారు. ఇంకో వైపు కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కూడా ఇదే విధంగా గర్జించారు. పాక్ లోని ఉగ్ర శిబిరాలను మొత్తం పాక్ నిర్మూలించాలని డిమాండ్ చేశారు. అలా చేయడం పాక్ కే మంచిదని హితవు పలికారు. పాక్ వాయు జల ఆకాశ మార్గాలలో ఏ వైపు నుంచి వచ్చినా దానికి పకడ్బందీగా జవాబు చెప్పగల సత్తా భారత్ కి ఉందని అన్నారు. పాక్ నేల నుంచే భారత్ వ్యతిరేక కార్యకలాపాలు సాగుతున్నాయని అన్నారు. ఈ విధంగా ప్రధాని సహా ఇద్దరు కీలక మంత్రులు పాక్ మీద ఒకేసారి ఒకే గొంతుతో గట్టిగా విరుచుకుపడడం తో ఏమి జరుగుతుందో అన్న చర్చ అయితే మొదలైంది. ఇంకో వైపు అఖిల పక్ష ఎంపీల బృందాలు ఇతర దేశాలలో పర్యటిస్తూ పాక్ ఉగ్రదాడుల గురించి అందరికీ వివరిస్తున్నారు. పాక్ చేస్తున్న ఆగడాల గురించి కూడా పూర్తిగా వివరిస్తున్నారు దాంతో భారత్ దౌత్యానికి ప్రపంచ దేశాల మద్దతు దక్కుతోంది. అంతే కాదు పాక్ మీద భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కి కూడా మంచి మద్దతు లభ్యోంది. ముస్లిం దేశాలు కూడా భారత్ వైపే ఉండడం కూడా భారత్ కి ఎంతో నైతిక స్థైర్యాన్ని ఇస్తోంది. ఇలా బయట గెలిచిన భారత్ మరోసారి పాక్ మీద అనూహ్యంగా విరుచుకుపడుతుందా అన్న చర్చ అయితే మొదలైంది. ట్రంప్ వల్లనే యుద్ధం ఆపేశారు అని కాంగ్రెస్ విమర్శిస్తోంది. జై హింద్ పేరుతో కాంగ్రెస్ ర్యాలీలు నిర్వహిస్తోంది. పాక్ అంతు చూస్తామని మోడీ సర్కార్ అనడం వల్లనే మద్దతు ఇచ్చామని మధ్యలో దాడులు ఆపేశారని ఆడిపోసుకుంటోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కూడా తన స్వరాన్ని మార్చి పాక్ మీద తీవ్రంగానే మాట్లాడుతోంది. మరి ఇది చివరికి ఏ వైపునకు దారి తీస్తుంది అన్నది చూడాల్సి ఉంది. ఆపరేషన్ సిందూర్ ఆగదని ఒక వైపు కేంద్రం చెబుతోంది. మరో వైపు పాక్ ఆక్రమిత కాశ్మీర్ ని వెనక్కి తెస్తామని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అంటున్నారు. ఇవన్నీ చూస్తూంటే మరో మెరుపు దాడులకు భారత్ సర్వ సన్నద్ధం అవుతోందా అన్న చర్చ సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# 10 న దేశవ్యాప్త బంద్!

(మొదటి పేజీ తరువాయి) మే 8 వరకు కారంగుట్టలో 31 మంది కామ్రేడ్లు హత్యకు గురయ్యారని,గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు, నీరు, అడవి మరియు భూమి కోసం పోరాడుతున్న దాదాపు 540 మంది విప్లవకారులు మరియు సాధారణ గ్రామస్తులను కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు హత్య చేశాయని ప్రకటన లో పేర్కొన్నారు. మావోయిస్టు రహిత భారతదేశం కోసం 2026 మార్చి 31 వరకు ఈ మారణహోమం నిర్వహిస్తామని దేశ ప్రధానమంత్రి మరియు హోంమంత్రి పదే పదే ప్రకటిస్తున్నారని,శాంతి చర్చలకు అంగీకారం ప్రకటించిన తర్వాత, గత 2 నెలలుగా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సాయుధ దళాలపై దాడి చేయకుండా సహనం/నిగ్రహం పాటించామని, ఈ పరిస్థితిలో, శాంతి చర్చలకు విముఖత చూపుతున్న కేంద్ర, రాష్ట్రాలలోని బిజెపి ప్రభుత్వ ఫాసిస్ట్ వైఖరికి వ్యతిరేకంగా దేశ పౌరులందరూ భారీ, బలమైన మరియు దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించాలని కోరారు. కామ్రేడ్ బసవరాజ్ 1955లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, జ్యాన్నపేట గ్రామంలో జన్మించారని శ్రీకాకుళం జిల్లాలో ప్రాథమిక పాఠశాల నుండి ఇంటర్మీడియట్ (12వ తరగతి) వరకు చదివారని,1974 నుండి 1979 వరకు, అతను వరంగల్ నగరంలోని రీజినల్ ఇంజనీరింగ్ కళాశాల (ప్రస్తుతం నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - %చీ×%)లో కెమికల్ ఇంజనీరింగ్ చదివాడని, 1974 చివరి రోజుల్లో, అతను విప్లవ విద్యార్థి సంస్థలో సభ్యుడయ్యాడని, 1975లో ఆంధ్రప్రదేశ్‌లో రాడికల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారని, 1980 నాటి ఉత్తర తెలంగాణ గెరిల్లా జోన్ పెర్స్పెక్టివ్-దండకారణ్య ఉద్యమ పెర్స్పెక్టివ్ సర్క్యులర్ ప్రకారం, అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ 7 గెరిల్లా పార్టీలను దండకారణ్యానికి పంపిందని, ఆ సమయంలో ఆయన తూర్పు గోదావరి-విశాఖపట్నం జిల్లాలకు పంపబడిన బృందానికి కమాండర్‌గా ఉన్నాట్లు పేర్కొన్నారు.ఆ జిల్లాల్లో ఆయన కామ్రేడ్ గంగన్న అనే పేరుతో ప్రజలకు ప్రియమైన నాయకుడయ్యాడని,1983లో, రెండు పార్టీలకు సమన్వయకర్తగా పనిచేసిన తర్వాత ఆయన జిల్లా కమిటీ సభ్యుడయ్యారని, 1985లో డివిజనల్ కమిటీ కార్యదర్శిగ, 1987లో, ఆయన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా, మరియు 1991లో, ఆయన ఆ కమిటీకి కార్యదర్శి, ఆయన 1991లోనే కేంద్ర కమిటీ సభ్యుడయ్యారని, 2001లో జరిగిన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (పీపుల్స్ వార్) జనరల్ అసెంబ్లీ (కాంగ్రెస్)లో ఆయన కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారని, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, ఆయన సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌ఛార్జ్ బాధ్యతను నిర్వహించారని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాలలోని అణగారిన జాతీయతలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటం ప్రారంభించడానికి తమ విముక్తి కోసం సాయుధ పోరాటం చేస్తున్న కొన్ని సంస్థలతో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయని, 1998లో, పీపుల్స్ వార్ పార్టీ రాజకీయ పార్టీల ఐక్యత ప్రక్రియలో పాల్గొందని, సెప్టెంబర్ 2004లో, పీపుల్స్ వార్ మరియు యం. సి సి ఐ పార్టీలు కలిసి కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్)ను ఏర్పాటు చేశాయని,2013లో, ఆయన సీపీఐ (మావోయిస్ట్) మరియు సీపీఐ (నక్సలైట్) పార్టీల ఐక్యత ప్రక్రియలో కీలక పాత్ర పోషించారని, 2007లో జరిగిన సీపీఐ (మావోయిస్ట్) ఐక్యతా కాంగ్రెస్‌లో, ఆయన మళ్ళీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారని,మరియు పొలిట్‌బ్యూరో సభ్యుడిగా కూడా ఎన్నికయ్యారని,మరియు 2017 వరకు సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇంచార్జ్ బాధ్యతలను నిర్వహించారని 2017 నుండి ఇప్పటివరకు గత 8 సంవత్సరాలుగా ఆయన సీపీఐ (మావోయిస్ట్) ప్రధాన కార్యదర్శిగా ఉన్నాట్లు ప్రకటన లో పేర్కొన్నారు. తన 51 సంవత్సరాల విప్లవాత్మక జీవితంలో, కామ్రేడ్ బసవరాజ్ భారతదేశ విప్లవాత్మక ఉద్యమానికి గణనీయమైన కృషి చేశారని, 1970లలో వరంగల్-హన్మకొండ-కాజీపేట ప్రాంతంలో విప్లవాత్మక విద్యార్థి-యువజన ఉద్యమాన్ని నిర్వహించారని, 1980లలో, ఉత్తర తెలంగాణ, దండకారణ్య ఉద్యమాలను గెరిల్లా జోన్ స్థాయిగా అభివృద్ధి చేయడంలో ఆయన ప్రత్యక్ష మార్గదర్శకత్వం అందించారని,2000 నుండి 2017 వరకు, దండకారణ్యం, బీహార్-జార?ండ్ గెరిల్లా జోన్‌లను బేస్ ఏరియాగా మార్చే లక్ష్యంతో పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఏర్పాటులో, గెరిల్లా యుద్ధాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేయడంలో మరియు ప్రజా రాజ్య అధికార సంస్థలను (జనతాన ప్రభుత్వం) ఏర్పాటు చేయడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారని. ఈ రచనలన్నింటిలోనూ, ఆయన సైద్ధాంతిక, రాజకీయ, సైనిక మరియు సంస్థాగత రంగాలలో కీలక పాత్ర పోషించారని 1985, 1991లో పార్టీలో ఉద్భవించిన వామపక్షం కుడిపక్షాన్ని ఓడించడంలో ముందుందని, 2001, 2007లో జరిగిన మహాసభలలో (కాంగ్రెస్) వామపక్షాన్ని ఓడించడంలో అది ముందుంది,2016లో 'చైనా సోషల్ ఇంపీరియలిజం' పత్రాన్ని రాయడంలో ముఖ్యమైన పాత్ర పోషించారని,. 2021లో, 'భారతదేశ జెనెసిస్ వ్యవస్థలో మార్పు మన రాజకీయ బాధ్యత' అనే పత్రాన్ని రాయడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించారని, మొత్తం మీద, 2001 నుండి 2025 వరకు, కేంద్ర కమిటీ ఆమోదించిన అన్ని పత్రాల విధాన పత్రాలను తయారు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, భారతదేశ విప్లవ ఉద్యమానికి సైద్ధాంతిక మరియు రాజకీయ మార్గదర్శకత్వం అందించారని కేంద్ర కమిటీ ప్రతి నిధి పేర్కొన్నారు. దారగడ్డ ఆంబుష్ నుండి 2010 ముకారం ఆంబుష్ వరకు, అతను అనేక సైనిక కార్యకలాపాలలో (ఆంబుష్‌లు, దాడులు) పాల్గొన్న దళాలను ప్లాన్ చేయడంలో మరియు ప్రేరేపించడంలో ప్రముఖ పాత్ర పోషించాడని,వాటిలో కొన్నింటిలో కమాండర్‌గా కూడా ఉన్నాడని, పి ఎల్ జి ఏ ని బాగా శిక్షణ పొందిన ప్రజా సైన్యంగా అభివృద్ధి చేయడానికి, ఆయన అవామి జంగ్ పత్రికకు ప్రధాన సంపాదకుడిగా ఉన్నారని, మరియు అనేక సైనిక శిక్షణా శిబిరాలను కూడా నిర్వహించారని, పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తర్వాత, ఆయన పీపుల్స్ వార్ పత్రికకు చీఫ్ ఎడిటర్ అయ్యాడని మరియు దానిని సమర్థవంతంగా నడిపించాడని పేర్కొన్నారు. పార్టీ జనరల్ సెక్రటరీ కోసం అన్వేషణ నిస్సందేహంగా పార్టీకి మరియు భారతదేశ విప్లవ ఉద్యమానికి భారీ నష్టం అని, కానీ ఈ నష్టం శాశ్వతం కాదని 1972లో, దొంగల వర్గం అప్పటి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చారుంజుందార్‌ను హత్య చేయడం ద్వారా భారతదేశంలో విప్లవ ఉద్యమం అంతరించిపోవడాన్ని జరుపుకుందని కానీ త్వరలోనే 1978లో, ఆంధ్రప్రదేశ్ మరియు బీహార్ రాష్ట్రాలలో విప్లవాత్మక ఉద్యమాలు ఉద్భవించాయని, పార్టీ కొన్ని రాష్ట్రాలకు వ్యాపించిందని,1999లో దొంగల వర్గం కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యామ్, మహేష్ మరియు మురళిలను హత్య చేయడం ద్వారా పార్టీ వెన్నెముకను విరిచినట్లు ప్రకటించి సంబరాలు చేసుకుందని కానీ 2000 సంవత్సరంలో, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ ఏర్పడిందని , గత 25 సంవత్సరాలుగా పార్టీ సామ్రాజ్యవాదాన్ని, దళారీ అధికార పెట్టుబడిదారీ విధానాన్ని, భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించడానికి ప్రజా యుద్ధానికి నాయకత్వం వహిస్తోందని, కామ్రేడ్ చారుంజుందార్ బలిదానం తర్వాత, గత 53 సంవత్సరాలలో కేంద్ర కమిటీ మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో కామ్రేడ్స్ అమరులయ్యారని, వారి బలిదానాల వల్ల భారతదేశ విప్లవ ఉద్యమానికి నష్టం వాటిల్లినప్పటికీ, ఆ నష్టాల నుండి విప్లవాత్మక ఉద్యమం ఉద్భవిస్తోందని,భారతదేశం సామ్రాజ్యవాదులు, అధికార పెట్టుబడిదారులు మరియు భూస్వామ్య శక్తులచే దోపిడీకి మరియు అణచివేతకు గురవుతున్నంత కాలం, దోపిడీకి గురైన వర్గాలు, అణచివేతకు గురైన సామాజిక వర్గాలు మరియు అణచివేతకు గురైన జాతీయతలు దానికి వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని మరియు ప్రజా యుద్ధాన్ని కొనసాగిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ వర్గ పోరాటం, ప్రజా యుద్ధం నుండి, అసాధారణ/విశిష్ట నాయకులు సాధారణ/సాధారణ ప్రజల నుండి ఉద్భవిస్తారని, అందుకే 'ఒక యోధుడు చంపబడినప్పుడు/చనిపోవడం ద్వారా వేలాది యోధులు పుడతారు' అనే పదబంధం వర్గ పోరాట నియమంగా మారిందన్నారు. దేశ విప్లవానికి కామ్రేడ్ బసవరాజ్ చేసిన సేవలను ఉన్నతీకరించడానికి, ఆయనతో పాటు మరణించిన సహచరుల బలిదానాలను ఉన్నతీకరించడానికి, ప్రతి-విప్లవాత్మక 'కగార్' యుద్ధాన్ని ప్రతిఘటించడానికి ప్రజలను సిద్ధం చేయడానికి, జూన్ 11 నుండి ఆగస్టు 3 వరకు దేశవ్యాప్తంగా అమరవీరుల స్మారక సమావేశాలను నిర్వహించాలని దేశ ప్రజలను అభ్యర్థిస్తున్నట్లు, అమర అమరవీరుల అసంపూర్ణ లక్ష్యాన్ని నెరవేర్చడానికి, దేశంలోని విద్యార్థులు, యువత, మేధావులు, కార్మికులు, రైతులు, మధ్యతరగతి, జాతీయ పెట్టుబడిదారులు, మహిళలు, దళితులు, గిరిజనులు, మతపరమైన మైనారిటీలు, అణగారిన జాతీయులు దేశ విప్లవ ఉద్యమంలో చేరాలని మావొయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతి నిధి అభయ్ పేర్కొన్నారు.



# విలక్షణ రాజకీయ నాయకుడు నీలం సంజీవరెడ్డి - జూన్ 1...నీలం సంజీవరెడ్డి వర్ధంతి

నీలం సంజీవరెడ్డి విలక్షణ నాయకులు. భారత దివంగత రాష్ట్రపతి సంజీవరెడ్డి రాజకీయ జీవితం అనేక ఒడిదుడుకులతో కూడుకున్నది. విజయాలు, అపజయాలు, త్యాగాలు, సాహసోపేత నిర్ణయాలు, రాజకీయపు ఎత్తుగడలతో కూడిన రాజకీయ జీవితం ఆయనది. 1940 ల నుండి 1970ల వరకు మూడు దశాబ్దాల రాష్ట్ర, దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రతి ముఖ్య సంఘటనతోను ఆయనకు ప్రత్యేక, ప్రత్యక్ష, సంబంధాలు, ప్రమేయాలు ఉన్నాయి. భారత రాష్ట్రపతిగా ఏకగ్రీవంగా ఎన్నికైన అరుదైన రికార్డు రాష్ట్రపతి సంజీవరెడ్డికే దక్కింది. లోక సభాపతిగా ఎన్నిక కాగానే, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన మొదటి లోక్‌సభ సభాపతి, సంజీవరెడ్డి కావడం విశేషం. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి అధికారపక్ష - ప్రతిపక్షం మధ్య సమన్వయ సాధనకు కృషి చేసి, స్పీకర్ పదవికే వన్నె తెచ్చిన ఆదర్శ నేత నీలం. లోక్‌సభ సభాపతిగా రెండు సార్లు ఎన్నికై, రెండుసార్లూ రాష్ట్రపతిగా పోటీ చేసేందుకై రాజీనామా చేసిన చరిత్ర ఆయనకు ఉంది. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటు, ఆ తరువాతి రాజకీయ చరిత్రలతో సంజీవరెడ్డి పాత్ర విస్మరించ రానిది. నీలం సంజీవరెడ్డి (మే 19, 1913 - జూన్ 1, 1996) భారత రాష్ట్రపతి గా, ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా, లోక్‌సభ సభాపతిగా, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, సంయుక్త మద్రాసు రాష్ట్రంలో మంత్రిగా, అఖిల భారత కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడిగా వివిధ పదవులను అలంకరించి, ప్రజల మన్ననలను పొందిన సుదీర్ఘ రాజకీయ అనుభవ శాలి సంజీవ రెడ్డి. అనంతపురం జిల్లా, ఇల్లూరు గ్రామంలో 1913, మే 18 న రైతుబిడ్డగా సంజీవరెడ్డి జన్మించారు. మద్రాసు దివ్యజ్ఞాన సమాజం పాఠశాల లోను, అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను చదువుకున్నారు. 1929 లోనే మహాత్మా గాంధీ స్ఫూర్తితో చదువును పక్కనపెట్టి రాజకీయాల్లో చేరి స్వాతంత్ర్య పోరాటం వైపు దృష్టి సారించారు. 1937లో ఆంధ్ర ప్రాంతీయ కాంగ్రెసు కమిటీకి కార్యదర్శిగా ఎన్నికై దాదాపు పదేళ్ళపాటు ఆ పదవిలో కొనసాగారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. 1940, 1945 ల మధ్య ఎక్కువకాలం అతను జైలులో ఉన్నారు. 1946లో మద్రాసు శాసనసభకు, తర్వాత 1947లో రాజ్యాంగ నిర్మాణ సంఘమైన రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. 1949 నుండి 1951 వరకు మద్రాసు రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసారు. 1951 లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు మంత్రిపదవికి రాజీనామా చేసారు. 1951లో ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్ష పదవికి ఎన్.జి.రంగాతో పోటీ పడ్డారు. ప్రకాశం పంతులు మద్దతు ఉన్నా, రంగాను ఆ ఎన్నికలలో ఓడించారు. ఫలితంగా ఆచార్య రంగా, ప్రకాశం కాంగ్రెసును వదిలి వెళ్ళారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు సంయుక్త మద్రాసు రాష్ట్ర శాసనసభ సభ్యుల నుండి కొత్త రాష్ట్ర కాంగ్రెసు శాసనసభా పక్ష నాయకుణ్ణి ఎన్నుకునే సమయంలో సంజీవరెడ్డి పోటీలేకుండా ఎన్నికయ్యారు. ముఖ్యమంత్రి పదవి తథ్యమైనా, అప్పటి రాజకీయాల ఫలితంగా తాను తప్పుకుని టంగుటూరి ప్రకాశం పంతులుకు నాయకత్వం అప్పగించి, ఉప ముఖ్యమంత్రి అయ్యారు. మళ్ళీ 1955లో రాజకీయాల ఫలితంగానే ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని వదులుకున్నారు. అప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చెయ్యడానికి ఎన్.జి.రంగా నాయకత్వం లోని కృషికార్ లోక్ పార్టీ మద్దతు కాంగ్రెసుకు అవసరమైంది. అయితే బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రి అయితేనే తాము మద్దతు ఇస్తామని రంగా ప్రకటించడంతో తాను తప్పుకుని మళ్ళీ ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణలో సంజీవరెడ్డిది ప్రముఖపాత్ర. రాష్ట్ర స్థాపనలో ప్రధాన, నిర్ణాయక ఘట్టమైన పెద్దమనుషుల ఒప్పందంలో ఆంధ్ర తరపున అప్పటి ఆంధ్ర ముఖ్యమంత్రి, బెజవాడ గోపాలరెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సంజీవరెడ్డి కూడా పాల్గొని ఒప్పందంపై సంతకం చేశారు. ఆంధ్ర ప్రదేశ్ అవతరించాక, కాంగ్రెసు శాసనసభాపక్ష నాయకుడిగా బెజవాడ గోపాలరెడ్డిని ఓడించి, తాను ముఖ్యమంత్రి అయ్యారు. అల్లూరి సత్యనారాయణ రాజును రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష పదవి పోటికి నిలబెట్టి, రంగాను ఓడించారు. 1960లో అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవికి తాను ఎన్నికవడంతో ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. అలా కాంగ్రెసు అధ్యక్షుడిగా రెండేళ్ళు పనిచేసి, మళ్ళీ 1962లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. రవాణా సంస్థల జాతీయీకరణ వివాదంలో సుప్రీం కోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పు పట్టడంతో 1964 ఫిబ్రవరి 29 న పదవికి రాజీనామా చేసారు. తర్వాత కేంద్ర రాజకీయాలలో క్రియాశీలక పాత్ర పోషించారు. 1964 జూన్ 9 న లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వంలో ఉక్కు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1967లో ఇందిరా గాంధీ ప్రభుత్వంలో కూడా కొద్దికాలం మంత్రిగా చేసారు. 1967లో నాలుగవ లోక్‌సభకు హిందూపురం నియోజక వర్గం నుండి ఎన్నికై, లోక్‌సభకు సభాపతిగా కూడా ఎన్నికయ్యారు. సభాపతి నిష్పాక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఎన్నిక కాగానే, కాంగ్రెసు సభ్యత్వానికి రాజీనామా చేసాడు. కాంగ్రెస్ పార్లమెంటరీ బోర్డు 1969 జూలై 10న బెంగళూరులో సమావేశం అయి, పార్టీ అధ్యక్షుడు నిజలింగప్ప, ప్రధాని ఇందిర సహా పార్టీలోని పెద్దలు కె. కామరాజ్, మొరార్జీ దేశాయి తదితరుల చర్చల అనంతరం 1969 జూలై 19 న సభాపతి పదవికి రాజీనామా చేసి, రాష్ట్రపతి పదవికి ఇందిరా గాంధీకి ఇష్టం లేకున్నా, కాంగ్రెస్ సీనియర్ నేతల నిర్ణయం మేరకు, ఇందిర నామినేషన్ దాఖలు లు వెంట రాగా, పోటీ చేసారు. “అంతరాత్మ ప్రబోధం” అనే ఇందిర నినాదంతో, కాంగ్రెసు అంతర్గత రాజకీయాల ఫలితంగా మరో తెలుగు వారు - వి.వి.గిరి - చేతిలో కొద్ది తేడాతో ఓడి పోయారు.



నీలం సంజీవరెడ్డి

1969 ఆగస్టులో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో మొత్తంగా 8,36,337 ఓట్లు నమోదు కాగా, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన వి.వి. గిరికి 4,20,077 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి నీలం సంజీవరెడ్డికి 4,05,427 ఓట్లు వచ్చాయి. రెండో ప్రాధాన్యత ఓట్లతో వి.వి. గిరి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. తర్వాత పరిణామాలతో 1969 చివర్లో కాంగ్రెస్ పార్టీ రెండుగా చీలిపోయింది. 1975 లో జయప్రకాశ్ నారాయణ్ హైదరాబాదులో జరిపిన పర్యటనతో రాజకీయాల్లో తిరిగి క్రియాశీల రాజకీయాల్లో పాలు పంచుకున్నారు. 1977లో ఎమర్జెన్సీ తరువాత, జనతాపార్టీ ప్రభంజనం... కాంగ్రెసును అధికారం నుండి దూరం చేసి నపుడు, తెలుగు ప్రజలు మాత్రం కాంగ్రెసు వైపే ఉన్నారు, పట్టం కట్టారు. 42 స్థానాలకుగాను, 41ని కాంగ్రెసు గెలుచుకుంది. జనతాపార్టీ గెలిచిన ఒక్క స్థానమూ మాత్రం సంజీవరెడ్డిదే కావడం గమనార్హం. అలా మళ్ళీ లోక్‌సభ సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1977లో రాష్ట్రపతిగా ఉన్న ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ మరణించడంతో నీలం సంజీవరెడ్డిని ఎన్నుకునేందుకు నాటి జనతా పార్టీ నిర్ణయం తీసుకాగా, విపక్షంలో ఉన్న ఇందిరా గాంధీ కూడా సంజీవ రెడ్డికి మద్దతివ్వడంతో సంజీవరెడ్డి ఏకగ్రీవంగా రాష్ట్రపతి పదవికి ఎన్నికయ్యారు. 1982 లో రాష్ట్రపతి పదవి నిర్వహణ పూర్తయ్యాక, రాజకీయాల నుండి శాశ్వతంగా దూరమై, బెంగుళూరులో స్థిరపడగా ,1996 జూన్ 1 న నీలం సంజీవరెడ్డి మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494

చురకలు



# చినుకు పడితే నరకమే

మంథని: మంథని మండలం సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లి పునరావాస కాలనీ వరకున్న రహదారి చిన్నపాటి వర్షానికే చిత్తడవుతోంది. అధ్వానంగా ఉన్న రహదారిపై వందలాది వాహనాలు వెళుతుండటంతో గుంతలమయంగా మారింది. ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరయ్యపల్లి నుంచి రచ్చపల్లికి 2 కిలోమీటర్ల దూరంలో ఎనిమిది మలుపులున్నాయి. వారానికి ఒక ప్రమాదం జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.

**ప్రతిపాదించినా కార్యరూపం దాల్చలే**

సూరయ్యపల్లి–రచ్చపల్లి రహదారిపై గుంతలు తేలడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనాడులో వరుస కథనాలురాగా ఆరు నెలల క్రితం సింగరేణి సంస్థ పూడ్చి వేసింది. రోజుకు వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుండటంతో కొద్ది రోజులకే రహదారి పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించడానికి సీఆర్ఆర్ నిధులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినప్పటికి కార్యరూపం దాల్చడం లేదు.

**పదేళ్ల క్రితం తారు నిర్మాణం**

గతంలో మట్టి రోడ్డు ఉండగా.. పదేళ్ల క్రితం సింగరేణి బిట్టుపల్లి



శివారులో అసైన్డ్ భూమిని సేకరించి రచ్చపల్లి, అక్కెపల్లి, భూనిర్వాసితులకు పునరావాసకాలనీ కోసం రూ.2 కోట్లతో తారు రోడ్డు నిర్మించారు. ఈ మార్గం ద్వారా మంథని మండలంలోని బిట్టుపల్లి, ధర్మారం, గోపాల్‌పూర్, చిన్న ఓదాల.. ముత్తారం మండలంలోని సీతంపల్లి, ఖమ్మంపల్లి, జిల్లాలపల్లి వాసులు రాకపోకలు సాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఖమ్మంపల్లి నుంచి భూపాల్‌పల్లి జిజిల్లా తాడిచెర్ల మధ్య మానేరుపై వంతెన ప్రారంభించడంతో నిత్యం వెయ్యి వరకు వాహనాలు నడుస్తున్నాయి. దీనిపై సింగరేణి జీఎంను వివరణ కోరగా.. రచ్చపల్లి, అక్కెపల్లి వాసులకు పునరావాసం కాలనీ నిర్మాణం పూర్తి కావడంతో ఇక ఈ రోడ్డు గురించి తమకు సంబంధం లేదని వివరణ ఇచ్చారు.

**ప్రమాదాలు జరుగుతున్నాయి**

సూరయ్యపల్లి–రచ్చపల్లి రహదారి విస్తరణకు నిధులు కేటాయించాలి. ఇరుకుగా ఉన్న రోడ్డుపై గుంతలు పడటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ముగ్గురు మృతి చెందారు. వానాకాలంలో నీరు నిలిచి తీవ్ర ఇబ్బందవుతుంది. ఈ ప్రదేశంలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలి. సంతోష్, ఖమ్మంపల్లి

# నిర్వహణ లేక.. నిరుపయోగం

జగిత్యాల : జిల్లాలోని 71 ఏఈవో క్లస్టర్లలో 2021లో నిర్మించిన రైతువేదికల నిర్వహణ భారంగా మారింది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రూ.22 లక్షల చొప్పున నిధులు వెచ్చించి నిర్మించిన వేదికల్లో చాలావరకు నిరుపయోగంగా ఉంటున్నాయి. జిల్లాలోని 71 వేదికలకు 19 రైతువేదికల్లో ఇదివరకే దృశ్యశ్రవణ(వీడియో కాన్ఫరెన్స్) సదుపాయం ఉండగా తాజాగా మరో 33 వేదికల్లో వీసీ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలుండగా 71 క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించి ఒక్కో వేదిక పరిధికి రెండు మూడు నుంచి ఏడెనిమిది గ్రామాలవరకు చేర్చారు. ప్రతి మంగళవారం రైతునేస్తం ద్వారా రైతువేదికల్లో శాస్త్రవేత్తలు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ పథకాలు, పంటసాగు యాజమాన్యం, రాయితీలు, సూచనలిస్తున్నా రైతులు రాక మొక్కుబడిగానే ముగిస్తున్నారు. నాసిరకం పనులు, నిర్వహణ, మరమ్మతుల్లేక చాలాచోట్ల వేదికల్లోని నిర్మాణాలు దెబ్బతింటున్నాయి.

**బహుళ వినియోగం అవసరం**

రైతులకు సాంకేతిక సలహాలతో పాటు పథకాలకు దరఖాస్తుల స్వీకరణ, విత్తనాల సరఫరా, భూసార పరీక్షలు తదితర బహుళ వినియోగ నేపథ్యంగా నిర్మించిన రైతువేదికలు చాలాచోట్ల ఊరికి దూరంగా నిర్మించటంవల్ల నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రతి రైతు వేదికకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈవో) బాధ్యులుగా ఉండగా దాదాపు 60 శాతానికిపైగా మహిళలే ఏఈవోలుగా ఉండగా వీరు గుట్టలప్రాంతంలోని వేదికల్లోకి ఒంటరిగా వెళ్లి విధులు నిర్వర్తించేందుకు జంకుతున్నారు. కనీసం వేదికకొక అటెండర్ కూడా లేకపోవటంతో ఏఈవోనే తాళం తీసుకొని, ఊడ్చి శుభ్రంచేసుకొని పనులు చేసుకుందామన్నా నిర్మానుష్య ప్రాంతంలోని వేదికల్లో భయంభయంగా గడుపుతున్నారు. ఒక్కో రైతు వేదికకు నెలనెలా విద్యుత్ ఛార్జీలు, స్టేషనరీ, శిక్షణలు తదితరాలకు రూ.9 వేల చొప్పున నిర్వహణ ఖర్చులను ఇవ్వాల్సిఉంది. గతంలో రూ.95 వేల ఖర్చుతో ఒక్కో మినీ




భూసార పరీక్ష ల్యాబ్ పరికరాలు తేగా వీటిద్వారా వేదికల్లో భూసార పరీక్షలను చేపట్టాల్సి ఉంది. రైతు వేదికల్లోనే విత్తనాలు, రసాయన ఎరువులను నిల్వచేసి ఏఈవోల ద్వారా రైతులకు విక్రయించటం అనువుగా ఉంటుంది. రెవెన్యూ సేవలకు కూడా వేదికలను వినియోగించుకునే వీలుంది. రాయితీ విత్తనాలను, యంత్ర పరికరాలను కూడా వేదికలద్వారానే పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆలోచనను అమల్లోకి తేవాలి. ఈ నేపథ్యంలో ప్రతి రైతు వేదికకొక సహాయకుడిని నియమించటం, మౌలిక వసతులు కల్పిస్తే రైతులకు వారివారి గ్రామాల్లోనే సేవలందుతాయి.

**అదనంగా 33 వేదికల్లో దృశ్యశ్రవణం**

ఇదివరకే 19 వేదికల్లో వీసీ సదుపాయం ఉండగా మరో 33 వేదికలకు విస్తరిస్తున్నాం. రైతులకు అన్నిరకాల సేవలను రైతువేదికలద్వారానే చేపట్టేలా ప్రభుత్వం విస్తరణ కార్యకలాపాలను అమలు చేయనుంది. వి.భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

# ప్రగతి ప్రతిపాదనలకే పరిమితం



సుల్తానాబాద్: 'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ'ని చందాన మారింది సుల్తానాబాద్ మండలంలో రూర్బన్ పథకం పనుల పరిస్థితి. గ్రామీణ ప్రాంతాల్లో పట్టణ స్థాయి వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ పథకాన్ని అమలులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లాలో సుల్తానాబాద్, జమ్మికుంట మండలాలను ఎంపిక చేశారు. 2018లో సుల్తానాబాద్ మండలాన్ని రూర్బన్ పథకానికి ఎంపిక చేసిన అధికారులు రూ.100 కోట్ల విలువైన పనులకు సంబంధించిన ప్రతిపాదనలతో డీపీఆర్ రూపొందించారు. ఇందులో మొదటి విడతగా రూ.30 కోట్లను కేంద్రం విడుదల చేసింది. రహదారులు, పంచాయతీ భవనాలు, గ్రామీణ గిడ్డంగులు, మినీ ఆడిటోరియం తదితర నిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని అసంపూర్తిగా నిలిచాయి. పలు ప్రతిపాదనలు కాగితాలు కూడా దాటలేదు. మొదటి విడత పనులను గడువులోగా పూర్తి చేయకపోవడంతో రెండో విడత నిధులు మంజూరు కాలేదు. ఫలితంగా ఎక్కువ శాతం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

**గుత్తేదారుల నిరాసక్తత**

రూర్బన్ పథకం మండలంలో చేపట్టిన పలు పనులకు రూ.10 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు నిరాసక్తత కనబరుస్తున్నారు. రూర్బన్ పథకం పనుల పూర్తికి 2023 డిసెంబరు 31 వరకు గడువు విధించారు. 2024 మార్చి 31 వరకు పొడిగించాలని జిల్లా అధికారులు ప్రయత్నించినా అప్పటికే శాసనసభ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మిగిలిన పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయాయి.

**నిలిచిన నిర్మాణాలు**

సుల్తానాబాద్ సుభాష్‌నగర్ సమీపంలో రూ.2 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. రెండేళ్లుగా ఇనుప చువ్వలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తప్పుపట్టాయి. కొద్ది రోజులు పోతే పూర్తిగా పనికి రాకుండా పోయే పరిస్థితి.

గర్రెపల్లిలో రూ.60 లక్షలతో మినీ ఆడిటోరియం, రూ.8 లక్షలతో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసినా కార్యరూపం దాల్చలేదు. ఇదే గ్రామంలో రూ.20 లక్షలతో రాజీవ్ రహదారి నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రెండు వరుసల రహదారి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టగా అసంపూర్తిగా ఉండిపోయాయి.

మండలకేంద్రంలోని దర్గానగర్‌లో రూ.65 లక్షలతో మాంసం విక్రయశాలల పనులు చేపట్టగా స్లాబ్ వరకు పూర్తయ్యాయి. రెండేళ్లుగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

సుల్తానాబాద్ సుభాష్‌నగర్‌లో రూ.కోటితో నిర్మించిన అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం పిల్లర్లకే పరిమితం కాగా పిచ్చిమొక్కలు పెరిగాయి. నీ మండలంలో పలు గ్రామాల్లో పంచాయతీ, ఈ–పంచాయతీ భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి.

**ప్రభుత్వానికి నివేదించాం**

మండలంలో రూ.30 కోట్ల రూర్బన్ పనులు చేయగా సుమారు రూ.20 కోట్ల చెల్లింపులు జరిగాయి. నిలిచిపోయిన పనులు, రావాల్సిన బిల్లులపై ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. దేవేందర్, పీఆర్ డీఈఈ

# జోరుగా మక్కల కొనుగోళ్లు.. భారీగా నిల్వలు



జమ్మికుంట: వ్యాపార కేంద్రమైన జమ్మికుంటలో మక్కల కొనుగోళ్లు గతంకంటే రెట్టింపు జరిగాయి. పత్తి సీజన్ ముగియటంతో పలువురు పత్తి, అడ్తి వ్యాపారులు, మక్కల ఖరీదుదారులు కొనుగోళ్లను మార్చి చివరి వారం నుంచే చేపట్టారు. కొనుగోలు చేసిన మక్కలను నిల్వ చేస్తే మంచి లాభం ఉంటుందనే ఆశతో పెద్దమొత్తంలో నిల్వ చేశారు. **రికార్డు స్థాయిలో..**

గత సంవత్సరం జమ్మికుంటలో 96,705 క్వింటాళ్ల మక్కలను వ్యాపారులు ఖరీదు చేయగా.. ఈసారి గత నెల నాటికే రికార్డు స్థాయిలో 2,01,387 క్వింటాళ్ల మక్కలను వ్యాపారులు ఖరీదు చేయటం విశేషం. జిల్లాతోపాటు పెద్దపల్లి, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాల రైతులు మక్కలను విక్రయించారు.

మున్ముందు ధర పెరుగుతుందనే ఆశతో మార్కెటింగ్ శాఖ లైసెన్సులు లేని చిరువ్యాపారులు సైతం కొనుగోళ్లు చేపట్టారు. ఇలా నలుగురు కొనుగోలు చేశారని అధికారులు చెబుతున్నా.. 8 మందికిపైగా ఉండొచ్చని తెలుస్తోంది. జమ్మికుంటలో 32 మంది లైసెన్స్ వ్యాపారులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. లైసెన్సులు లేకుండా ఎందరు కొనుగోలు చేశారనే విషయం తనిఖీలు చేస్తేనే బహిర్గతం కానుంది. సీజన్ మొదట్లో మక్కల ధర రూ.2,425 ఉండగా తాజాగా రూ.2,300కు తగ్గింది. దీంతో మొదట్లో మక్కలు కొనుగోలు చేసిన వ్యాపారులు అయోమయంలో పడ్డారు. పౌల్ట్రీఫామ్‌లు, బిస్కెట్లు, ఇతర పరిశ్రమల నుంచి మక్కల కోసం ఆర్డర్లు రాకపోవటంతో విక్రయాల కోసం నిరీక్షిస్తున్నారు. స్థానిక ఓ పౌల్ట్రీఫామ్‌లో ధర అధికంగా ఉండటంతో తక్కువ ధరకు కొనుగోలు చేసిన మక్కలను చిరువ్యాపారులు అక్కడే విక్రయిస్తున్నారని తెలిసింది.

కొనుగోలు చేసిన మక్కలను పత్తి జిన్నింగ్ మిల్లులు, ప్రత్యేక షాపింగ్ గదుల్లో నిల్వ చేస్తున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ గిడ్డంగిని అద్దెకు తీసుకొని నిల్వ చేస్తున్న ఓ ఖరీదుదారు.. తేమ ఉన్న మక్కలను గిడ్డంగిలోనే ఆరపెట్టించారు. వ్యాపారులు రోజూవారీగా సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, ఇతర ప్రాంతాల్లో ధరలను తెలుసుకుంటూ మంచి ధర వస్తే విక్రయానికి తరలిస్తున్నారు.

లైసెన్స్ లేకున్నా కొనుగోలు చేసిన వ్యాపారులు.. మక్కలను విక్రయించే సమయంలో మార్కెట్‌కు ఒక శాతం ఆదాయం జమవుతుందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం స్పష్టం చేశారు. లైసెన్స్ లేని నలుగురికి గతంలోనే నోటీసు జారీ చేశామని.. జీరో వ్యాపారానికి అవకాశం లేదని తెలిపారు. జమ్మికుంట మార్కెట్‌కు మక్కల ద్వారా రూ.60 లక్షల ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు.

# సమస్యల సుడిలో ప్రభుత్వ బడి



సిరిసిల్ల : ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా జిల్లాలోని పలు ప్రభుత్వ విద్యాలయాలు అసౌకర్యాలకు నిలయాలుగా ఉన్నాయి. గతంలో 'మన ఊరు.. మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా పాఠశాలలకు మరమ్మతులు చేపట్టారు. కొన్నిచోట్ల నిధులు ఖర్చు చేసినా సమస్యలు కనుమరుగవడం లేదు. మరికొన్ని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా వదిలేశారు. పనులు చేపట్టేందుకు అనువైన వేసవి సెలవులను ఉపయోగించుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

**ఇదీ పరిస్థితి**

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలు 40 ఉన్నాయి. వీటితోపాటు ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తరగతి గదులు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. కుళాయిలు, మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థులకు సంఖ్యకు సరిపోయేలా లేవు. కొన్నిచోట్ల వాష్‌బేసిన్, నీటి కుళాయిలు ఊడిపోయాయి. తలుపులు, కిటికీలు విరిగిపోయి ఉన్నాయి. మూత్రశాలల ట్యాప్‌లు నాసిరకంగా ఉండడంతో లీకేజీ వల్ల పాఠశాలంతా దుర్గంధం వ్యాపిస్తూ పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. కొన్ని పాఠశాలల్లో మంచినీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు కానీ.. ట్యాప్‌లు అనుసంధానం చేయడం మరిచారు. మరకొన్ని చోట్ల నాసిరకమైనవి అమర్చడంతో విరిగిపోయాయి. రక్షణగా నిర్మించిన ప్రహరీల వల్ల ఉపయోగమే లేకుండా పోయింది. నిత్యం పాఠశాలల్లోకి కుక్కలు, పందులు, పశువులు వస్తున్నాయి. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి అసంపూర్తి పనులు పూర్తి చేస్తే ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంది.

**చర్యలు తీసుకుంటాం**

'మన ఊరు.. మన బడి', అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఎంపికైన పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టారు. మరికొన్ని చోట్ల దశల వారీగా పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందించేలా చర్యలు తీసుకుంటాం. డి.రఘుపతి, సిరిసిల్ల మండల విద్యాధికారి

# పూడికతీతకు సమయమిదే!

సిరిసిల్ల: జలాశయాల్లో పేరుకుపోయిన పూడికతీతకు ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. నీటిలోనే యంత్రాలను అమర్చి లోపలి నుంచి మట్టి, ఇసుకను ఒడ్డుకు (సెడమెంటేషన్ విధానంలో) తరలిస్తారు. దీనికి రాష్ట్రంలో నిర్మల్ జిల్లా కడెం, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మధ్య, దిగువమానేరు జలశయాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. జనవరిలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. అప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో మార్చి మొదటి వారం వరకు వాయిదా వేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ఇటీవలే రెండు జలాశయాల ఉన్నతాధికారులతో ఒప్పందం చేసుకుంది. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు కొంతైనా పూడిక తొలగిస్తే.. నీటినిల్వ సామర్థ్యం పెరుగుతుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

**ఇరవై ఏళ్ల ప్రణాళిక**

మధ్యమానేరు జలాశయం 27.50 టీఎంసీల సామర్థ్యంతో 2018లో నిర్మాణం పూర్తయింది. దీని నిర్మాణంలో 12 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. వీటి అవశేషాలకు తోడు ఏటా వర్షాకాలం మానేరు, మూలవాగుల నుంచి భారీ వరదలకు ఇసుక, మట్టి జలాశయంలో చేరుతోంది. ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం పది టీఎంసీలకు చేరుకున్నప్పుడు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నీటి శుద్ధిప్రక్రియపై ఒత్తిడి పెరగడం.. ఫలితంగా సరఫరాలో నీరు రంగుమారి తరచూ అవాంతరాలు తలెత్తుతున్నాయి.



ఎస్సారెస్పీ నుంచి వరంగల్, నల్గొండ జిల్లాలకు సాగు నీరందించేందుకు 1985లో దిగువ మానేరును 26 టీఎంసీలతో నిర్మించారు. ప్రస్తుతం దీనిలో నిటినిల్వ సామర్థ్యం 24 టీఎంసీలే ఉంటోంది. దిగువ మానేరులో 131 లక్షలు, మధ్యమానేరులో 247 లక్షల టన్నుల పూడికను తీయనున్నారు. ఈ రెండు జలాశయాల్లో పూడికతీత ప్రక్రియ ప్రారంభమైతే వచ్చే ఏడాది పెద్దపల్లి జిల్లాలోని ఎల్లంపల్లిలోనూ ఈ ప్రక్రియ ద్వారా పూడికతీసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జలాశయాల్లోని నీటి నమూనాలు పరీక్షించినప్పుడు ఇసుకతోపాటు అధికమొత్తంలో మట్టి, సిల్ట్, గ్రావెల్ ఉన్నట్లు గుర్తించారు. నీటి నిల్వ, తాగు, సాగునీటి తరలింపులకు ఇబ్బందులు తలెత్తకుండా జలాశయం మధ్యలోకి యంత్రాలను పంపించి అందులోని వ్యర్థాలను మాత్రమే బయటకు తీస్తారు. ఇలా వచ్చిన సిల్ట్ నుంచి ఇసుకను వేరు చేస్తారు. దీనిని గుత్తేదారు నీటి పారుదలశాఖకు టన్నుకు రూ.339.66 చొప్పున చెల్లించి విక్రయిస్తారు. ఒండ్రు మట్టిలోనూ పోషకాలు ఉంటాయి. దీన్ని ఎం చేస్తానరేది స్పష్టత లేదు.

మూడు జలాశయాల పూడికతీతకు రూ.1439.55 కోట్లతో చేపట్టే పనులు 20 ఏళ్ల పాటు కొనసాగుతాయి. వర్షాకాలం వరదల సమయంలో పూడికతీయలేని పరిస్థితి. నవంబరు నుంచి మే జూన్ వరకు మాత్రమే పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.

**అనువైన స్థల పరిశీలన**

పూడిక తీత పనులు దక్కించుకున్న గుత్తేదారు సంస్థ ఒప్పందం చేసుకుంది. నీటి నుంచి పూడిక తీసేవిధానం కొత్తది. దీని నుంచి వచ్చిన మట్టి, ఇసుకను వేరు చేయాలి. జలాశయంలో యంత్రాల బిగింపు, బయటకు తీసిన మట్టి, ఇసుకను వేరు చేసేందుకు అనువుగా ఉన్న స్థలాలను సంస్థ ప్రతినిధులు పరిశీలిస్తున్నారు. త్వరలోనే యంత్రాలను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. ఇసుక విక్రయాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయంతోపాటు జలాశయానికి పూడిక భారం తగ్గుతుంది. జగన్, ఈఈ, మధ్యమానేరు జలాశయం

# రోడ్డెక్కని పనులు.. తప్పని అవస్థలు

మెట్‌పల్లి : గ్రామీణ రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించినా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో గుంతల రోడ్లపై వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. మెట్‌పల్లి మండలంలో పలు రహదారులు గుంతలమయంగా మారాయి. చాలా రోజుల కిందట నిర్మించిన రహదారులు బీటీ లేచి పోయి అధ్వానంగా తయారయ్యాయి. రామలచ్చక్కపేట నుంచి ఏఎస్ఆర్ తండా గ్రామాల మధ్య రహదారి పూర్తిగా బీటీ లేచి కంకర తేలింది. జగ్గాసాగర్ నుంచి కొండ్రికర్ల వెళ్లే దారిలో కొంత దూరం గుంతలమయంగా మారింది. వర్షాకాలంలో నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి పెద్దాపూర్ గురుకుల పాఠశాల రహదారిలో గుంతలమయంగా మారింది. రహదారుల మరమ్మతుకు నిధులు మంజూరై చాన్నాళ్లు కావస్తున్నా బిల్లుల విడుదలలో ఆలస్యం అవుతుందనే ఉద్దేశంతో గుత్తేదారులు ఎవరూ పనులు పూర్తి చేయడానికి ముందుకు రావడం లేదని



తెలుస్తోంది. అసలు పనులు జరుగుతాయో? లేదో?నన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

**నిధులు మంజూరైనా..**

మండలంలో పలు రహదారులు అధ్వానంగా మారడంతో పునర్నిర్మాణానికి గతంలో నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించకపోవడంతో గుంతల ప్రయాణం తప్పడం లేదు. రామలచ్చక్కపేట–ఏఎస్ఆర్ తండా రహదారికి రూ.1.50 కోట్లు, చౌలమద్ది–వెల్లుల్ల మధ్య రూ.50 లక్షలు, పెద్దాపూర్ క్యాంపు రోడ్డుకు రూ.68 లక్షలు, కొండ్రికర్ల–జగ్గాసాగర్ రోడ్డుకు రూ.40 లక్షలు, రామలచ్చక్కపేట–మెట్లచిట్టాపూర్‌లతో పాటు పలు రహదారులు నిధులు మంజూరు చేశారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించి అవస్థలు తీరేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మరో 40 బడుల్లో ఏఐ పాఠాలు

పెద్దపల్లి : ప్రాథమిక స్థాయి పిల్లలకు కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా బోధించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. గతేడాది మార్చిలో ప్రయోగాత్మకంగా కొన్ని పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి ప్రగతి బాట పట్టేందుకు ఏఐ ప్రోత్సహిస్తోంది. తెలుగు, ఆంగ్లం, గణిత చతుర్విధ ప్రక్రియల్లో పట్టు సాధిస్తున్నారు. ఈ ఏడు ఉన్నత పాఠశాలల్లోనూ అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది.

**కార్పొరేటుకు దీటుగా..**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రమాణాలు ఏటికేటా పడిపోతున్నాయి. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా సాంకేతిక పాఠాలు బోధించేందుకు ఏ-ఎక్సెల్(అసిస్టెడ్ లాంగ్వేజీ అండ్ మ్యాథ్స్ లర్నింగ్) విధానాన్ని ప్రవేశపెట్టారు. గతేడాది ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ పాఠాలు బోధించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తుల పంపిణీతోపాటు సాంకేతిక బోధన అందనుండటంతో ప్రవేశాలు పెరగనున్నాయని భావిస్తున్నారు.

**అమలు ఇలా..** ప్రతి విద్యార్థికి కేటాయించిన శాశ్వత గుర్తింపు సంఖ్యతో



లాగిన్ కావాలిఆహ్లాద వాతావరణంలో విద్యార్థులను చదివించడం, రాయడం నేర్పిస్తారు తెలుగు, ఆంగ్లం, గణితంకు సంబంధించి ఎనిమిది దశల్లో సామర్థ్యాలను ఏఐ అంచనా వేస్తుంది

ఒక దశ సంపూర్ణంగా పూర్తయితేనే మరొకటి తెరుచుకుంటుంది

వెనకబడిన విద్యార్థుల్లో గణిత చతుర్విధ ప్రక్రియల సామర్థ్య శాతాన్ని పెంచుతుంది

**ప్రవేశాలు పెంచే దిశగా..**

జిల్లాలో గతేడాది ప్రయోగాత్మకంగా 20 ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ బోధనకు అనుమతి రాగా వీటిలో మూడు చోట్ల కంప్యూటర్లు లేకపోవడంతో తరగతులు నిర్వహించలేదు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో మరో 40 పాఠశాలల్లో అమలు చేసేందుకు ప్రతిపాదించారు. అందుకు అనుమతి రావాల్సి ఉంది. 6-10వ తరగతి విద్యార్థుల గణిత పుస్తకంలో ఏఐ సిలబస్ ముద్రిస్తున్నారు. పతాక స్థాయిలో పడిపోతున్న ప్రవేశాలు పెంచేందుకు ఈ విధానం దోహదపడనుంది. అయితే కొన్ని పాఠశాలల్లో కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ఆశయంపై ప్రభావం చూపుతోంది.

**కఠిన పదాలు నేర్చుకున్నా**

కంప్యూటర్‌తో తెలుగు, ఆంగ్లం, గణితంలో కఠిన పదాలను నేర్చుకున్నా. వాక్యాలు అనర్గళంగా చదివేందుకు ఉపయోగపడింది. చదవడం, రాయడంలో తప్పులు సరిదిద్దుకున్న. ఆహ్లాద వాతావరణంలో నేర్పిస్తున్నారు. అయాన్, 4వ తరగతి, మంథని

**అక్షర ప్రగతికి ఉపయుక్తం**

జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ఏఐ బోధన అమలవుతోంది. వెనకబడిన విద్యార్థుల్లో అక్షర ప్రగతి సాధించేందుకు ఉపయుక్తంగా ఉంది. ఈ ఏడాది మరో 40 చోట్ల అమలు కానుంది. పీఎం షేక్, సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త

## హరినాథ్ బాబాకు బాలాలయం..!

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ మాడవీధుల విస్తరణకు అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈక్రమంలో దేవాదాయశాఖ కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. మాడవీధులకు ఆనుకుని హరనాథ్‌బాబా ఆలయం 100 అడుగుల ఎత్తులో, అరెకరం విస్తీర్ణంలో ఉంటుంది. వందేళ్ల చరిత్ర గల ఈ కోవెల ప్రాంగణంలోని కల్యాణ మండపం గతేడాది వర్షాకాలంలో కూలిపోయింది. ఇప్పుడు ఒకేసారి పదుల సంఖ్యలో ఇళ్లను తొలగిస్తుండటంతో ఆలయానికి కిందిభాగంలో రక్షణ గోడలను నిర్మించకపోతే ఇబ్బందేనన్న వ్యక్తమవుతోంది.

**భక్తులకు వెసులుబాటు..:** హరనాథ్‌బాబా గుడి పెద్దగుట్టపై ఉండటంతో దీనికి కిందిభాగంలో బాలాలయం, కల్యాణ మండపం నిర్మించాలనే చర్చ సాగుతోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలకు రూ.కోటికి పైగా వెచ్చించాలి. బాలాలయం నిర్మించటం వల్ల పురాతన కోవెలను యథాతథంగా ఉంచవచ్చు. ముఖ్యమైన సంప్రదాయ ఉత్సవాలను అందులో నిర్వహించవచ్చు. రోజువారీ పూజలతో పాటు వార్షిక కల్యాణాన్ని నూతన బాలాలయం వద్ద చేయటం సులభమవుతుంది. రామాలయానికి, శివాలయానికి వచ్చే భక్తులు నిత్యం బాలాలయాన్ని దర్శించుకునే వెసులుబాటు దొరుకుతుంది. తద్వారా ఆదాయం పెరుగుతుంది. హరనాథ్‌బాబా కోవెలకు తెలుగు రాష్ట్రాల్లో 140 ఎకరాల భూమి ఉండటంతో రూ.6లక్షల వార్షికాదాయం సమకూరుతోంది. బాలాలయం నిర్మించి హరనాథ్‌బాబా ఆలయాన్ని రామాలయమే దత్తత తీసుకుంటే భక్తులకు చక్కని సదుపాయాలు కల్పించే వీలుంటుంది. బృహత్తర ప్రణాళికలో దీన్ని చేర్చితే నిధులకు కొరత ఉండదు.

**మాడవీధులను విస్తరించాల్సిందే..**

రామాలయ మాడవీధిలోని దుకాణాలు, ఇళ్ల సామగ్రిని యజమానులు సొంతంగా తొలగించి తరలిస్తున్నారు. 41 మంది నిర్వాసితులకు పరిహారం పంపిణీ, ఇళ్ల నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని నివాస యోగ్యంగా మార్చేందుకు రూ.60.20 కోట్లు కావాలని అధికారులు గుర్తించారు. తొలివిడతగా రూ.34.45కోట్లు మంజూరవగా 31 మందికి పరిహారం చెల్లించారు. కొంతమంది పరిహారం చాలలేదని న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవటంతో అధికారులు పూర్తిస్థాయిలో ఇళ్లను ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టారు. ఖాళీ చేయని గృహాల్లో కొన్ని పాతబడ్డాయని, వాటిని నిబంధనల ప్రకారం తొలగించాల్సి ఉంటుందని ఓ అధికారి తెలిపారు. మన్యం కేంద్రంలోని ప్రత్యేక చట్టాలను సైతం పరిగణనలోకి తీసుకుంటామని చెబుతున్నారు.

హరనాథ్‌బాబా ఆలయం వద్ద.. కిందిభాగంలో బాలాలయంతో పాటు కల్యాణ మండపం నిర్మిస్తే బాగుంటుంది. మాడవీధుల్లోని ఇళ్లను తొలగించటం వల్ల ప్రస్తుతానికి ఇబ్బంది లేనప్పటికీ రక్షణ గోడలు అవసరం. సుదర్శన్, ఈఓ, హరనాథ్‌బాబా ఆలయం

# కని'కట్టు'.. జేబులు నిండేట్టు



హైదరాబాద్ : అవినీతి ఇంజినీర్లు, గుత్తేదారులు కలిసి ఏటా సుమారు రూ.100 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొడుతున్నారు. అడ్డదారిలో డబ్బు సంపాదించడమే లక్ష్యంగా నకిలీ సంతకాలు, బ్యాంకు గ్యారంటీలు, ఫోర్జరీ సంతకాలతో తయారు చేసిన నాణ్యత నియంత్రణ సర్టిఫికెట్లను సృష్టించి జీహెచ్ఎంసీ ఖజానాను లూటీ చేస్తున్నారు. గుత్తేదారులు, ఇంజినీర్లతో పాటు పనుల నాణ్యతను తనిఖీ చేసే నాణ్యత నియంత్రణ(క్యూసీ) సంస్థలు కూడా వసూళ్లలో భాగస్వామ్యమవుతున్నాయి. పండగల ఏర్పాట్లు, పైపులైన్ల కోసం చేపట్టిన తవ్వకాల వద్ద రోడ్డు నిర్మాణం, కాలనీ రోడ్ల పనుల్లో ఈ తరహా దోపిడీ ఎక్కువగా జరుగుతోంది.

**కళ్లముందే జరుగుతున్నా..**

బర్కత్‌పురలో మున్నూరుకాపు సంఘం నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్ వైపు కొంతకాలం కింద వరద నీటి పైపులైను నిర్మాణం జరిగింది. ఇందుకోసం రోడ్డును తవ్వారు. తిరిగి పునరుద్ధరించడానికి రూ.26లక్షలతో జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచింది. ప్రధాన రహదారి కావడంతో ముందుగా పైపులైను పొడవునా ఉండే మట్టిని అడుగున్నరలోతున తొలగించాలి. అర అడుగు మందంతో కాంక్రీటు బెడ్ వేయాలి. దానిపై అడుగు మందంతో, నాణ్యమైన సిమెంటు కాంక్రీటు మిశ్రమంతో రోడ్డును నిర్మించాలి. గుత్తేదారు మాత్రం మట్టిని రెండు అంగుళాలు తొలగించి అందులో కాంక్రీటును అలికారు.

ఐఎస్ సదన్ డివిజన్‌లో గతేడాదిలో జరిగిన గణేశ్ నిమజ్జన వేడుకల కోసం సింగరేణి గుడిసెలు వాంబే గృహాల వద్ద సీసీ రోడ్డుకు టెండర్లు పిలిచారు. పని జరగకుండానే పూర్తయినట్టు ఇంజినీర్లు రికార్డులను సృష్టించారు. నకిలీ సంతకాలతో క్యూసీ సర్టిఫికెట్లనూ తయారు చేశారు. వాటి ఆధారంగా గుత్తేదారుకు రూ.8,93,229లు చెల్లించారు.

హైదర్‌గూడ ప్రధాన రహదారిపై కేఫ్ బహర్ రోడ్డులో ఇటీవల ప్రధాన అంచుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. అదీ రెండు, మూడు అంగుళాల మందంతోనే పూర్తయింది. ఇలాగే నగరంలో ఏటా జరిగే బోనాలు, గణపతి నిమజ్జనోత్సవం, బక్రీద్, రంజాన్ ఏర్పాట్లు, తదితర ఉత్సవాల కోసం చేపట్టే కాలిబాటలు, సీసీ రోడ్ల పనుల్లో దోపిడీ జరుగుతోంది. నాణ్యత నియంత్రణ విభాగం అవినీతిమయం కావడం, ముఖ్య ఇంజినీరు కార్యాలయం సరైన చర్యలు తీసుకోకపోవడంతో.. కింది స్థాయిలో యథేచ్ఛగా దోపిడీ జరుగుతోంది.

**క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే..**

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చేపట్టే రూ.5లక్షల లోపు విలువైన ఇంజినీరింగ్ పనులకు క్యూసీ ధ్రువీకరణ అవసరం లేదు. అంతకుమించితే వర్క్ ఇన్‌స్పెక్టర్, సహాయ ఇంజినీరు ధ్రువీకరణలతో పాటు.. నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేసే థర్డ్ పార్టీ, ఫోర్త్ పార్టీ, డబ్ల్యూఎంఎస్ (వర్క్ మాడ్యూల్ సిస్టమ్)లో భాగంగా సంబంధిత జోనల్ కమిషనర్ లేదా ఉపకమిషనర్ తనిఖీ నివేదికలు ఉండాల్సిందే. వాటిని చూశాకే కార్యనిర్వాహక ఇంజినీరు బిల్లులను ఆమోదించి, ఆర్థిక విభాగానికి పంపిస్తారు. కొందరు గుత్తేదారులు నకిలీ క్యూసీ సర్టిఫికెట్లను సృష్టిస్తున్నారు. ఆ విషయం బల్దియా అధికారులకు తెలిసినా నోరు మెదపట్లేదు. వారికి వాటాలు వెళ్తున్నందునే ఫిర్యాదు చేయట్లేదనే విమర్శలొస్తున్నాయి. క్షేత్రస్థాయిలో జోనల్, సర్కిల్ కమిషనర్లు తిరగకపోవడంతో.. ఇంజినీర్లకు డబ్ల్యూఎంఎస్ రిపోర్టు కూడా సులువుగా లభిస్తోంది. అడుగడుగునా లంచాలు, నిర్లక్ష్యంతో నిండిన ఇంజినీరింగ్ వ్యవస్థపై కమిషనర్ దృష్టి పెట్టాలని, ప్రజాధనాన్ని లూటీ చేస్తోన్న కేటుగాళ్లకు అడ్డుకట్ట వేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

# 'పైసలిచ్చుకో'.. సీటు దక్కించుకో!



హైదరాబాద్ : కావాల్సిన కళాశాలలో కోరిన కోర్సుల్లో సీటు.. నచ్చిన చోట కొలువు.. ఏదైనా మేం ఉన్నామంటూ వల విసురుతున్నారు దళారులు. రూ.లక్షల్లో వసూలు చేసి విద్యార్థులు, ఉద్యోగార్థులకు మొండిచేయి చూపుతున్నారు.

**ఫలితాలు విడుదల కావడంతో..**

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎప్‌సెట్) ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. సరైన ర్యాంకు రాని కొందరు ఇంజినీరింగ్‌లో కోరిన బ్రాంచిలో ఎలాగైనా చేరాలనే ఉద్దేశంతో.. ప్రముఖ కళాశాలల్లో సీటు ఇప్పించమంటూ మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయనేతల ద్వారా పైరవీలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో దళారులు ఇంజినీరింగ్, మెడిసిన్, వ్యవసాయ కోర్సులు చేసేందుకు ఆసక్తి చూపుతున్న విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి బేరసారాలు చేస్తున్నారు. డిమాండ్ ఉన్న కోర్సులో సీటు గ్యారంటీ అంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. అడ్వాన్స్ ఇస్తే సీటు రిజర్వు చేస్తామంటూ మాయ చేస్తున్నారు. ఇటీవల ఈ తరహా ఫిర్యాదులు ఎక్కువ కావడంతో పోలీసులు మాయగాళ్లను పట్టుకునేందుకు దృష్టిసారించారు.

**కొన్ని ఘటనలు..**

నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగి తన కూతుర్ని ఉన్నత చదువులకు అమెరికా పంపాలనుకున్నారు. ఎంఎస్ పూర్తిచేయటమే కాకుండా కొలువు ఇప్పించే బాధ్యత తనదేనంటూ అడ్వాన్స్‌గా రూ.2.5లక్షలు తీసుకొని జారుకున్నాడు. గతంలో మెడికల్ సీట్లు ఇప్పిస్తామంటూ ఒక ముఠా ఎంబీబీఎస్ సీటుకు రూ.50లక్షల నుంచి రూ.కోటిన్నర వరకూ వసూలు చేసింది. అధికారులు ఈ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. అల్వాల్‌లోని ప్రముఖ విద్యాసంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి విద్యార్థులకు విదేశాల్లో ఉద్యోగ అవకాశం కల్పిస్తానంటూ పెద్దఎత్తున డబ్బు వసూలు చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గతేడాది సికింద్రాబాద్‌కు చెందిన కన్సల్టెన్సీ విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 100 మంది విద్యార్థుల నుంచి రూ.కోట్లు వసూలు చేసింది. యూకేలోని ఉద్యోగాల పేరిట నకిలీ కాల్‌లెటర్స్ ఇచ్చి ముఖం చాటేసింది. మాదాపూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలంటూ ఇద్దరు యువకులు ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాల్‌లెటర్ పంపి ఒక్కొక్కరి నుంచి రూ.2- 3లక్షలు వసూలు చేశారు. బాధితులు కంపెనీల్లో చేరేందుకు వెళ్లి మోసపోయినట్లు గ్రహించారు. తాజాగా గచ్చిబౌలిలోని ఐటీ సంస్థ సుమారు 200 మందిని ఉద్యోగంలోకి తీసుకుంటామంటూ రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష తీసుకున్నట్టు సమాచారం. నెలల గడుస్తున్నా ఉద్యోగం రాక బాధితులు ఆందోళనకు గురవుతున్నారు.

# పడతి ప్రగతికి.. ఇదే తరుణం



పరిగి : ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చేయూతనిచ్చి వారిని అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యం మేరకు రుణాలను అందజేయడంతో పాటు క్రమం తప్పకుండా పరిశీలన చేయాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) భావిస్తోంది. ఒక్కో సంఘానికి రూ.10లక్షల వరకు రుణం అందించి చిన్న వ్యాపారాలతో నిలదొక్కుకునేందుకు సహకారం అందిస్తోంది. ఇందిరా మహిళాశక్తి పథకం కింద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం, వస్త్రం సంచుల తయారీ, వినియోగించి పారేసిన ప్లాస్టిక్ బాటిళ్ల రీసైక్లింగ్, అట్టలు వినియోగం, ఏకరూప దుస్తుల తయారీ తదితర వాటిపై వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను వంద రోజుల కార్యాచరణతో చేపట్టింది.

**లక్ష్యం రూ.61.79కోట్లు:** పరిగి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలో 2,627 సంఘాల కింద 26,270 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వీరిలో 694 సంఘాలకు రూ.61.79 కోట్లు అందజేయాలని రుణ లక్ష్యాన్ని ఖరారు చేశారు. గతేడాది 675 సంఘాలకు రూ.61 కోట్లు అందజేశారు. వీటి ద్వారా రీసైక్లింగ్ యూనిట్లు, కుట్టు శిక్షణ కేంద్రాల నిర్వహణ, పాడి పశువుల పెంపకం, వ్యవసాయ పొలాలను లీజుకు తీసుకోవడం, పాల వ్యాపారం, బ్యూటీ పార్లర్లు, మిఠాయి దుకాణాలు ఇలా చిన్న చిన్న వాటి ద్వారా నిలదొక్కుకుంటున్నారు.

**300 వరకు కొత్త సంఘాలు:** జిల్లా వ్యాప్తంగా కొత్తగా మరో 300 సంఘాలకు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో 18నుంచి 64ఏళ్లలోపు వారి సర్వే చేపట్టారు. వారిని కూడా ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా ఆర్థిక అక్షరాస్యతను నేర్పాలని ప్రయత్నిస్తున్నారు. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు సకాలంలో బ్యాంకులకు చెల్లించే సంఘాలకు గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**లక్ష్యాన్ని చేరుకుంటాం**

కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం చేశాం. సర్వే చేపట్టి అర్హులను గుర్తిస్తున్నాం. పట్టణ ప్రాంతాల్లో సభ్యత్వం లేని వారు ఎవరూ ఉండకూడదని కృషి చేస్తున్నాం. ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి సంఘాల ద్వారానే ప్రోత్సహిస్తోంది. ఈసారి తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను ప్రణాళికతో పూర్తిచేస్తాం. రవికుమార్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మా

## మూడు నెలల కోటా.. ఒకేసారంట

గోదావరిఖని : వచ్చేది వర్షాకాలం కావటంతో భారీ, ముసురు వానలతో ఇళ్లలో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల కోటా బియ్యం పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్నబియ్యం కోటాను లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు అధికారులు గోదాముల నుంచి డీలర్లకు సరఫరా చేసేందుకు సిద్ధమవుతున్నారు. జూన్ 1 నుంచి 30 వరకు సమీపంలోని డీలర్ల నుంచి మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఒకేసారి తీసుకెళ్లవచ్చు. డీలర్ల వద్ద ఉన్న ఈ-పాస్ యంత్రంలో మూడుసార్లు బయోమెట్రిక్ లేదా ఐరిస్ గుర్తింపు వేసి కోటా పొందాలి. జూన్ 1 నాటికి డీలర్లకు బియ్యం చేరే విధంగా గోదాముల అధికారులు దృష్టి పెట్టారు. జిల్లాలోని సుల్తానాబాద్, మంథని, పెద్దపల్లి ఎంఎల్ఎస్ కేంద్రాల నుంచి ప్రాంతాల వారీగా డీలర్లకు మూడింతల కోటా బియ్యం పంపించేందుకు చర్యలు



తీసుకున్నారు.

**11 వేల టన్నులు సరఫరా**

జిల్లాలో 413 రేషన్ డీలర్లు ఉండగా.. నెలనెలా 3,800 టన్నుల బియ్యం సరఫరా చేసేవారు. ఈసారి మూడు నెలలకు సంబంధించిన కోటా పంపిణీ చేయాల్సి ఉండటంతో మొత్తం 11,400 టన్నుల బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. కొత్తగా 11 వేల కొత్త కార్డులు మంజూరు చేశారు. వీరికి ఎప్పటి నుంచి బియ్యం సరఫరా చేస్తారో అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

**డీలర్లకు నిల్వ కష్టాలు**


ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయటంతో రేషన్ డీలర్లకు ఉన్న దుకాణాల్లో నిల్వ చేసుకోవడానికి స్థలం సరిపోయే అవకాశం లేదు. ఇతర ప్రాంతాల్లో నిల్వ చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు. నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు పంపిణీ చేసే రేషన్ డీలర్ల దుకాణాల్లోనే కోటా మొత్తాన్ని నిల్వ చేసుకోవాలి. నెలనెలా పంపిణీ చేసే బియ్యం నిల్వకు డీలర్లకు ఇబ్బంది లేదు. ఈసారి ఒకేసారి మొత్తం మూడు నెలలకు సంబంధించిన కోటా విడుదల చేయడం ద్వారా తమకు ఇబ్బంది ఉంటుందని డీలర్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మూడు నెలలకు సంబంధించిన కోటాను ఒకేసారి డీలర్లకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఏడీఎం నర్సింహారెడ్డి తెలిపారు.

**మొదటి దఫాలోనే నిండిన గది**

ఇక్కడ కనిపిస్తున్న గోదావరిఖనిలోని రేషన్ దుకాణం పరిధిలో 416 కార్డులున్నాయి. నెల కోటా 75 క్వింటాళ్లు. ప్రస్తుతం మూడు నెలల కోటా కింద ఒకేసారి 225 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేసుకోవడానికి సౌకర్యం లేదు. మొదటి దఫాగా 110 క్వింటాళ్లు సరఫరా చేశారు. వీటితోనే గది మొత్తం నిండిపోయింది. ఇంకా సగం కోటా రావాల్సి ఉంది. ఎక్కడ నిల్వ చేయాలని డీలర్ ఆందోళన చెందుతున్నాడు.

## ఇసుక మేట.. కాసుల వేట

ముత్తారం: అనుమతులకు విరుద్ధంగా పట్టా భూముల్లో ఉన్న ఇసుక మేటలను అక్రమంగా తరలిస్తున్నా చర్యలు తీసుకోవడంలేదు. అడిగిందే తడవుగా అనుమతులు మంజూరు చేసిన సదరు అధికారులు క్షేత్రస్థాయిలో అక్కడ ఏం జరుగుతుందో పట్టించుకోవడంలేదు. పంటలు పండే పొలాల కన్నా ఇసుక మేటలు వేసిన భూములకు ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది. ఎకరానికి భారీగా చెల్లించడానికి దళారులు ముందుకు వస్తుండటంతో అన్నదాతలు అందుకు అంగీకరిస్తున్నారు. గతంలో ఖమ్మంపల్లిలో జరగగా.. ఇప్పుడు ముత్తారం మండలం ఓడేడులో అక్రమ ఇసుక మేటల తరలింపునకు అడ్డు లేకుండా పోతుంది. కొంతమంది దళారులు భూములను కౌలుకు తీసుకొని డబ్బులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతుండటంతో.. రైతులు ఇసుక తొలగింపును అడ్డుకున్న సంఘటనలు ఖమ్మంపల్లిలో గతంలో జరిగాయి.



**అనుమతులకు మించి..**

దళారులు అనుమతి పొందినచోట కాకుండా పక్కనున్న భూముల్లో అక్రమంగా ఇసుక తరలిస్తూ వ్యాపారం చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు నిర్ణయించిన హద్దుల వరకు మాత్రమే తరలించాల్సి ఉండగా.. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధిక లోడుతో లారీలలో తరలిస్తున్నారు. ఇసుక మేటలున్న పొలాల పక్కనే ఉన్న మానేరులోనూ తవ్వకాలు జరుపుతున్నారు. ఈ తతంగమంతా టీజీఎండీసీ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ దందాతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాణ్యతను బట్టి రూ.కోట్లలో..**

మానేరు పరివాహక ప్రాంతాల్లోనే ఈ దందా ఎక్కువగా జరుగుతుండగా.. ఇసుక నాణ్యతను బట్టి దళారులు రూ.కోట్లలో దండుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుండి దళారులు వచ్చి ఇక్కడి ఇసుక క్వారీల్లో భాగస్వాములవుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగా తరలించడంతో.. గ్రామాల్లో రోడ్లు దెబ్బ తింటున్నాయని, ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ అక్రమ దందాను అరికట్టాలని కోరుతున్నారు. దీనిపై మైనింగ్ ఏడీని చరవాణిలో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

# ఎగువ గ్రామాలకు ఏటా కన్నీరే!

గంగాధర : గోదావరి జలాలను బీడు భూములకు తరలించాలనే ఉద్దేశంతో నిర్మించిన గంగాధర, నారాయణపూర్ ఎల్లంపల్లి జలాశయాలు పూర్తికాక వేలాది ఎకరాల భూములు బీళ్లుగానే ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు ఆధారంగా చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు దాదాపు 1.65 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలి. కానీ చెరువుల సామర్థ్యం పెంచకపోవడం, అసంపూర్తి కాలువలతో సగం విస్తీర్ణానికి కూడా అందించలేని పరిస్థితి నెలకొంది.

**1100 మీటర్ల మేర తవ్వితేనే ఫలితం**

గంగాధర, నారాయణపూర్ జలాశయాల కింద రెండు ప్రధాన సాగునీటి కాలువలు, వాటి కింద ఉపకాలువలు నిర్మించాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి వైపు కుడికాలువ 19 కి.మీ నిర్మించాల్సి ఉండగా 18.2 కి.మీ మేరకు కాలువ తవ్వారు. గంగాధర ప్రధాన కూడలిలో ఇంకా 1100 మీటర్ల మేరకు తవ్వితేగాని ఎగువ గ్రామాలకు నీరందించలేని దుస్థితి నెలకొంది. రంగారావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, కురిక్యాల, వెంకంపల్లి, పోతుగంటిపల్లి గ్రామాలతోపాటు బోయినపల్లి మండలంలోని నాలుగు గ్రామాల్లో సుమారు 13 వేల ఎకరాలకు సాగునీరందడం లేదు.



గంగాధర, నారాయణపూర్ చెరువులను ఎల్లంపల్లి నీటితో పైపులైన్ల ద్వారా నింపి ఇక్కడి నుంచి కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి, వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని ఆయా గ్రామాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి జలాశయాల సామర్థ్యం 0.3 టీఎంసీలు కాగా చెరువుల్లో నీరు ఎప్పటికీ నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలి. చెరువుల కట్టల ఎత్తు 1.45 మీటర్లు పెంచాల్సి ఉండగా, కేవలం మత్తడి ఎత్తు పెంచి వదిలేశారు. గతేడాది వానాకాలంలో చెరువులు నిండి ప్రమాద స్థాయికి చేరడంతో మత్తడిని ధ్వంసం చేసి నీటిని కిందకు వదిలారు.

కాలువలు పూర్తికాక 27,500 ఎకరాలకు నీరందడంలేదు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో 210 ఎకరాలకు 147 ఎకరాల భూసేకరణ జరగక కాలువల పనులు పూర్తవడం లేదు. రామడుగు మండలంలో లక్ష్మీపూర్, దత్తోజీపేట, షానగర్, రామడుగు, ఇతర గ్రామాల్లో సాగునీటి సమస్య నెలకొంది. చొప్పదండి మండలం గుమ్లాపూర్, చిట్యాలపల్లి, కాట్నపల్లి, ఇతర గ్రామాల్లోనూ ఏటా సాగునీటికి ఇబ్బందులను గురవుతున్నారు.

నారాయణపూర్ చెరువు కట్ట కింద దాదాపు 35 ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని ఏడాది కిందటే అధికారులు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదించారు. మంగపేట చెరువు నుంచి 800 మీటర్ల మేరకు కుడికాలువ తవ్వాల్సి ఉంది. కాగా గంగాధర ప్రధాన కూడలిలో జగిత్యాల రోడ్డు క్రాసింగ్ 300 మీటర్ల మేరకు భూమి లోపలి నుంచి కాలువ తవ్వాల్సి ఉంది. ఈ ప్రధాన కాలువ కింద మల్లాపూర్ నుంచి వేములవాడ వరకు ఉపకాలువలు తవ్వాల్సి ఉండగా భూసేకరణ సమస్య తలనొప్పిగా మారింది. ఈ చిత్రంలోని రైతు పేరు ఐతం తిరుపతి. ఈయనది రంగారావుపల్లి. వ్యవసాయ బావి ఆధారంగా మూడెకరాల్లో పంటలు సాగు చేయగా.. బావిలో నీరు అడుగంటిపోయింది. రూ.1.50 లక్షలు వెచ్చించి రెండు బోర్లు 650 అడుగుల లోతు తవ్వినా చుక్క నీరు రాలేదు. నారాయణపూర్ జలాశయ కుడికాలువ పూర్తయితే తప్ప తమకు సాగునీటి కష్టాలు తీరేలా లేవని వాపోతున్నారు.

# అసంపూర్తి నిర్మాణం.. భయం నీడన ప్రయాణం

ఇల్లంతకుంట : ఏళ్ల తరబడి ఇబ్బందులు తొలగేలా వంతెన నిర్మాణం చేపడుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. గుత్తేదారు, అధికారుల నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోయాయి. దీంతో వంతెన వద్ద వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేయాల్సి వస్తుంది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా, ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోతోంది. ఇల్లంతకుంటకు నుంచి అనంతారం వెళ్లే మార్గంలో బిక్కవాగుపై గత ప్రభుత్వ హయాంలో లోలెవల్ వంతెన సానంలో హైలెవల్ వంతెన మంజూరు చేశారు. నిధులు మంజూరైన కొన్ని సంవత్సరాల తర్వాత నిర్మాణం ప్రారంభించారు. వంతెన మొదట్లో, చివరలో పనులు పూర్తి చేయక పోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. వర్షాకాలంలో కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెండు వైపుల రక్షణ గోడలు నిర్మించాల్సి ఉండగా గుత్తేదారు అరకొర పనులు చేసి అసంపూర్తిగా వదిలేశారు. కనీసం హెచ్చరిక బోర్డులు లేదా రేడియం స్టిక్కర్లు కూడా ఏర్పాటు చేయలేదు. ఈ మార్గంలో నిత్యం ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు పాఠశాలల బస్సులు, జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. సికింద్రాబాద్, కరీంనగర్, సిరిసిల్లకు నిత్యం బస్సులు వెళుతుంటాయి. రాత్రి వేళ, కొత్తగా ఈ మార్గంలో వచ్చే వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. అసంపూర్తిగా ఉన్న వంతెన పనులను పూర్తి చేయాలని గ్రామస్తులు, యువకులు గతంలో ఆందోళనలు చేపట్టారు. ఎటువంటి ప్రమాదాలు జరగక ముందే చర్యలు చేపడితే బాగుంటుందని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సానిక ప్రజాప్రతినిధులు స్పందించి పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఎవరూ పట్టించుకోవడం లేదు**

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తి కాలేదు. వంతెన నిర్మించిన రెండు వైపుల రక్షణ గోడలు లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వంతెన ఎత్తుగా ఉండటంతో ఆదమరిచితే ప్రాణాలు పెట్టుకుని వాహనాలు నడపాల్సిన పరిసితి ఎదురవుతోంది. పాలకులు స్పందించి ఇబ్బందులను పరిష్కరించాలి. అక్కెం నాగరాజు, అనంతారం

**ప్రమాదకరంగా మారింది** రక్షణ గోడలు లేకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పించే వీలులేదు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం చోటుచేసు కునే అవకాశం ఉంది. ఈ మార్గంలో ప్రైవేట్ బస్సులో విద్యార్థులను పాఠశాలకు తీసుకువెళతారు. ఈ ప్రాంతంలో ఎదురుగా వాహనాలు వస్తే ఇబ్బందికర పరిసితి ఎదురవుతోంది. పందుగ వేణు, జంగంరెడ్డిపల్లె

# పుట్టిస్తారు.. ధ్రువీకరణ పత్రం



హైదరాబాద్ : ప్రపంచంలో ఎక్కడ జన్మించినా సరే హైదరాబాద్‌లో జనన ధ్రువీకరణపత్రం పొందొచ్చు. దళారులు చెబుతోన్న మాట ఇది. ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.20వేల నుంచి రూ.50 వేలు సమర్పించుకుంటే చాలు మీ చేతిలో సర్టిఫికేట్ పెట్టేస్తారు. చార్మినార్, చాంద్రాయణగుట్ట, మెహిదీపట్నం తదితర సర్కిళ్లలో గతంలో బర్మా, బంగ్లాదేశ్, ఇతర దేశీయులు ఈ సరిఫికెట్లు పొందినట్లు పోలీసులు గతంలో గుర్తించారు. తాజాగా అలాంటి మరికొన్ని తప్పిదాలు వెలుగులోకి వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో, తెలంగాణలోని వేర్వేరు జిల్లాల్లో జన్మించిన పలువురు శిశువులకు జీహెచ్ఎంసీ నుంచి జనన ధ్రువీకరణపత్రాలు జారీ అయినట్లు తేలింది. వాటిని రద్దు చేయాలని ఆరోగ్యవిభాగం నిర్ణయం తీసుకుంది.

**ఇంట్లో పుట్టారని చెబుతూ..**

పేదలకు సైతం మెరుగైన ప్రసూతి సేవలు నగరంలో అందుబాటులో ఉన్నాయి. అయినా జీహెచ్ఎంసీ ప్రతి నెలా 150–200 జనన ధ్రువీకరణపత్రాలను ఇంట్లో జన్మించిన శిశువులకు జారీ చేస్తోంది. పాతబస్తీ, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ సర్కిళ్ల పరిధిలోనే ఇలాంటివి ఎక్కువగా ఉంటున్నాయి. ఓ అఫిడవిట్, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, ఇంటితోపాటు పక్కింటిలోని వ్యక్తుల విచారణతో హోమ్ బర్త్, హోమ్ డెత్‌లకు సర్టిఫికెట్లు ఇచ్చేస్తుండటంతో.. కేటుగాళ్లు ఆ మార్గాన్ని ఉపయోగించుకుంటున్నారు.

**నెలలో ఆరు కేసులు.**

నెలరోజుల వ్యవధిలో ఆరు నకిలీ సర్టిఫికెట్లు జారీ అయినట్టు జీహెచ్ఎంసీ అంతర్గత విచారణలో తేలింది. విశాఖలో జన్మించిన ఓ శిశువుకు వనస్థలిపురంలో, తెలంగాణలోని వేర్వేరు జిల్లాల్లో జన్మించిన ఐదుగురికి నగరంలోని పలు సర్కిళ్ల పరిధిలో సర్టిఫికెట్లు జారీ అయ్యాయి.

**మిగతా చోట్ల..**

జనన, మరణాల నమోదు వ్యవహారం కేంద్ర చట్టం పరిధిలో ఉంటుంది. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ఆఫ్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా పేరుతో ఉన్న వెబ్‌సైట్ ద్వారానే దేశంలోని అన్ని గ్రామ పంచాయతీలు, ఇతర స్థానిక సంస్థలు వీటిని జారీ చేస్తుంటాయి. ఆసుపత్రుల్లో నమోదయ్యే జనన, మరణాల వివరాలను ఆయా యాజమాన్యాలు ఆ వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తాయి. తర్వాత కుటుంబసభ్యులు దరఖాస్తు చేసుకుంటే వెబ్‌సైట్‌లోని వివరాల ఆధారంగా ధ్రువీకరణపత్రాలను జారీ చేస్తాయి.

**నగరంలో ఇలా..** తెలంగాణలో భిన్న పరిస్థితులు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒక వెబ్‌సైట్, జీహెచ్ఎంసీ మరో వెబ్‌సైట్‌ను ఉపయోగిస్తున్నాయి. దీంతో దేశ, విదేశాల్లోని జనన, మరణాలకు హైదరాబాద్‌లో సులువుగా సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై గత కమిషనర్ ఇలంబర్తి కేంద్ర సర్కారు వెబ్‌సైట్‌ను ఉపయోగించేందుకు ఆసక్తి చూపారని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఆయన బదిలీతో సమస్య మొదటికొచ్చింది.

# పైపై వంతెనలేనా?



హైదరాబాద్: కేబీఆర్ పార్కు కూడళ్లలో చేపట్టదలచిన పైవంతెనల నిర్మాణాల విషయంలో అయోమయం నెలకొంది. పర్యావరణవేత్తలు, భూములు కోల్పోతున్న వారు ప్రాజెక్టులో లోపాలున్నాయంటూ, పర్యావరణానికి హాని జరుగుతోందని న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్నారు. దీంతో కూడళ్లలో పైవంతెనల నిర్మాణం జరుగుతుందా, లేదా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత సర్కారు హయాంలోనూ ఇలాంటి పరిణామాలే చోటుచేసుకున్నాయి. టెండర్లు పిలిచి, గుత్తేదారుతో ఒప్పందం చేసుకున్నప్పటికీ.. పర్యావరణవేత్తల పోరాటంతో జీహెచ్ఎంసీ ప్రాజెక్టును రద్దు చేసుకుంది. సరిగ్గా.. మళ్లీ అదే వాతావరణం కనిపిస్తుండటం అయోమయానికి దారి తీస్తోంది.

**ఆరేళ్లుగా పోరాటం..**

కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్లలో పైవంతెనలు నిర్మించాలని గత సర్కారు 2017లో టెండర్లు పిలిచింది. చెట్లు, ఆస్తుల సర్వే మొదలవగానే.. కేబీఆర్ పార్కును రక్షించాలంటూ పర్యావరణవేత్తలు ఆందోళనలకు దిగారు. జాతీయ హరిత ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులోనూ వాదనలు జరిగాయి. నగరానికి ఊపిరి పోసే జాతీయ పార్కును పైవంతెనల కోసం ఉపయోగించుకోవడాన్ని వ్యతిరేకిస్తూ పర్యావరణ ప్రేమికులు చేపట్టిన న్యాయ పోరాటంతో ప్రాజెక్టు రద్దయింది.

**కొత్త సర్కారు రాగానే..**

హైటెక్‌సిటీకి, నగరంలోని మిగిలిన ప్రాంతాలకు కేబీఆర్ పార్కు చుట్టూఉన్న రహదారులు వారధిలా ఉపయోగపడుతున్నాయి. నగరంలో వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో పార్కు చుట్టు ఉన్న ఆరు కూడళ్లలోనూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కాలుష్యం, ఇంధన ఖర్చు, ప్రజలకు అసౌకర్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని.. ప్రస్తుత సర్కారు పాత ప్రతిపాదనలను మళ్లీ భుజానికెత్తుకుంది. పర్యావరణవేత్తల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని.. పార్కు వైపు డిజైన్ చేసిన పైవంతెనలను అండర్‌పాస్‌లుగా మార్చింది. ప్రస్తుతం ఉన్న రహదారులపైనే పైవంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించేట్టు డిజైన్లు రూపొందించామని ఇంజినీర్లు చెబుతున్నారు. పర్యావరణ ప్రేమికులు మాత్రం మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రస్తుతం ఐదు కేసులు విచారణలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

**టెండరుపై యథాతథ స్థితి..**

అటవీశాఖ, జీహెచ్ఎంసీలపై నమోదైన కేసులను విచారణకు తీసుకున్న న్యాయస్థానం, టెండరు ప్రక్రియపై యథాతథస్థితి ఆదేశాలిచ్చినట్టు ఇంజినీర్లు చెబుతున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో అన్ని కూడళ్లలో కలిపి 222 ఆస్తుల సేకరణకు సంబంధించి సర్వే పూర్తయింది. న్యాయస్థానానికి వాస్తవ పరిస్థితులను తెలియజేసి అనుమతులు సాధిస్తామని సీనియర్ ఇంజినీరు తెలిపారు.

# పడవలకు కోట్లు.. నడవక తూట్లు!



కరీంనగర్ : ఇది క్రూయిజ్ బోట్. రూ.1.50 కోట్లు వెచ్చించి అయిదేళ్ల క్రితం ఎల్ఎండీ డ్యామ్‌లో పర్యాటకుల కోసం అందుబాటులోకి తెచ్చారు. ఒక్క ట్రిప్పులో దాదాపు వంద మందికి వినోదాన్ని అందించేలా, వేడుకల నిర్వహణకు అనుకూలంగా దీన్ని నీటిపై నడిపించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చినా అలంకార ప్రాయంగానే మిగిలిపోయింది. అడపాదడపా మొదట్లో కొన్ని రోజులు చక్కర్లు కొట్టినా మరమ్మతులు, ఇతర సౌకర్యాల్ని కల్పించాలనే ఉద్దేశంతో ఏళ్ల తరబడి నీళ్ల మధ్యలో వదిలేశారు. ఫౌంటేన్ పడవ దుస్థితి ఇది. ఒకేసారి పది మంది వరకు విహరించేందుకు తీసుకొచ్చినా వినియోగానికి దూరంగా ఉంచడంతో తూట్లు పడి ఎల్ఎండీ జలాశయం గట్టున ఇలా పడి ఉంది. మరో స్పీడ్ బోట్ మరమ్మతుకు నోచుకోక ఎల్లమ్మగుడి సమీపంలో మూలనపడింది. గతేడాది వరదల సమయంలో బలమైన గాలులు వీచినప్పుడు ఇంకొన్ని పడవలు పాడయ్యాయి. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసి తీసుకురాగా మున్నాళ్లకే మూలన పడ్డాయి. ఎల్ఎండీలో పడవల్ని నడుపుతూ పర్యాటకుల్ని ఆకట్టుకోవాలనే ఆశయం అటకెక్కుతోంది. ఎప్పటికప్పుడు పర్యాటక శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, ఇక్కడ ఎలాంటి ప్రగతి చూపించాలనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ప్రతిపాదనలు బుట్టదాఖలవుతున్నాయి. నిత్యం డ్యామ్ కట్టపైకి 2 వేల మంది వరకు పర్యాటకులొస్తున్నారు. వీటి నిర్వహణ సరిగ్గా ఉంటే ఆదాయం కూడా బాగుంటుంది. ప్రస్తుతం నెలకు సగటున పడవలు నడిచే టికెట్‌ల రూపంలో రూ.1.50 లక్షలు వస్తున్నా.. అవి సిబ్బంది వేతనాలకే సరిపోతోంది.

**ఇదీ పరిస్థితి**

రెండు జెట్‌స్కీలు, హైస్పీడ్ బోట్లు, ఒక క్రూయిజర్‌ను రూ.2.60 కోట్ల వ్యయంతో 2018 సంవత్సరం సెప్టెంబరులో కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక నిధుల నుంచి కొనుగోలు చేసినా వీటి నిర్వహణ ప్రస్తుతం ఎవరికీ పట్టడం లేదు. పర్యాటక శాఖ వీటి నిర్వహణ బాధ్యతల్ని చూడాలి కానీ.. ఎల్ఎండీ జలాశయంలో వీటి నిర్వహణ విషయంలో ప్రత్యేకమైన కార్యాచరణను అమలు చేయలేదు. దీంతో ఏడాదిలో కొన్ని నెలలు మాత్రమే అరకొరగా చిన్న పడవలను నడిపిస్తున్నారు.

ప్రస్తుతం ఔట్‌సోర్సింగ్‌లో నలుగురు, కాంట్రాక్ట్ విధానంలో ఒకరు వీటి నిర్వహణ బాధ్యతల్ని చూస్తున్నారు. ప్రజాధనం వెచ్చించినా వీటి ఆలన ఎవరికీ పట్టడం లేదు. నాలుగేళ్ల కిందట క్రూయిజర్ పడవ నడిచేందుకు వీలుగా రూ.2 కోట్లు వెచ్చించి పెద్ద కాలువను కిలోమీటరు మేర తవ్వారు. పడవ నడిచేందుకు వీలుగా చేపట్టిన ఈ పనులు మధ్యలోనే నిలిచాయి. మిగులు పనులు చేపట్టకపోవడం, తవ్విన కాలువ పూడుకుపోవడంతో ప్రజాధనం పరిహాసమైంది.

నిర్వహణ విషయమై పర్యాటక శాఖ జిల్లా ఇన్‌ఛార్జి మేనేజర్ రాంబాబును వివరణ అడుగగా క్రూయిజర్ పడవను నడపడానికి రూ.50 లక్షలతో జెట్టీ ఏర్పాటు చేయాల్సి ఉంటుందని.. ప్రతిపాదనల్ని పంపామన్నారు. మిగతా బోట్లను నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# మున్సిపాల్టీలో ప్రమాద ఘంటికలు

ఆదిలాబాద్ : జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్ మున్సిపాల్టీకి నీటి ఎద్దడి తప్పేలా లేదు. దశాబ్దాలుగా పట్టణ ప్రజల దాహం తీరుస్తూ వరప్రదాయినిగా పేరొందిన పట్టణ శివారులోని లాండసాంగ్వి వాగు ఎండిపోవడం అందరిని కలవరపెడుతోంది. దానిపై ఆధారపడ్డ పథకం నుంచి నీటి సరఫరా నిలిచిపోయింది. మిషన్ భగరథ నీళ్లు సరిపడా రావడం లేదు. ఆదినుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు పట్టణ డిమాండ్‌కు సరిపడా ఇవ్వడం లేదనేది పుర అధికారుల వాదన. ఈ కారణంతోనే పట్టణం నుంచి 5 కిలోమీటర్ల దూరంలోని లాండసాంగ్వి గ్రామ సమీపంలో వాగు వద్ద నిర్మించిన పాత పథకాన్ని వినియోగిస్తున్నారు. గతంలో సాత్నాల ప్రాజెక్టులో నీటిబొట్టు లేకున్నా, గోదావరి నది ఎండిపోయినా లాండసాంగ్వి వాగులో నీరుండేది. వాగుల్లో అక్కడక్కడ ఉన్న ఊటల నుంచి నీరు రావడంతో ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉండేది. సాత్నాల



వరద నీరు ఇందులోనే కలుస్తుంది. ఆదిలాబాద్ మండలం లాండసాంగ్వి మీదుగా జైనథ్‌లోని నిరాల, పెండల్‌వాడల మీదుగా పెన్‌గంగలో కలిసే ఈ వాగు ఇప్పుడు ఎండిపోయింది.

**ఇక్కట్లు మొదలు..**

వాగులోనే తవ్విన రెండు ఊటబావుల నుంచి పథకంలోని ఇన్‌టేక్‌వెల్‌కు నీరు పంపిస్తే మోటార్ల ద్వారా పట్టణంలోని మున్సిపల్ ట్యాంకుల వద్దకు నీరు సరఫరా చేస్తారు. అక్కడ నీటిని క్లోరినేషన్ చేసిన అనంతరం పలు కాలనీల్లో ఇంటింటికి అందిస్తున్నారు. ముఖ్యంగా తిర్పల్లి, మహాలక్ష్మీవాడ, బ్రాహ్మణవాడ, కుమర్‌పేట్, చించర్‌వాడ, కోలిపుర, బొక్కల్‌గూడ, భుక్తాపూర్, ఖిల్లా, వినాయక్‌చౌక్, మోచీగల్లి, రవీంద్రనగర్, శాంతినగర్, పాతహౌజింగ్‌బోర్డులకు ఈ పథకం నుంచి నీరందిస్తున్నారు. ఊటబావుల్లో నీరు లేక బుధవారం నుంచి సరఫరా నిలిచిపోనుంది. ఈ కాలనీల్లో భగీరథ సైతం సరఫరా అవుతున్నా సరిపోక సమస్య తీవ్రంకానుంది.

# అప్పుడు అక్రమం.. ఇప్పుడెలా సక్రమం

ఆసిఫాబాద్: ప్రధాన రహదారులను ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు కబ్జాదార్ల చేతుల్లోకి వెళ్తున్నాయి. ప్లాట్లుగా రూపాంతరం చెంది భవనాలుగా మారుతున్నాయి. ఒకప్పుడు ఇవి ఆక్రమణలేనని నిర్ధారించిన అధికారులు కట్టడాలను కూల్చేశారు. అనంతరం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో.. రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతమవుతున్నాయి. కలెక్టరేట్కు సమీపంలోనే ఇంత జరుగుతున్నా.. అధికారులెవరూ అటువైపు వెళ్లకపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సర్కారీ స్థలాలకు కాపాడాలనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

జిల్లాల ఆవిర్భావం అనంతరం మంచిర్యాల, కుమురం భీం జిల్లాల్లో భూ మాఫియా వ్యక్తులు చెలరేగిపోతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతో తాము కన్నేసిన భూములను కాజేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నస్పూర్ శివారు సర్వే నంబర్ 11, 64, 42లలో ఉన్న ప్రభుత్వ భూముల్లో కబ్జాల పర్వం కొన్నేళ్లుగా కొనసాగుతూనే ఉంది. రెండేళ్ల కిందట ఈ ప్రాంతంలో 12 నివాస సముదాయాలను, మరికొన్ని తాత్కాలిక కట్టడాలను, ప్రహరీలను



అధికారులు తొలగించారు. జేసీబీతో కూల్చివేశారు. మళ్లీ తాజాగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. సమీపంలోనే కలెక్టరేట్ భవనం ఉన్నా.. కబ్జాలు కొనసాగడం గమనార్హం.

**అదనంగా ఇవ్వాల్సిందే..**

నస్పూర్‌లో సర్వే నం.11, 64, 42లలో లావుణి పట్టాలు ఉన్నాయి. ఇక్కడ క్రయ విక్రయాలు, నిర్మాణాలు నిషేధం. అయితే 2023లో కూల్చివేసిన చోటే ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇందులో ఓ నాయకుడి ప్రధాన అనుచరుడు అన్నీ తానై ముందుండి వ్యవహారం నడిపిస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. కూల్చేసిన చోటుతోపాటు, ఖాళీగా ఉన్న సర్కారీ స్థలాల్లో ఇల్లు నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వడంతోపాటు, భవన నిర్మాణ పనులు సైతం సదరు నేతకు సంబంధించిన బిల్డర్ చేస్తున్నారు. అంటే భవనానికి దాదాపు రూ.30 లక్షలు ఖర్చు అయితే మరో రూ.5 లక్షలు అదనంగా ఇవ్వాలన్నమాట. ఈ తరుణంలో కొందరు వ్యక్తులు సదరు నేతకు అడిగినంత ఇచ్చి భవన నిర్మాణ పనులు ప్రారంభించారని సమాచారం.

# ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మందులు

మంచిర్యాల: భానుడు భగభగ మండుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల్లో మంచిర్యాల కూడా ఉంది. ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుందే తప్ప తగ్గడం లేదు. అప్రమత్తంగా లేకపోతే వడదెబ్బ బారిన పడే అవకాశముంది. దీంతోపాటు వేసవికాలంలో ఎక్కువగా వచ్చే డీహైడ్రేషన్ తదితర రుగ్మతలతో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. వీటి నియంత్రణకు ఆరోగ్యశాఖ ఇప్పటికే చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్యకేంద్రాలకు సరిపడా మాత్రలు, సూది మందు, సెలైన్లను సరఫరా చేసినట్లు ఇక్కడి సీఎంఎస్(కేంద్ర ఔషధ గిడ్డంగి) బాధ్యులు తెలుపుతున్నారు.

**ఓఆర్ఎస్ నుంచి డీఎన్ఎస్ వరకు..** వేసవికాలంలో ఆరోగ్యకేంద్రంతో పాటు ఇళ్లలోనూ ఓఆర్ఎస్ పొట్లాలు ఉంచుకోవడం తప్పనిసరి. ప్రస్తుతం వీటి నిల్వలు జిల్లాలోని జీజీహెచ్ నుంచి సీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో సరిపడా ఉన్నట్టు సీఎంఎస్‌లోని లెక్కలు చెబుతున్నాయి. వేసవిలో అత్యవసరమయ్యే ఓఆర్ఎస్ నుంచి ఎన్ఎస్, ఆర్ఎల్, డీఎన్ఎస్, మెట్రోజిల్ సెలైన్లు సరిపడా ఉన్నాయని, ఎప్పటికప్పుడు నిల్వలు అందుబాటులో ఉంచుకుంటున్నట్లు, ఆరోగ్యకేంద్రాల అవసరం మేరకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రాల్లో అందుబాటులో ఉంచుకోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటించే సిబ్బందికి సైతం కొంత మేరకు అత్యవసర మందులను వెంట ఉంచుకోవాలని సూచించినట్టు వైద్యాధికారులు వివరించారు.

# రైతు ముసుగు.. వ్యాపారి సరకు

నంద్యాల : అధికారులు, గోదాముల సిబ్బంది ఒక్కటయ్యారు. వ్యాపారులతో కుమ్మక్కై జొన్నల కొనుగోళ్లలో అక్రమాలకు తెరలేపారు. నకిలీ ట్రక్ షీట్లతో మాయ చేశారు.. క్వింటాపై రూ.1370 దోపిడీకి పాల్పడ్డారు. క్వింటాకు రూ.3,370 చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.. జిల్లాలో 30 వేల టన్నుల జొన్నలు కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. కొనుగోలు కేంద్రాలకు దిగుబడులు పోటెత్తడంతో నిల్వ చేసేందుకు గోదాముల కొరత ఏర్పడింది. దీంతో నంద్యాల సెంట్రల్ వేర్‌హౌస్ గోదాములు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు మార్కెట్‌యార్డు గోదాములు, గోస్పాడు మండలం దీబగుంట్ల, గడివేముల మండలం గడిగరేవుల వద్ద ప్రైవేటు గోదాములను లీజుకు తీసుకున్నారు. అక్కడ సిబ్బందితో వ్యాపారులు కుమ్మక్కై దందా చేశారు."ప్రతి బస్తాలో 51.200 కిలోలు నింపాం. గోదాము వద్ద 522 బస్తాలు మాత్రమే ఉన్నాయని చూపించి రసీదు ఇచ్చారు. దీంతో రూ.23 వేల వరకు నష్టపోయామని" గోకార్ ఆవేదన వ్యక్తం చేశారు.

**గడువు ముగిసినా గుట్టుగా**

జొన్నల కొనుగోలు ఈనెల 16వ తేదీతో ముగిసినట్లు అధికారులు



ప్రకటించారు. కానీ గత పది రోజులుగా గడిగరేవుల, నందికొట్కూరు, ఆళ్లగడ్డ గోదాములకు జొన్నలు వస్తూనే ఉన్నాయి. సిఫార్సుల మీద కొనుగోళ్లు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నుల జొన్నలు కొనుగోలు చేశామని మరో 5 వేల టన్నులు కొంటామని అధికారులు చెబుతున్నారు.

**సంచికి అర కిలో కోత**

సెంట్రల్ వేర్‌హౌస్ గోదాములకు రైతులు తీసుకొచ్చే జొన్నల విషయంలో కూడా అధికారులు భిన్న ప్రకటనలు చేశారు. నంద్యాల గోదాములకు దిగుబడులు తెచ్చే రైతులు ఒక్కో సంచిలో 51.200 కిలోల జొన్నలు తేవాలన్నారు. గడిగరేవుల, నందికొట్కూరు గోదాములకు 51.700 కిలోలు చొప్పున తీసుకురావాలని చెప్పారు. ఆ తర్వాత అన్ని గోదాముల్లో 51.200 కిలోల లెక్కన కొనుగోలు చేశారు. దీంతో బస్తాకు అర కిలో చొప్పున మిగిల్చుకున్నారు. తూకం వేసిన సిబ్బంది మిగిలిన జొన్నలకు లెక్క కట్టకుండా మొత్తం సరకులోకే కలిపారు. దీంతో చాలామంది ఒక్కొక్కరు 30- 50 కిలోల వరకు నష్టపోయారు.

**క్వింటాపై రూ.1370 దోపిడీ**

గడివేముల మండలం గడిగరేవుల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, పాణ్యం మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన రైతుల పేరుతో వ్యాపారులు నకిలీ రసీదులు సృష్టించారు. ఈ రసీదులతో పంట నమోదు చేయని దిగుబడులతో పాటు, మగజొన్నలు, నాణ్యత లేని సరకును గోదాములకు తరలించారు.

బహిరంగ మార్కెట్‌లో క్వింటా జొన్నల ధర రూ.2,700 వరకు ఉంది. మగజొన్నలు, నాణ్యత లేని వాటిని రూ.2 వేలతో కొంటున్నారు. దీంతో కొందరు వ్యాపారులు మార్క్‌ఫెడ్ సిబ్బంది, గోదాము అధికారులతో కుమ్మక్కయ్యారు. క్వింటా రూ.2 వేల ధర పలికే జొన్నలను నకిలీ ట్రక్ షీట్ల ద్వారా గోదాములకు తరలించి రూ.3,370కు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. క్వింటాపై రూ.1370 అక్రమంగా లబ్ధి పొందారు.

**నకిలీ ట్రక్ షీట్లు సృష్టించి**

నిబంధనల ప్రకారం జొన్నలు విక్రయించాలంటే సాగులో ఉండగానే రైతులు ఈ-పంట నమోదు చేయాలి. అమ్మకాల సమయంలో రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో దిగుబడుల వివరాలు ఆన్‌లైన్ చేయించుకోవాలి. ఆ తర్వాత మార్క్‌ఫెడ్ అధికారులు ఇచ్చిన ట్రక్ షీట్లతో ఎంపిక చేసిన గోదాముల్లో జొన్నలను దించాలి.

ట్రక్ షీట్లలో ఉన్న వివరాలను పరిశీలించి కాటా వేసిన తర్వాత జొన్నలను గోదాముల్లో నిల్వ చేస్తారు. దీన్ని అవకాశంగా మార్చుకున్న కొంతమంది నకిలీ ట్రక్ షీట్లతో జొన్నలు తీసుకొచ్చారు.

మార్క్‌ఫెడ్ అధికారులు ఇచ్చినవి కాకున్నా గోదాముల వద్ద గుడ్డిగా కొనుగోలు చేశారు. ఇటీవల అధికారులు ట్రక్‌షీట్లను పరిశీలిస్తున్న సమయంలో ఈ నకిలీల బాగోతం బయటపడినా గుట్టుగా ఉంచారు.

# స్థానికంగానే ఉత్పత్తి.. ఉపాధి!

నరసాపురం : పాలకోడేరు మండలం విస్సాకోడేరు శివారు వంకాయల పాలెం వద్ద ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి కేటాయించిన భూమి ఇది. ఈ నెల 15న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు.నాడు వైకాపా సర్కారు అనాలోచిత విధానాలతో పశ్చిమలో పారిశ్రామిక ప్రగతి కుంటుపడి యువతకు ఉపాధి అవకాశాలు దూరమయ్యాయి. ఈ లోటును అధిగమించే దిశగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు పునరుజ్జీవం పోసేలా కూటమి సర్కారు కార్యాచరణ అమలు చేస్తోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున పారిశ్రామికవాడల ఏర్పాటులో భాగంగా ఉండి, నరసాపురంలలో ఇటీవల నిర్మాణాలకు అంకురార్పణ చేశారు.

**సకల సదుపాయాలతో..**

ఉండి నియోజకవర్గానికి సంబంధించి పాలకోడేరు మండలం విస్సాకోడేరులో 9.78 ఎకరాలు, నరసాపురం నియోజకవర్గ పరిధి లిఖితపూడిలో 9.09 ఎకరాలు చొప్పున స్థలాలను కేటాయించారు. ఆయా ప్రాంతాలు ఇక పరిశ్రమల హబ్‌గా మారనున్నాయి. విస్సాకోడేరులో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఇండస్ట్రియల్ పార్క్) నిర్మాణానికి ప్రభుత్వం రూ.10.50 కోట్లు మంజూరు చేసింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా ఏపీఐఐసీ ద్వారా మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా జీప్లస్ 2 భవనాలు నిర్మించనున్నారు. వీటిలో ప్లగ్ అండ్ ప్లే విధంగా నేరుగా కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు. రోడ్లు, పార్కింగ్, విద్యుదీకరణ సౌకర్యాలు కల్పిస్తారు. ఇక్కడ నెలకొల్పే పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాల కల్పన తప్పనిసరి. ఇతర వ్యాపారాలు వృద్ధి చెంది పరోక్షంగా మరి కొందరికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

**త్వరితగతిన అనుమతులు..** ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణాలు త్వరలోనే చేపడతామని జిల్లా పరిశ్రమల అధికారి మంగపతిరావు తెలిపారు. వీటిలో పరిశ్రమల స్థాపనకు అన్ని అనుమతులు త్వరగతిన మంజూరవుతాయని పేర్కొన్నారు.

# కాలం సంధించిన 'బ్లాక్' బాణం



నర్సీపట్నం : కింగ్ జార్జ్ ఆసుపత్రి(కేజీహెచ్)లో కేంద్ర ప్రభుత్వం నిధులతో చేపట్టిన క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) భవన నిర్మాణ పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. రూ.23 కోట్లతో 2023 ఆగస్టు నెలలో పనులు ప్రారంభించినా.. నేటికీ పూర్తి కాలేదు. ప్రస్తుతం శ్లాబుల వరకు పనులు జరిగాయి.

**గుత్తేదారుడిపై వేటు:** ఇటీవల సింహాచలం కొండపై చందనోత్సవం సందర్భంగా జరిగిన దుర్ఘటనకు బాధ్యుడిని చేస్తూ... గుత్తేదారుడు, అతని సంస్థను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టింది. అదే సంస్థ కేజీహెచ్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) పనులు చేపడుతోంది. ఈ నేపథ్యంలోనే భవన నిర్మాణ పనుల విషయమై సందిగ్ధత నెలకొంది. ఏడాది వ్యవధిలో పూర్తి కావాల్సిన పనులు, రెండేళ్లవుతున్నా.. అసంపూర్తిగానే ఉన్నాయి. భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే భవన నిర్మాణ పనులు ఆధారపడి ఉన్నాయని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి.

**నిధుల కేటాయింపు**

కేంద్రం మంజూరు చేసిన రూ.23 కోట్లలో రూ.10 కోట్లను భవన నిర్మాణానికి, రూ.7.50 కోట్లను వైద్య పరికరాల కొనుగోలుకు, మిగిలిన నిధులను ఇతర అవసరాలకు కేటాయించారు.

50 పడకలతో ఏర్పాటు చేసే క్రిటికల్ కేర్ బ్లాక్ కేజీహెచ్‌కు ఎంతో అవసరమని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

మూడు అంతస్తులతో కూడిన భవనం మొదటి ఫ్లోర్‌లో పూర్తి శీతలీకరణతో కూడిన ఐసీయూ ఉంటుంది. వెంటిలేటర్లతో పాటు ఇతర అత్యవసర ప్రాణ రక్షణ పరికరాలను ఏర్పాటు చేస్తారు. రెండు, మూడు అంతస్తుల్లో రోగులకు చికిత్స అందిస్తారు.

**అత్యవసర సమయాల్లో...**

ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితులతో పాటు, విష తుల్య పానీయాలు, ఆహార పదార్థాలు తీసుకుని అపస్మారక స్థితికి చేరుకొనే రోగుల్ని కేజీహెచ్‌కు తరలిస్తుంటారు. అలాంటి వారిని ఈ బ్లాక్‌లో చేర్చి, ఉన్నత స్థాయి ప్రమాణాలతో కూడిన మెరుగైన వైద్యం అందించేందుకు వీలుంటుంది.

శ్లాబులు, గోడలు పూర్తయినా... ఫ్లోరింగ్‌లు, ఇతరత్రా పనులు పూర్తి కాలేదు. పైగా ఈ భవనం నిర్మిస్తున్న ప్రదేశం లోతట్టులో ఉండడంతో భారీ వర్షాలు కురిసి ఎగువ నుంచి వరద వస్తే ఇబ్బందులు తప్పేలా లేవు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయించాలి. భవనానికి మూడు వైపులా రక్షణ గోడ నిర్మించాల్సి ఉన్నా.. రెండు వైపులు మాత్రమే నిర్మిస్తున్నారు. ఈ అంశంపై వైద్యాధికారులు పరిశీలన చేసి, అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

# చొరవ లేక.. ఆదాయం రాక!



నర్సీపట్నం : జిల్లాలోని ప్రధాన పట్టణాలైన అనకాపల్లి, నర్సీపట్నంలో జనసంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పట్టణాలు మరింత రద్దీగా మారుతున్నాయి. దీంతో వ్యాపార, వాణిజ్య సముదాయాలకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. రద్దీగా ఉండే ప్రాంతాల్లో దుకాణాల రూపేణా చక్కటి ఆదాయం వస్తోంది. వాణిజ్య సముదాయాల ద్వారా ఆదాయం పెంచుకునే అవకాశంపై ఇటు మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ), అటు నర్సీపట్నం పురపాలిక దృష్టి సారించడం లేదు.జీవీఎంసీకి అనకాపల్లిలో 14 వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 159 దుకాణాలు ఉండగా... ఇందులో 10 శిథిలావస్థకు చేరుకున్నాయి. 59 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వాటిలో నాలుగు దుకాణాలను జీవీఎంసీ పారిశుద్ధ్య విభాగం వారు ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం 90 దుకాణాలనే అద్దెలకు ఇచ్చారు. వీటి ద్వారా ఏడాదికి రూ. 1.3 కోట్ల ఆదాయం వస్తుంది. అన్నింటిని అద్దెలకు ఇచ్చి ఉంటే రూ. రెండుకోట్లకు పైగా ఆదాయం వచ్చేది. వాణిజ్య సముదాయాల్లో నాలుగింటిని నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లోనే నిర్మించారు. చిననాలుగురోడ్ల కూడలిలో 25 దుకాణాలతో వాణిజ్య సముదాయం నిర్మించి ఆరేళ్లు కావస్తున్నా ఇందులో ఇంతవరకూ కేవలం ఏడింటినే అద్దెకు ఇవ్వగలిగారు. మిగిలినవి ఖాళీగానే ఉన్నాయి. ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న కూరగాయల మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో తెదేపా హయాంలో వాణిజ్య సముదాయాన్ని నిర్మించారు. చాలాకాలం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఎట్టకేలకు ఇటీవల వేలం నిర్వహించి ఏడుగురికి అద్దెలకు ఇచ్చారు. ప్రధాన రహదారిలో మూడు వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటిలో ఎనిమిది దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. చాలాకాలంగా అద్దెకు ఇవ్వకుండా నిరుపయోగంగా ఉంచడంతో వాటిలో అయిదు శిథిలావస్థకు చేరుకున్నాయి. గవరపాలెం ఉన్నత పాఠశాల, రాజీవ్‌గాంధీ స్టేడియం, సతకంపట్టు, వేల్పులవీధి మహిళా ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సముదాయాల్లో దుకాణాలన్నీ ఖాళీగానే ఉన్నాయి.

**క్రమాల పుట్టగా మారినా..**

జీవీఎంసీకి చెందిన దుకాణం ఒకసారి వేలంలో పాడుకుంటే చాలు... ఇక దాన్ని సొంత ఆస్తిలా ఉపయోగించుకోవచ్చనే అభిప్రాయం ఉంది. ప్రైవేటు వ్యక్తుల వద్ద దుకాణాలు అద్దెకు తీసుకుంటే ఎప్పుడు కిరాయి పెంచుతారో.. ఎప్పుడు ఖాళీ చేయమంటారో తెలియదు. అదే జీవీఎంసీవి అయితే 25 ఏళ్లవరకూ ఎవ్వరూ కాళీ చేయించరు. అద్దెలు మూడేళ్లకు ఒకసారే పెంచుతారు. అందుకే వీటిని అద్దెకు తీసుకోవడానికి ఆసక్తి చూపుతారు.

నిబంధనల ప్రకారం లీజుకు తీసుకునే సమయంలోనే ఏ వ్యాపారం చేస్తారు వంటి వివరాలు తెలుపుతారు. ఇప్పటికి అనేకమంది గుత్తేదారుల చిరునామాలు కార్యాలయంలో లేనట్లు తెలుస్తుంది. చాలా మంది గుత్తగా వేరేవారికి అమ్మకాలు చేస్తున్నారు.దీనిపై జోనల్ కమిషనర్ బీవీ రమణను వివరణ కోరగా దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నామ న్నారు. అద్దెలు ఎక్కువగా ఉన్నాయని తీసుకోవడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారి సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**చొరవ లేక... ఆదాయం రాక!**

దాదాపు 75 వేల జనాభా కలిగిన ఈ పట్నం వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతోంది. విస్తీర్ణాన్ని బట్టి ప్రైవేటుగా ఒక్కో దుకాణానికి రూ. 20 వేలు నుంచి రూ. లక్ష వరకు అద్దెకు తీసుకుంటున్నారు. నర్సీపట్నంలో ప్రధాన రహదారిని ఆనుకుని మున్సిపాలిటీకి ఖరీదైన స్థలాలు ఉన్నప్పటికీ అక్కడ దుకాణాల సముదాయం నిర్మించేలా కార్యాచరణ చేపట్టడం లేదు.

నర్సీపట్నం నడిబొడ్డున ఎన్టీఆర్ మినీస్టేడియం వద్ద 18 దుకాణాల సముదాయం ఉండేది. ఏటా రూ. 27.6 లక్షల వరకు అద్దె వచ్చేది. పదినెలల క్రితం రోడ్డు విస్తరణ కోసం ఈ దుకాణాలను అప్పటి వైకాపా ప్రభుత్వం తొలగించింది. రోడ్డు విస్తరణ పనుల తరవాత కొత్తవి నిర్మిస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ అమలు కాలేదు. కొంతమంది ఈ ప్రదేశంలోనే తాత్కాలికంగా బల్లలు వేసి దుకాణాలు నడుపుకొంటున్నారు. నర్సీపట్నం పంచాయతీగా ఉన్నప్పటి నుంచి అబీద్ సెంటర్‌లో పది దుకాణాలు, ఐదురోడ్ల కూడలి వద్ద ఏడు దుకాణాలు ఉన్నాయి. వీటిద్వారా ప్రస్తుతం ఏటా రూ. 10 లక్షల వరకు అద్దె వస్తోంది. పాత డీఎఫ్‌వో కార్యాలయానికి వెళ్లే మార్గంలో నర్సీపట్నం-కృష్ణదేవిపేట ప్రధాన ప్రధాన రహదారిని ఆనుకుని 40 సెంట్ల స్థలం మున్సిపాలిటీ ఆధీనంలో ఉంది. బహుళ అంతస్తుల్లో దుకాణాల సముదాయం నిర్మిస్తే రూ. లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశం ఉంది. పెదబొడ్డేపల్లిలో పాత పంచాయతీ కార్యాలయం వద్దా దుకాణాలు నిర్మించేందుకు అవకాశం ఉంది. ఆదాయం పెంచుకునేలా పాలకవర్గం దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

# కుట్టుపై పట్టు.. ప్రగతికి మెట్టు

ఎమ్మిగనూరు : చేతివృత్తులపై మహిళలు దృష్టి సారించారు. స్వయంకృషితో ఎదగాలనే ఆలోచనలతో ముందుకు కదులుతున్నారు. నైపుణ్యాన్ని పెంచుకుని ప్రతిభతో రాణించాలని కొత్త డిజైన్లు నేర్చుకొంటున్నారు. వివిధ డ్రస్సులు, టీషర్టులు, పిల్లల షర్టులు, మహిళల జాకెట్లు, యువతుల ఫ్యాన్సీ డ్రస్సులను కుట్టడంలో తర్ఫీదు పొందారు. కొత్త డిజైన్లు కుట్టడంలో న్యాక్ కేంద్రం ద్వారా కుట్టు శిక్షణ కేంద్రాల్లో ప్రభుత్వం తర్ఫీదును ఇప్పిస్తోంది. ఇందుకోసం బీసీ, ఈడబ్ల్యూఎస్ మహిళలు శిక్షణను సద్వినియోగం చేసుకునేందుకు దరఖాస్తులు చేశారు.

**ఉచితంగా కుట్టు మిషన్**


పట్టణంలోని ఎన్టీఆర్ కళాప్రాంగణంలో రోజూ ఉదయం, సాయంత్రం 150 మంది మహిళలు శిక్షణ పొందుతున్నారు. మూడు నెలలు పాటు ఇచ్చే తర్ఫీదులో ముఖాధారిత హాజరు తప్పనిసరి. ఉదయం, మధ్యాహ్నం ఎఫ్ఆర్ఐ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలి. హాజరైన వారికి కుట్టుమిషన్లను ఉచితంగా ఇస్తారు.

**మూడు నెలల పాటు ప్రక్రియ**

పట్టణంలో న్యాక్ కేంద్రంలో ఏప్రిల్ 30 నుంచి శిక్షణను ప్రారంభించారు. మూడు నెలలు పాటు మహిళలకు ఉచితంగా శిక్షకులు నేర్పుతున్నారు. టీషర్టులు, టాపులు, లైనింగ్ జాకెట్లు, ప్రిన్సకట్ బ్లౌజ్, పంజాబీ డ్రెస్సులు, అంబ్రెల్లా డ్రెస్సుల్ని ఎలా అందంగా కుట్టాలో నేర్పుతున్నారు.

**15 రోజులుగా..-శిరీషా, బోడబండ**

నేను ఇంటర్మీడియట్ చదివాను. ఇంటి వద్దే పనులు చేస్తున్నా. కుట్టు



మిషన్ ద్వారా కొత్త డిజైన్లు నేర్చుకోవాలని ఇక్కడికి వచ్చా. రోజూ ఉదయం వచ్చి డిజైన్లు నేర్చుకుంటున్నాను. ఇప్పటికి 15 రోజులుగా శిక్షణ తీసుకొని నేర్చుకున్నాను. టైలరింగ్‌కు సంబంధించి మెలకువలు నేర్పించారు. శిక్షణ తర్వాత ఉచితంగా కుట్టు మిషన్ ఇస్తామన్నారు.

**ఆసరాగా ఉంటోంది -సాయిరూప, ఎమ్మిగనూరు పట్టణం**

నేను డిగ్రీ పూర్తి చేశా. ఇంట్లో ఖాళీగా ఉండలేక ఏదైనా శిక్షణ తీసుకోవాలని అనుకున్నా. ప్రభుత్వం కుట్టు శిక్షణ ఇవ్వడంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా. అమ్మానాన్నలు చేనేత మగ్గంపై రాణిస్తున్నారు. మా కుటుంబానికి ఆసరాగా ఉంటోందని శిక్షణ పొందుతున్నా.

**కుటుంబానికి అండ రాధమ్మ, బనవాసి**


నేను రోజు కూలి పనులకు వెళ్తున్నా. టైలరింగ్ నేర్చుకుంటే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని భావించా. కుట్టు శిక్షణలో వివిధ డిజైన్లను నేర్చుకుంటున్నాను. పంజాబీడ్రెస్సెస్, మిడ్, లంగావోణి, గాగ్రాచోళి, జాకెట్లు, ఇతర డ్రెస్సుల కుట్టులో శిక్షణ పొందాను.

# 'అన్నదాత సుఖీభవ'కు రెవెన్యూ చిక్కులు

ఒంగోలు : కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న 'అన్నదాత సుఖీభవ'కు రెవెన్యూ సమస్యలతో పాటు... గతంలో వైకాపా ప్రభుత్వం నిర్వహించిన భూముల రీసర్వే సాంకేతిక చిక్కులు తెచ్చిపెడుతోంది. ఆధార్ అనుసంధానంలో తప్పులు, మ్యుటేషన్లు, మృతుల పేర్లతో విస్తీర్ణం ఉండటం, తహసీల్దార్ డిజిటల్ సంతకం లేకపోవడం వంటి సమస్యలతో అర్హుల జాబితా ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**జాయింట్ ఎల్‌పీఎంతో తలనొప్పులు...**

గత ప్రభుత్వం సర్వే నంబర్ల స్థానంలో తెచ్చిన ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నంబరు వ్యవస్థతో వెబ్‌ల్యాండ్‌లో చిక్కులు తలెత్తుతున్నాయి. రీసర్వే సమయంలో అయిదారుగురు రైతులకు కలిపి సంయుక్త ఎల్‌పీఎం నంబరు కేటాయించి హక్కు పత్రాలు అందజేశారు. దీంతో పంట రుణాలకే కాదు, ప్రభుత్వ పథకాల మంజూరుకు ఇబ్బందులు తప్పడం లేదు. 'అన్నదాత సుఖీభవ' లబ్ధిదారుల ఎంపికలో మరింత



పారదర్శకత తీసుకురావాలన్న ఉద్దేశంతో రైతు సేవా కేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)తో పాటుబీ మండల వ్యవసాయాధికారి లాగిన్లకు ఇచ్చారు. ఈ క్రమంలో వెబ్‌ల్యాండ్‌లోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్ల లాగిన్‌కు వివరాలు పంపారు. వీటిలో 44,596 మంది వివరాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి.

**అర్హుల్లో ఆందోళన**

'అన్నదాత సుఖీభవ' పథకం కింద కుటుంబం యూనిట్‌గా అర్హులైన రైతులకు ఏటా సాగు ఖర్చులకు రూ.20 వేల సాయం అందించనున్నారు. పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున మూడు విడతలగా రూ.6 వేలను రైతుల ఖాతాలకు జమ చేస్తోంది. మిగిలిన రూ.14 వేలను మూడు విడతల్లో కూటమి ప్రభుత్వం ఇవ్వనుంది. వచ్చే నెలలో పథకం ప్రారంభించనున్నారు. నెలాఖరులోగా లబ్ధిదారుల జాబితా పరిశీలనకు గడువు ఇవ్వగా... రెవెన్యూ సమస్యల కారణంగా 44 వేల మంది వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

# సంక్షేమ రుణాల భారం!

ఏలూరు : జాతీయ బ్యాంకులతో పోటీ పడాల్సిన సహకార బ్యాంకులు గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైకాపా పాలనలో నష్టాలను ఎదుర్కోవాల్సిన దుస్థితి నెలకొంది. రైతులకు రుణాలు ఇవ్వకుండా ఆ పార్టీ కార్యకర్తలకు వివిధ సంక్షేమ పథకాల్లో పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చారు. అయితే వీటి వసూలుకు బ్యాంకర్లు నానా పాట్లు పడాల్సి వస్తోంది.జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 34 శాఖల ద్వారా సుమారు రూ.65.71 కోట్ల మేర వివిధ పథకాలకు రుణాలు అందజేశారు. లబ్ధిదారులు వాటిని ఎప్పటికప్పుడు చెల్లించాల్సి ఉన్నా గతంలో నేతలతో సిఫార్సు చేయించి వాయిదాలు వేసుకుంటూ వస్తున్నారు. ఆ మేరకు డీసీసీబీ పరిధిలో మొండి బకాయిలు రూ.70.50 లక్షల మేర పేరుకుపోయాయి. ఈ ఏడాది మార్చి నాటికి మొత్తం రుణాలు వసూలు కావాల్సి ఉన్నా లబ్ధిదారులు మొహం చాటేయడంతో రికవరీకి వెళ్లే సిబ్బంది ఉత్తచేతులతో తిరిగి వస్తున్నారు. తోడు.. వసూళ్ల గోడు.. జగనన్న తోడు పేరుతో చిరు వ్యాపారులకు డీసీసీబీ నుంచే రూ.10 వేల చొప్పున రుణాలు ఇప్పించారు. 2,901 మందికి ఇచ్చారు. ఇందులో 2,389 మంది తిరిగి చెల్లించారు. ఇంకా 512 మంది ఏడాదిలోగా చెల్లించాల్సి ఉన్నా మూడేళ్లయినా లబ్ధిదారుల జాడ కనిపించలేదు. ఇందులో రూ.40 లక్షల వరకు మొండి బకాయిలున్నాయి. ఇక ఫిష్ ఆంధ్రా పేరుతో ఇచ్చిన రుణాల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయి. ఇందులో కూడా రూ.లక్షల్లో మొండి బకాయిలున్నాయి.**రైతుల పేరుతో సొంతం..** ట్రాక్టర్లతో సహా వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరుతో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల విలువైన యూనిట్లను అందజేశారు. వాటిలో చాలా వరకు ట్రాక్టర్లను అమ్మేసుకున్నారు. యంత్ర పరికరాలు కనిపించడం లేదు. రైతుల పేరుతో వైకాపా నేతలే వాటిని సొంతం చేసుకోవడంతో రికవరీకి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ పథకంలో రూ.44.19 కోట్లు రుణాలు ఇవ్వగా.. వీటిలో రూ.12.23 కోట్ల వరకు అప్పు ఉంది. వీటిలో రూ.22 లక్షల వరకు మొండి బకాయిలు ఉండటం గమనార్హం.

# ఉపాధి శ్రామికులకు బీమా భరోసా

భీమవరం : ఉపాధి హామీ పథకంలో పనిచేసే శ్రామికుల కుటుంబాలకు భరోసా కల్పించేలా ప్రభుత్వం బీమా మొత్తాన్ని పెంచేలా నిర్ణయం తీసుకుంది. శ్రామికులు పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మరణించినా, వైకల్యానికి గురైనా బాధిత కుటుంబాలకు గతంలో గరిష్ఠంగా రూ.50 వేల సాయం అందేది. ఈ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలకు పెంచింది. జిల్లా వ్యాప్తంగా 3.06 లక్షల మందికి ఉపాధి హామీ కార్డులు ఉన్నాయి. వీరిలో తరచూ పనికి వెళ్లే వారు 2.08 లక్షల మంది ఉన్నారు. వీరికి బీమా భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో పని ప్రదేశంలో శ్రామికులు మరణిస్తే రూ. 50 వేలు, అంగవైకల్యానికి గురైతే రూ. 25 వేల వరకు సాయం అందేది. 2006 నుంచి ఈ మొత్తాన్ని పెంచలేదు. ఈ మొత్తం సరిపోక బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంటున్నట్లు గుర్తించిన ప్రభుత్వం సాయాన్ని రూ.2 లక్షలకు పెంచింది. దీంతో పాటు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకాలకు ప్రీమియం చెల్లించడం ద్వారా మరో రూ.2 లక్షల వరకు బీమా పరిహారం అందుతుందని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులంతా ప్రధాన మంత్రి బీమా పథకాలకు తప్పకుండా ప్రీమియం చెల్లించాలన్నారు.

చురకలు



# విద్యుత్తు లేక.. వైద్యసేవలందక

రాయదుర్గం : రాయదుర్గం పట్టణంలోని వంద పడకల ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. దీంతో వైద్యసేవలు అందక రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్స్‌రే, రక్త పరీక్ష, డయాలసిస్ విభాగం, ఆపరేషన్ థియేటర్ సహా పలు సేవలు ఆగిపోయాయి. ఆసుపత్రిలో ఓపీ సుమారు 484 ఉండగా ఇన్‌పేషెంట్లు 23 మంది ఉన్నారు. 50 రక్త నమూనాలు సేకరించారు. 10 మంది ఎక్స్‌రే రోగులు, 10 మంది డయాలసిస్ రోగులు సాయంత్రం వరకు వేచి చూసి వెనుదిరిగారు. ఆసుపత్రి వెనక వైపు ఉన్న విద్యుత్తు నియంత్రికలో హైఓల్టేజీ కారణంగా సమస్య తలెత్తినట్లు తెలిసింది. రాత్రి వరకు సరఫరాను పునరుద్ధరించలేదు. వార్డుల్లో చీకట్లు కమ్ముకోవడంతో రోగులు నరకయాతన అనుభవించారు. ఉక్కపోతతో అల్లాడిపోయారు. సెల్‌ఫోన్ల వెలుతురులో బిక్కుబిక్కుమంటు



గడిపారు. అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వైద్యసిబ్బంది సైతం సెల్‌ఫోన్ల వెలుతురులో ఇబ్బందులు పడుతూ రోగులకు సేవలందించారు.

**అలంకారప్రాయంగా జనరేటర్**

ఆసుపత్రికి ప్రభుత్వం రెండేళ్ల కిందట జనరేటర్ మంజూరు చేసింది. అయితే ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. అది ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరుపయోగంగా మారింది. ఇప్పటి వరకు అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. రోగులకు తాగునీరు అందించడంలోనూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఈ విషయమై పరిపాలనాధికారి మహబూబ్‌బాషా వివరణ కోరగా ఆసుపత్రి వెనుక ఉన్న నియంత్రిక కాలిపోవడంతో ఉదయం నుంచి సరఫరా ఆగిపోయింది. సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. వీలైనంత త్వరగా సరఫరా పునరుద్ధరిస్తామని చెప్పారు.

# ఆధార్‌కు బాలారిష్టం

చిత్తూరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలందరికీ ఆధార్ ఉండాల్సిందేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. నెలలు గడుస్తున్నా బాల ఆధార్ నమోదు పూర్తి కాలేదు. గతేడాది నవంబరు నుంచి ఇప్పటి దాకా 80 శాతం పిల్లలకే నమోదు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలోనే ఆధార్ జారీ చేయాలన్న మార్గదర్శకాలను అమలు చేయకపోగా, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ చిత్తశుద్ధి కొరవడింది. సిబ్బంది ఆధార్ జారీపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఐసీడీఎస్, రెవెన్యూ(ఎంపీడీవో), పురపాలక(కమిషనర్లు) శాఖల మధ్య




సమన్వయం లోపించింది. ప్రత్యేక శిబిరాలు నిర్వహించినా అందుకు తగ్గ ఆధార్ కిట్లు లేక మమ అనిపిస్తున్నారు.

చిత్తూరు జిల్లాలోని 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు 97,087 మంది ఉన్నారు. వీరిలో 536 మంది వలస వెళ్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకూ ఆధార్ నమోదు 80 శాతం చేశారు.

**జనన ధ్రువీకరణపై సందిగ్ధం..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో జనన ధ్రువపత్రం లేకుండానే ఆరేళ్లలోపు పిల్లల పేర్లు నమోదు చేసుకున్నారు. తాజాగా బాల ఆధార్ జారీకి జనన ధ్రువీకరణ దాఖలు చేయడం లేదు. చిత్తూరు జిల్లాలో 10,863 మందికి, తిరుపతి జిల్లాలో 10,526 మంది పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు లేనట్లు తేలింది. తల్లిదండ్రులు, మున్సిపల్, ఆసుపత్రుల్లోనూ ఇవి అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. 'జనన ధ్రువపత్రాలు లేకపోవడంతో ఆధార్‌కు అవరోధంగా మారింది. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తెలిపారు.

# తోతాపురి చేదయింది..

# పుల్లూరా పల్లేరైంది

పాకాల : ధరలు దారుణంగా పడిపోవడంతో మామిడి రైతులకు దిక్కుతోచని పరిస్థితి కొనసాగుతోంది. ప్రధానంగా తోతాపురి సాగు చేసిన రైతుల గోడు మరీ దయనీయంగా మారింది. బుధవారం ఉదయం టన్ను రూ.8 వేలకు కొన్నారు. కాసేపటికే రూ.7 వేలన్నారు. సాయంత్రానికి రూ.6 వేలకు పరిమితం చేశారు. చీకటిపడే వేళకు కొనుగోళ్లు పూర్తిగా ఆపేశారు. బలవంతంగానైనా అమ్ముకుందామన్నా కొనేవారు కరవయ్యారు. మార్కెట్‌కు తీసుకొచ్చిన కాయలు ఏంచేయా లో తెలియక రైతులు అక్కడే పడిగాపులు కాస్తున్నారు. పుల్లూరా రకం మొదట్లో టన్ను రూ.20 వేలు



పలికి చివరకు రూ.7 వేలకు పడిపోయింది. మిగతా రకాల ధరలూ ఆశాజనకంగా లేకపోవడంతో రైతుల్లో ఎటుచూసినా నైరాశ్యం కనిపిస్తోంది.

**గుజ్జు పరిశ్రమల దాష్టీకం** మే ముగుస్తున్నా గుజ్జు పరిశ్రమలు ఇంతవరకు జిల్లాలో తోతాపురి కొనుగోళ్లను ప్రారంభించలేదు. కాయలు పక్వానికి వచ్చి తోటల్లోనే రాలిపోతున్నాయి. తమవద్ద గత ఏడాది గుజ్జు ఇంకా అమ్ముడుపోలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. కొన్ని బయటి జిల్లాల నుంచి కారుచౌకగా దిగుమతి చేసుకుంటున్నాయి. గుజ్జు నిల్వలు, సీజన్‌లో దిగుబడులపై స్పష్టమైన అంచనా, అవగాహన లేని అధికారుల తీరుతో ఈ ఏడాది మామిడి వ్యాపారం కుదేలైంది. సంప్రదింపులు, చర్చలంటూ కాలయాపన చేస్తున్న జిల్లా ఉన్నతాధికారులపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

# స్వల్పజన క్యాజువాల్టీ



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లాలో ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాపాయ స్థితికి చేరినా.. విషద్రావకం తాగి పరిస్థితి విషమించినా, ఇతరత్రా వ్యాధులతో ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన రోగులను అనంతపురంలోని ప్రభుత్వ పెద్దాసుపత్రి (సర్వజన వైద్యశాల) క్యాజువాల్టీకి తీసుకొస్తారు. ఇంత కీలకమైన విభాగాన్ని విస్తరించకపోవటంతో రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు. ఆరు నెలల క్రితం కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వేర్వేరుగా క్యాజువాల్టీని పరిశీలించి విస్తరణ చర్యలు చేపట్టాలని ఆదేశించినా కార్యరూపం దాల్చలేదు. ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీర్లు అంచనాలు తయారు చేసి అధికారులకు అందజేసినా ఒక్క అడుగు ముందుకు పడకపోవడంతో రోగులు అష్టకష్టాలు పడుతున్నారు.

**వేధిస్తున్న కొరత :** క్యాజువాల్టీలో 17 ఐసీయూ పడకలు, మూడు వెంటిలేటర్లు... ఏఎంసీ (అక్యూట్‌మెడికల్ కేర్)లో 18 ఐసీయూ పడకలు, ఆరు వెంటిలేటర్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి వచ్చే సగటు రోగుల సంఖ్యను బట్టి అవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఒకే మంచంపై ఇద్దరిని ఉంచి చికిత్స అందించే పరిస్థితి. ఒక్కోసారి ఏఎంసీలో పడకలు ఖాళీగా లేనప్పుడు క్యాజువాల్టీలోని వెంటిలేటర్ పడకలపై రెండు మూడు రోజులు ఉంచి రోగులకు చికిత్స అందిస్తున్నారు.

**కొంత వెసులుబాటు ఉన్నా..**

ప్రస్తుతం క్యాజువాల్టీ విభాగం వెనుక వైపు ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్ (ఈవోటీ) ఉంది. వీటికి అనుబంధంగానే ఏఎంసీ ఐసీయూ ఉంటుంది. క్యాజువాల్టీ ముఖద్వారం నుంచే నేరుగా ఏఎంసీ ఐసీయూ వరకు దారి ఉన్నా మూసేశారు. మూడు విభాగాలను విభజించి వేరుగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో క్యాజువాల్టీ, ఈవోటీల మధ్య 20 మంచాలు ఏర్పాటు చేసుకునేంతగా ఖాళీ స్థలం ఉంది. అలాగే ట్రామా కేర్ ఆపరేషన్ థియేటర్ వినియోగంలో లేదు. ఇందులో పది సాధారణ పడకలు ఏర్పాటు చేశారు. క్యాజువాల్టీ ముఖద్వారం ఈవోటీ, ఏఎంసీలను కలిపితే అదనంగా పడకలు ఏర్పాటు చేసే వీలుంటుందని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు నివేదించారు. ట్రామాకేర్‌లో వినియోగించని ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తీసుకువస్తే క్యాజువాల్టీలో ఈవోటీని తీసేసి అక్కడా పడకలు ఏర్పాటు చేసుకోవచ్చని నివేదికలో సూచించారు. క్యాజువాల్టీ పైభాగంలో కొత్త గదులను నిర్మించి పడకలు అందుబాటులోకి తెస్తే ఇబ్బందులు తప్పుతాయని నివేదించారు. మొత్తం పనులు చేపట్టేందుకు రూ.72 లక్షల అవసరం అవుతాయని అంచనా తయారు చేసి పంపారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

– డాక్టర్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

క్యాజువాల్టీ విస్తరణకు సంబంధించి ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు అందజేసిన నివేదికను ఈ ఏడాది జనవరిలోనే ఉన్నతాధికారులకు పంపాం. ఆమోదిస్తేనే పనులు ప్రారంభించే వీలుంది. పడకలు సరిపోవటం లేని మాట వాస్తవమే. క్షతగాత్రులు, రోగులకు ఇబ్బంది లేకుండా చికిత్స అందజేస్తున్నాం.

# చౌకదుకాణాల్లోనే సరకులు



అనంతపురం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాకు 754 ఎండీయూ వాహనాలు మంజూరయ్యాయి. వాటి ద్వారా చేపట్టిన ఇంటింటికి రేషన్ సరకులు పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ఆపరేటర్లు, డీలర్లు కుమ్మక్కై కార్డుదారులకు సక్రమంగా బియ్యం అందకుండా దోచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అక్రమాలను గుర్తించింది. ఎండీయూ వాహనాలకు మంగళం పాడింది. జూన్ ఒకటో తేదీ నుంచి చౌక దుకాణాల్లోనే సరకులు అందుబాటులో ఉంచి కార్డుదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అధికారులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ-పాస్, కాటా, ఐరిస్ పరికరాలను ఎండీయూ ఆపరేటర్ల నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కొత్త వర్షన్ సృష్టించి, డీలరు వేలిముద్ర అప్‌డేట్ చేస్తారు. ఆపరేటర్ వేలిముద్ర తొలగిస్తారు.

**సమయపాలన పాటించాల్సిందే..**

ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు విధిగా సరకులు పంపిణీ చేయాల్సిందే. డీలర్లు సమయపాలన పాటించాలి. ఉదయం 7 గంటల నుంచి మధాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందజేయాలి నీ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య 65 ఏళ్లు పైబడిన వృద్ధులతోపాటు దివ్యాంగులకు ఇళ్ల వద్దకే సరకులు పంపిణీ చేయాల్సి ఉంటుంది.

**పారదర్శకతకు ప్రత్యేక యాప్**

కూటమి ప్రభుత్వం రేషన్ సరకులు పారదర్శకంగా పంపిణీ చేసేందుకు ప్రత్యేక యాప్ రూపొందించింది. జిల్లా పౌరసరఫరాల అధికారి మొదలుకుని సీఎస్‌డీటీలు, ఆర్డీవోలు, తహసీల్దార్లు సరకులు పంపిణీ చేసే సమయంలో దుకాణాలను తనిఖీ చేయాలి. లోకేషన్, డీలరు పేరు, సరకుల వారీగా నిల్వలతోపాటు ఈ-పోస్, కాటా యంత్రాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా? కచ్చితమైన తూకం ఇస్తున్నారా? పౌరసరఫరాల శాఖ నిర్ణయించిన ధర కంటే ఎక్కువ తీసుకుంటున్నారా? ఇవన్నీ యాప్‌లో అధికారులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

**బియ్యం, చక్కెర సిద్ధం**

ఉమ్మడి జిల్లాలో జూన్ నెల కోటా బియ్యం, చక్కెర పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. కందిపప్పు రాలేదు. బియ్యం 18 వేల టన్నులు, చక్కెర 650 టన్నులు కేటాయించారు. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి చౌకదుకాణాలకు చేరవేస్తున్నారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా అనంతపురం జిల్లాకు మాత్రమే 3,500 టన్నుల జొన్నలు సేకరించారు. బియ్యం బదులుగా జొన్నలు తీసుకునే వెసులుబాటు కార్డుదారులకు కల్పించారు.

**పక్కదారి పట్టకుండా పటిష్ఠ చర్యలు**

–వెంకటేశ్వర్లు, వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓలు, అనంతపురం, శ్రీసత్యసాయి

ప్రతి కార్డుదారుకు సకాలంలో సక్రమంగా రేషన్ సరకులు పంపిణీ చేయాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. ఇక నుంచి సీఎస్‌డీటీలు ప్రతి దుకాణాన్ని తనిఖీ చేయాల్సిందే. తహసీల్దార్లు, ఆర్డీవోలు సైతం కొన్ని దుకాణాలను తనిఖీ చేయమన్నారు. పంపిణీ పూర్తి అయ్యే వరకు ప్రత్యేక నిఘా ఉంటుంది.

# అమృత్ ఖర్చు.. కట్టకథలు

కర్నూలు : పుర వాసుల దాహం తీర్చే నీటి వనరుల పటిష్ఠతకు చేపట్టాల్సిన పనుల ప్ర'గతి' తప్పింది. పట్టణాలకు మంచినీరు అందిస్తున్న చెరువులు, ఎస్.ఎస్.ట్యాంకుల సంరక్షణకు అమృత్ 2.0, ట్రెంచ్ పథకం కింద కేంద్రం నిధులు విడుదల చేసింది. 2023, జనవరి 21న ట్రెంచ్-1 కింద కర్నూలు, ఆదోనికి రూ.5.44 కోట్లు. 2023, మే 19న ట్రెంచ్-2 కింద కర్నూలు, నగరపాలక సంస్థ, నంద్యాల, ఆదోని పురపాలికలకు రూ.7.90 కోట్లు కేటాయించారు. పురపాలికల్లో నిధుల కష్టాలు ఉంటే కేంద్రం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలని సూచించారు. మూడేళ్లు గడుస్తున్నా పురోగతి లేదు. ఆదోనిలో పనులు సగంలో ఆగిపోగా.. చేసిన పనుల్లో నాణ్యత తేలిపోయింది.

**ఇవి చేయాలి**

నీటి వనరుల ఆనకట్టలు బాగు చేయడం, పచ్చదనం పెంపు, రక్షణ చర్యలు చేపట్టాలి. వాటిపై వాకింగ్ ట్రాక్, బల్లలు, ఆకర్షణీయమైన దీపాలు ఏర్పాటు చేయాలి. కట్ట నుంచి మట్టి జారిపోకుండా రాళ్లతో పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. పిల్లల ఆట వస్తువులు, వ్యాయామ పరికరాల ఏర్పాటు, సుందరీకరణ వంటివి చేపట్టాలి.

**ఆదోనిలో అధోగతి**

ట్రెంచ్-1 కింద ఆదోనిలో రాంజల చెరువు ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు రూ.2.44 కోట్లు కేటాయించారు. అర్బన్ బ్యూటిఫికేషన్ విభాగం (ఏపీజీబీ) ఆధ్వర్యంలో ఆయా పనులకు టెండర్లు పిలిచారు. నడకదారి పూర్తిగా పాడైంది. వ్యాయామ పరికరాల బోల్టులు ఊడిపోయాయి. వర్షం వస్తే నీరు కట్ట మీద నిల్వ ఉండకుండా కిందకు



జారిపోయేలా చేసిన పనుల్లో నాణ్యత లోపించింది.

ఆదోని బసాపురం ఎస్.ఎస్.ట్యాంకు ప్రాంతంలో పనుల కోసం రూ.2.20 కోట్లు ఇచ్చారు. పనులు కట్ట వరకు చేరలేదు.

ఇక్కడ ఏం జరిగిందోకర్నూలు నగరంలో ట్రెంచ్-1 కింద అశోక్‌నగర్ నీటి ట్యాంకు ప్రాంతంలో అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు, ట్రెంచ్-2 కింద రూ.2.20 కోట్లతో ఎస్.ఎస్.ట్యాంకు ప్రాంతంలో సుందరీకరణ, కట్ట పటిష్ఠత పనులు చేపట్టాల్సి ఉంది. పనుల విషయంపై సదరు అధికారులను అడిగితే వివరాలు తెలియదంటూ దాటవేస్తున్నారు. నంద్యాలలో రూ.3.50 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇంతవరకు ఇవేవీ పట్టాలెక్కలేదు.

# రైతుల గుండెల్లో 'భయ'పాస్

కర్నూలు : గుంతకల్లు రైల్వేస్టేషన్‌కు బైపాస్ రైలు మార్గం(ఆర్‌వోఆర్) నిర్మించాలనే ప్రతిపాదన రైతుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తోంది. రూ.వంద కోట్లు వెచ్చించి నాలుగు కిలోమీటర్లు పూర్తి చేయాల్సిన బైపాస్ రైలు మార్గాన్ని ఏకంగా పది కిలోమీటర్లు పొడిగించి.. రూ.293 కోట్లకు వ్యయాన్ని పెంచడం పలు అనుమానాలకు 'దారి' తీస్తోంది. రైల్వేశాఖ సొంత భూములు వదిలేసి రైతుల వద్ద మళ్లీ భూసేకరణకు చేయడం గమనార్హం. ప్రస్తుతం అధికారులు ఖరారు చేసిన బైపాస్ అలైన్‌మెంట్‌పై కేంద్ర విజిలెన్స్ అధికారులతో దర్యాప్తు చేయిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**10 కి.మీ. 40 ఎకరాలు**

గుంతకల్లు-బళ్లారి రైలు మార్గం మధ్యలో అనంతపురం జిల్లాలో గుంతకల్లు రైల్వేస్టేషన్ ఉంటుంది. ఈ స్టేషన్ కర్నూలు జిల్లా సరిహద్దుకు సమీపంలో ఉంటుంది.. గుంతకల్లు పడమర రైల్వేస్టేషన్ నుంచి మల్లప్పగేటు వరకు బైపాస్ రైలు మార్గాన్ని నిర్మించాలని ఆ శాఖ అధికారులు నిర్ణయించారు. ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూములు కర్నూలు జిల్లాలో సేకరించాల్సి ఉంది.

పది కిలోమీటర్ల దూరం నిర్మించే బైపాస్ రైల్వేలైన్‌కు 40 ఎకరాలు అవసరమని రెవెన్యూ, రైల్వేశాఖ అధికారులు తేల్చారు. ఆయా



భూములు చిప్పగిరి, దౌలతాపురం, నంచెర్ల పరిధిలో 48 మంది రైతుల నుంచి సేకరించాలి. బైపాస్ రైల్వేలైన్‌కు సేకరించే భూములు హంద్రీనీవా కాల్వకు సమీపంలో ఉండటంతో సిరులు కురిపిస్తున్నాయి. ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.90 లక్షల వరకు ధర పలుకుతోంది. రెవెన్యూ అధికారులు మాత్రం అందరికీ ఒకేలా ఎకరాకు కేవలం రూ.13 లక్షలే ఇస్తామని, అంతకు మించి ఒక్క రూపాయి ఎక్కువ ఇచ్చేదిలేదని తేల్చారు.

**రెవెన్యూ అధికారుల పేచీ**

ఇంజినీరింగ్ నిపుణుల సిఫార్సుల మేరకు పది కిలోమీటర్ల దూరంపాటు బైపాస్ రైల్వేలైను నిర్మించాలని నిర్ణయించాం.. అందులో మార్పు ఉండదు.. ఆ ప్రాజెక్టుకు ఇటీవలే ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.. అవసరమైతే రైతులకు ఎకరాకు రూ.కోటి ఇవ్వడానికైనా వెనకాడమని రైల్వే అధికారులు చెబుతున్నారు. దీంతో పరిహారాన్ని కనీసం రూ.50 లక్షలకైనా పెంచాలని రైతులు డిమాండు చేస్తున్నారు. "రైతులు ఎంత పరిహారం ఇవ్వమన్నా ఇస్తామని రైల్వే అధికారులు చెబుతుంటే రెవెన్యూ అధికారులు మాత్రం రూ.13 లక్షలకు సిఫార్సు చేస్తారు. ఇదేమని అడిగితే ఆ పరిహారం కూడా రాకుండా చేస్తామని సాక్షాత్తూ పత్తికొండ ఆర్డీవో బెదిరిస్తున్నారు. ఇంత దారుణం ఎప్పుడూ చూడలేదని" చిప్పగిరికి చెందిన కావలి ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు.

**ఆ భూములు వినియోగిస్తే**

కొత్తగా ప్రతిపాదించిన బైపాస్‌కు రెండు కిలో మీటర్ల లోపు దూరంలోనే గుంతకల్లు-బళ్లారి రైల్వేలైన్ ఉంది. ఆ మార్గానికి ఇరువైపులా రైల్వేశాఖకు సొంత భూములున్నాయి. దానికి సమాంతరంగా రైలుమార్గాన్ని నిర్మిస్తే భూసేకరణ వ్యయం చాలా వరకు తగ్గుతుంది. అలాకాకుండా రైలు వేగంగా వెళ్లాలన్న సాకు చూపి, ప్రస్తుత మార్గానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములను సేకరించాలని నిర్ణయించడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఎకరాకు రూ.13 లక్షలే ఇస్తారట– కిరణ్, చిప్పగిరి**

గుంతకల్లు నుంచి చిప్పగిరి వైపు వెళ్లే రాష్ట్ర రహదారికి ఆనుకుని నాలుగెకరాలు ఉంది. ఎంతో విలువైన ఆ భూమిని ఏడాది కిందట ఎకరా రూ.90 లక్షలకు కొనుగోలుకు కొందరు ముందుకొచ్చినా ఇవ్వలేదు. ఇప్పుడు రైల్వే అధికారులు ఎకరానికి రూ.13 లక్షలు ఇస్తామంటున్నారు. ఇది ఎంతవరకు న్యాయం. ప్రస్తుత మార్కెట్ విలువలో కనీసం సగం ధర ఇవ్వకపోతే మా బతుకులు రోడ్డున పడతాయి.

**నీరు పారించడం కష్టం– మల్లికార్జున, దౌలతాపురం**

నాకు దౌలతాపురంలో ఎనిమిదెకరాలు ఉంది. అందులో 1.10 ఎకరాలు రైల్వే శాఖ తీసుకొంది. పొలం మధ్యలోంచి పట్టాలు నిర్మిస్తామంటున్నారు. పట్టాలకు ఓ వైపు కొంత.. మరో వైపు ఇంకొంత పొలం ఉంటుంది. రెండువైపులా నీళ్లు పెట్టుకోవడానికి అవకాశం ఉండదు. రాకపోకలు సాగించడానికీ కుదరని పరిస్థితి. పంట తీసుకెళ్లడానికి ఇబ్బంది తప్పదు.

# లక్ష్యాలు ఘనం.. తనిఖీలు కనం!

చింతలపూడి : రవాణా శాఖ తనిఖీలు మరిచి కేవలం ఎఫ్‌సీలు, డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చేందుకు పరిమితమవుతోందన్న ఆరోపణలున్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఆ శాఖ భారీగా ఆదాయం కోల్పోవడంతో పాటు తరచూ జరుగుతున్న ప్రమాదాలకు అడ్డూఅదుపూ లేదు. జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు రవాణా డివిజన్ల పరిధిలో 16 మంది ఎంవీఐ, ఏఎంవీఐలు పనిచేస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం తనిఖీల ద్వారా రూ.20.40 కోట్ల ఆదాయం లక్ష్యం కాగా రూ.6.06 కోట్లు మాత్రమే వసూలైంది. ఆదాయం ఎలా ఉన్నా భద్రత దృష్ట్యా తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా ఆ విధమైన అడుగులు పడకపోవడం శోచనీయం.

**కార్యాలయాలకే పరిమితం..** మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్లు లెర్నింగ్ లైసెన్సులు, వాహన సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకే పరిమితవుతున్నారన్న విమర్శలున్నాయి. జిల్లాలో సుమారు 9800 లారీలు ఉన్నాయి. ఆరు టైర్ల నుంచి 16 టైర్ల వాహనాలు ఎఫ్‌సీ(ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల)ల కోసం రోజూ కనీసం 30 నుంచి 40 వరకు వస్తుంటాయి. తనిఖీలు చేస్తున్నాం.. 'ఈ ఏడాది వాహన తనిఖీల ద్వారా రూ.10 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. నిబంధనలకు విరుద్ధంగా సరకు రవాణా చేసినా ఎఫ్‌సీలు, లైఫ్ ట్యాక్స్, బీమా సక్రమంగా లేకపోయినా కేసులు రాసి అపరాధ రుసుం వసూలు చేస్తున్నాం' అని రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం తెలిపారు.

**అడుగడుగునా ఉల్లంఘనలే..**

భారీ వాహనాలు వివిధ రకాల సరకులను రవాణా చేస్తుంటాయి. పరిమితికి మించి పది నుంచి 20 టన్నులకు పైబడి అధిక లోడ్‌తో వెళుతుంటాయి. ఎఫ్‌సీలు లేని, జీవిత పన్ను చెల్లించనివి రహదారిపైకి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ కొందరు అధికారులు తనిఖీల సమాచారాన్ని ముందుగానే లీక్ చేస్తుండటంతో లారీలు, టిప్పర్ల యజమానులు దొరకడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. రవాణా శాఖ కార్యాలయానికి వచ్చే పనిలేకుండానే ఒక్కోదానికి రూ.5 వేల నుంచి రూ.10 వేలు తీసుకుని ఎఫ్‌సీలు ఇస్తున్నవారు కూడా ఉన్నారు.

చురకలు



# పేద రోగుల పెన్నిధి

అనకాపల్లి : వ్యాధి నిర్ధారణ అయితే వైద్యం చేయడం సులభం. దీనికి ల్యాబ్‌లో పరీక్షలు అవసరం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల రక్త, మూత్ర పరీక్షలు చేయడానికి వీలు లేకపోవడంతో పేద రోగులకు ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించేలా కూటమి ప్రభుత్వ హయాంలో జిల్లా ఆసుపత్రుల్లో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను నెలకొల్పాలని నిర్ణయించారు. జిల్లా ఆసుపత్రిలో జనరల్ ల్యాబ్, మైక్రోబయాలజీ, ఐసీటీసీ, పీపీటీసీటీ, సీబీనాట్ ల్యాబ్‌ల్లో పరీక్షలు చేస్తున్నారు. దీంతో పాటు క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నారు. జనరల్ ల్యాబ్‌లో ఇటీవల సీబీసీ ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్ అందుబాటులోకొచ్చింది. ఒకేసారి 100 నమూనాలను ఇందులో పరీక్ష చేయొచ్చు. రోజుకు 600 నుంచి 800 రకాల పరీక్షలను చేస్తున్నారు. సెమీ ఆటోమెటిక్ సీబీసీ మిషన్ ఇదివరకు ఉండేది. ఇప్పుడు ఫుల్లీ ఆటోమెటిక్ మిషన్‌ను అందుబాటులోకి తెచ్చారు. థైరాయిడ్ పరికరంతో పరీక్షలు చేస్తున్నారు.



**మైక్రోబయాలజీలో..**

జనరల్ ల్యాబ్‌లో మూత్ర, రక్తపరీక్షలు కలిపి 63 వరకు జరుగుతున్నాయి. మైక్రోబయాలజీకి సంబంధించి 10 పరీక్షలు చేస్తున్నారు. గుండెకు సంబంధించి ట్రాపిక్‌ఐ, ట్రాపిన్‌టీ పరీక్షలతో పాటు థైరాయిడ్ పరీక్ష చేస్తున్నారు. హెచ్‌బీఏ1సీలో మూడునెలలకు సంబంధించి రోగి శరీరంలో చక్కెరకు సంబంధించిన పరీక్ష ఇక్కడ జరగడం లేదు. ఇది బయట చేయించుకోవాల్సి వస్తోంది. 'జిల్లా ఆసుపత్రిలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను పెట్టాలని ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయించారు. దీంట్లో భాగంగా అనకాపల్లి ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు చేసే ల్యాబ్ అందుబాటులోకి రానుంద'ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు.

**వ్యాధి నిర్ధారణ చేపట్టేలా..**

– డాక్టర్ ఉప్పాడ రమేశ్, పేథాలజిస్టు, జిల్లా ఆసుపత్రి

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే రక్తపరీక్షలు చాలావరకు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్ ఏర్పాటుతో మరిన్ని పరీక్షలు అందుబాటులోకొస్తాయి. అనకాపల్లి ఆసుపత్రిలో ఇద్దరు పేథాలజిస్ట్‌లు ఉన్నా. మరిన్ని సేవలు అందించడానికి ప్రయత్నిస్తున్నాం.

# పోలీసు శాఖలో ప్రక్షాళన

చిత్తూరు : జిల్లాలో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. పుంగనూరు మండలం కృష్ణాపురంలో తెదేపా కార్యకర్త రామకృష్ణ హత్యపై పలమనేరు ఎమ్మెల్యే పోలీసు శాఖపై తీవ్ర స్థాయిలో మండిపడిన విషయం విదితమే. అన్ని పోలీస్‌స్టేషన్‌లలో వైకాపాకు ఒత్తాసు పలికే పోలీసులే విధులు నిర్వహిస్తున్నారని.. ప్రతి విషయాన్ని పార్టీకి చేరవేస్తున్నారని, వారి ద్వారా అక్రమ వ్యాపారాలన్నీ సాగుతున్నాయని ఆరోపించారు. ఇలా పోలీసు శాఖపై ఒక్కసారిగా ఆరోపణలు రావడంతో ఎస్పీ అప్రమత్తమయ్యారు. బదిలీ ప్రక్రియ ప్రారంభించారు. 45 మంది ఏఎస్సై, హెడ్‌కానిస్టేబుళ్లు, 219 కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. పుంగనూరు నియోజకవర్గం పరిధిలో పనిచేసే వారే సుమారు 25 మంది ఉన్నారు. అందులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కూడా ఉన్నారు.

**అసంతృప్తి సెగలు** పోలీసు శాఖపై విమర్శలు వస్తుండడంతో ఎస్పీ బదిలీల ప్రక్రియ ప్రారంభించినా.. అందులోనూ విమర్శలు మూటగట్టుకుంటున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అడగకుండా బదిలీ చేసినా పర్వాలేదు కాని.. ఎలాంటి ఆరోపణలు లేని వారిని కూడా అడగకుండా బదిలీ చేయడంతో పోలీసు శాఖలోనే అసంతృప్తి సెగలు వస్తున్నాయి. 4–5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారందరిని బదిలీ చేయాల్సి ఉంది. దీని కోసం ఒక్కొక్కరి నుంచి మూడు ఆప్షన్‌లు తీసుకుని బదిలీ చేస్తుంటారు. 219 మందిని బదిలీ చేయాల్సి ఉండగా.. రాత్రే అందరి బదిలీలు పూర్తి చేశారు. 219 మందికి ఎలాంటి కౌన్సెలింగ్ లేదు. **ఉనికి చాటుకోవడానికేనా?** 'పోలీసు శాఖలో ఎవరి మాట వినను. రాజకీయ నాయకుల సిఫార్సులొస్తే తిప్పికొడతా..' అని చెప్పిన ఎస్పీ విమర్శలు మూటగట్టుకున్న అనంతరం శాంతించారు. మొదట్లో సీఐలు, ఎస్సైలతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకుని.. జూద స్థావరాలు, లాటరీ వ్యాపారాలు, మద్యం అక్రమ రవాణా, ఇతర అక్రమ వ్యాపారాలపై ఆకస్మిక దాడులు చేశారు. రాజకీయ నాయకులు ఒత్తిడి తెచ్చినా మొండిగానే వ్యవహరించారు. అయితే ఏం జరిగిందో ఏమో కానీ ఒక్క సారిగా ప్రత్యేక బృందాల దాడులు ఆగిపోయాయి. అక్రమ వ్యాపారాలన్నీ ఒకొక్కటిగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుత బదిలీలు కూడా తన ఉనికి చాటుకోవడానికే అని పలువురు పేర్కొంటున్నారు.

# భూముల్లో తీగలు.. ఉండవిక బాధలు

గురుద్వారా : విపత్తుల సమయంలో విద్యుత్తు వ్యవస్థ చిన్నాభిన్నమై సరఫరాకు అంతరాయం ఏర్పడటమే గాక ఏపీఈపీడీసీఎల్‌కు తీవ్ర ఆస్తినష్టం వాటిల్లుతోంది. ఈ సమస్య అధిగమించేలా భూగర్భ విద్యుత్తు తీగల వ్యవస్థ ఏర్పాటుకు ప్రపంచ బ్యాంకు నిధులతో రూపకల్పన చేశారు. తొలి విడతగా నగరంలో ఇదివరకు రూ.800 కోట్లతో జోన్–1 పరిధిలో వన్‌టౌన్ మొదలుకొని రుషికొండ వరకు సముద్రతీర ప్రాంతంలో పనులు చేశారు. పలు కారణాల రీత్యా కొన్నేళ్లుగా పనులు నిలిపివేశారు. ప్రస్తుతం ఆర్‌డీఎస్‌ఎస్(రీవేంప్‌డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం) కింద రెండో విడత పనులు పునఃప్రారంభించారు. వీటికోసం రూ.973.44 కోట్లు కేటాయించారు. జీవీఎంసీ పరిధిలో కూర్మన్నపాలెం నుంచి ఆనందపురం వరకు ఈ పనులు చేపడుతున్నారు. గతంలో ఇంటి నుంచి విద్యుత్తు స్తంభాలకు వెళ్లే తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకి సరఫరా చేసే హెచ్‌టీ తీగలు అంతా కలిపి భూగర్భంలోనే వేశారు. దీనివల్ల ఆర్థికభారం అధికమవ్వడంతో ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో స్వల్ప మార్పులు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి సబ్‌స్టేషన్‌కు సరఫరా అయ్యే 33, 11కేవీ విద్యుత్ తీగలు మాత్రమే భూగర్భంలోకి వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు.. 33కేవీకి సంబంధించి రూ.340 కోట్లతో 547 కిలోమీటర్ల వరకు, రూ.633 కోట్లతో 11కేవీ తీగలు 1740 కిలోమీటర్ల వరకు వేస్తున్నారు. ఆటోనగర్‌లో జరుగుతున్న పనులను ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెళ్లి పరిశీలించారు. రానున్న రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు.

# నట్టేట ముంచిన నాసిరకం నార



ముదిగుబ్బ: మిరపలో ఓ వైపు తెగుళ్లు వ్యాపించి నష్టం కలిగిస్తుంటే.. మరోవైపు వ్యాపారులు విక్రయించే నాసిరకం విత్తనాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. ముదిగుబ్బ మండలంలో మిరప సాగు చేసిన రైతులు దిగుబడి సక్రమంగా రాకపోగా కాయ రంగు మారడంతో లోపం ఉన్నట్లు గుర్తించారు. నార విక్రయించిన నర్సరీ యజమానిని ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకపోవడంతో మోసపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఆశలతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగుచేస్తే చివరికి దిగుబడి లేక ఆశలు అడియాశలయ్యాయి. ఆరుగాలం కష్టపడే రైతన్నలకు నాసిరకం విత్తనాలు శాపంగా మారడంతో నష్టాల్లో కూరుకుపోతున్నారు.

ధర్మవరం నియోజకవర్గంలో అధికారుల లెక్కల ప్రకారం మిరప పంట 65 ఎకరాల్లో సాగైంది. ముదిగుబ్బ మండలంలో ప్రధానంగా సంకేపల్లి, గాండ్లవారిపల్లి గ్రామాల్లో సాగు చేసిన మిరప కాయలు పసుపు రంగులోకి మారడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. సంకేపల్లికి చెందిన పుల్లయ్య నార్పల మండలంలోని అనంతపురం రోడ్డులో ఉన్న ఓ నర్సరీలో ఆర్‌షాట్‌వన్ రకానికి చెందిన ఒక్కో మొక్క రూ.1తో 38 వేల మొక్కలు కొనుగోలు చేశారు. గత జనవరిలో ఒక ఎకరా విస్తీర్ణంలో మిరప సాగుచేయగా 70 రోజులకు కోతకొచ్చింది. కాయ చిన్నసైజు రావడంతోపాటు సగానికిపైగా పసుపు రంగులోకి మారాయి. మార్కెట్‌కు తరలించినా ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో పారబోశాడు. రూ.లక్షలు పెట్టుబడి పెడితే రూ.20వేలు మాత్రమే వచ్చిందని ఆవేదన చెందారు. నాసిరకం నార కొనుగోలు చేసి మోసపోయిన రైతులు చాలామంది ఉన్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

**జోరుగా విక్రయాలు..**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మిరప నాసిరకం విత్తనాలు, నార విక్రయాల జోరు పెరిగింది. ప్రధానంగా అనంతపురం, నార్పల, ముదిగుబ్బ, బత్తలపల్లి, తనకల్లు, నల్లచెరువు, పులివెందుల నర్సరీల నుంచి కొనుగోలు చేసిన మొక్కల్లో నాసిరకం ఎక్కువగా ఉంటున్నాయి. మొలకలు సక్రమంగా రాకపోవడం, పూత దశలో ఎండిపోవడం, కాయ చిన్నసైజు రావడం, దిగుబడి లేకపోవడంతో రైతులు నష్టాల పాలవుతున్నారు. విత్తనాలు విక్రయించే దుకాణాలు, నర్సరీ యజమానులు నిబంధనలు పాటించడం లేదు.

మోసపోయాం..– శివప్రసాద్, గాండ్లవారిపల్లి

ఒక ఎకరాలో రూ.లక్షల పెట్టుబడి పెట్టి మిరప పంట సాగు చేశా. కోతకొచ్చే సమయానికి కాయలు పసుపు రంగులోకి మారడంతో మార్కెట్‌లో అమ్ముడుపోవడం లేదు. నర్సరీ యజమానికి అడిగితే సమాధానం ఇవ్వలేదు. అధికారులు నాసిరకం నార అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలి.

**రసీదులు తప్పనిసరి– అమరేశ్వరి, ఉద్యానశాఖ అధికారిణి**

నర్సరీల్లో మొక్కలు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలి. అవి ఉంటే నష్టపోయిన వారికి పరిహారం అందించేందుకు వీలుంటుంది. నాసిరకం నార విక్రయించే నర్సరీలను గుర్తించి తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

# ఖాళీ జాగాయేగా.. కాజేద్దాం!



కడప : దక్షిణాన కేసీ కాలువ...ఉత్తరాన పాతకడప చెరువు, తూర్పున మత్స్యశాఖకు చెందిన భూమి, పడమరన నీటిమునక ప్రాంతం ...ఈ నాలుగు దిక్కుల మధ్యన గల భూమి మాదేనని కొందరు పెద్దలు మట్టితో చదును పనులు చేశారు. 1927లో ఈ భూమిలోని కొంత భాగాన్ని అక్షరాల రూ.48లకు, 1942లో మరికొంత భాగాన్ని అక్షరాలా రూ.830లకు క్రయవిక్రయాలు జరిగినట్లు పత్రాలను సిద్ధం చేశారు. నిన్నటివరకు చెరువులా కనిపించిన భూమిని చదును చేయడానికి టిప్పర్లతో వందల ట్రిప్పుల మట్టిని పోశారు. యంత్రాలతో భూమిని చదునుచేయడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో కబ్జా చేస్తున్నారని పాతకడప చెరువు నీటి సంఘం నాయకులు, రైతులు గుర్తించి అడ్డుకున్నారు. తహసీల్దారుతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చదును పనులు చేస్తున్న వాహనాలను అధికారులు తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

**మత్స్యశాఖ అమ్ముడుపోయిందా?**

పాత కడప చెరువుగా రైతులు పేర్కొంటున్న భూమిలోకి వాహనాలు వెళ్లడానికి ఎలాంటి మార్గం లేకపోగా, భారీ వాహనాలు వెళ్లడానికి మత్స్యశాఖాధికారులు దారి చూపించారు! దేవుని కడప రోడ్డులోని మత్స్యశాఖ కార్యాలయంలోకి ప్రైవేటు వాహనాలను అనుమతించరు. అలాంటిది టిప్పర్లు, జేసీబీలు వెళుతుంటే ఆ శాఖ అధికారులు ఏం చేస్తున్నట్టు ? ఆ శాఖకు చెందిన అధికారులను కొనేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ భూమిని పూర్తిగా చదును చేసి ప్లాట్లుగా మారిస్తే అక్కడకు రాకపోకలు సాగించడానికి కూడా ఈ దారిని ఇచ్చేస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులకు కనిపించలేదా?**

కేసీ కాలువ–పాతకడప చెరువు మధ్య గల ఈ భూమిలో గత పది పది రోజులుగా మట్టితో చదును పనులు చేస్తుంటే నీటిపారుదల, రెవెన్యూ శాఖలతోపాటు కడప నగరపాలక సంస్థ అధికారులు ఎందుకు ఊరుకున్నారు ? కేసీ కాలువకు పక్కన బండ్లబాటతోపాటు కొంత బఫర్ జోన్ ఉంది. దీనిని సైతం మట్టితో పూడ్చేస్తున్నా కేసీ కాలువ అధికారులు ఎందుకు ఇటువైపు చూడలేదు? కడప నగరపాలక సంస్థ పరిధిలోని అతిపెద్ద జలవనరు వద్ద ప్లాట్లు వేయడానికి సన్నాహాలు చేస్తుంటే నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం ఏం చేస్తున్నట్లు ? ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో అప్పటి నగర నాయకులకు అత్యంత సన్నిహితులైనవారు చెరువును కబ్జా చేసి ప్లాట్లు వేశారన్న ఆరోపణలున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రణాళిక విభాగం అధికారులు పరిశీలించి నిషేధిత లేఅవుట్ జాబితాలో చేర్చారు. దీనికి కొనసాగింపుగా తాజాగా పాతపత్రాల పేరుతో పాత కడప చెరువు ప్రాంతంలో మట్టితో చదును పనులు చేయడం కలకలం రేపుతోంది.

**పంటలు సాగు చేయొచ్చు గానీ...** – నిమ్మకాయల నారాయణరెడ్డి, పాతకడప చెరువు నీటి సంఘం అధ్యక్షుడుపాత కడప చెరువు విస్తీర్ణం 465 ఎకరాలు. గత ఐదేళ్లుగా ఈ విస్తీర్ణంలోని భూమిలో లేఅవుట్ వేయడం, ప్లాట్లు ఏర్పాటు చేయడం, ఇళ్లు కట్టడం చేస్తున్నారు. కేసీ కాలువకు పాతకడప చెరువుకు మధ్య పట్టా భూమి ఎవరిదైనా ఉన్నా ఆ భూమిలో పంటలు సాగు చేసుకోవాలే తప్ప నివాస ప్రాంతాలుగా మార్చకూడదు. పాతకడప చెరువు పరీవాహక ప్రాంతాన్ని నివాస స్థలాలుగా మారుస్తున్న వైనంపై పూర్తి స్థాయిలో విచారణ చేయించాలని అధికారులను కోరుతున్నాం. సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం.

# పేరుకే పెద్దాసుపత్రి!



రాయచోటి: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అరకొర వైద్యసేవలందుతున్నాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు 50 పడకల నుంచి 100 పడకల ఆసుపత్రిగా ఉన్నతీకరించారు. గత వైకాపా ప్రభుత్వంలో ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులకు గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ముందు వైకాపా నాయకులు ఆ పార్టీ రంగులద్ది అరకొర వసతులతోనే ప్రారంభించారు. రోగులకు మెరుగైన వసతులు కల్పించకపోవడంతో చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. వంద పడకలుగా ఉన్నతీకరించిన ఆసుపత్రిలో భవనాల నిర్మాణం పూర్తి కాకుండానే గుత్తేదారుపై వైకాపా నేతలు ఒత్తిడి తెచ్చి ప్రారంభించారు. కేవలం గదుల నిర్మాణం పూర్తికాగా, లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టలేదు. – ఆధునిక వసతులతో ఏర్పాటు చేయాల్సిన శస్త్రచికిత్స గది పనులు నేటికీ పూర్తికాలేదు. పాత గదిలోనే అరకొర వసతుల మధ్య శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. – మురుగునీటి పారుదల వ్యవస్థ పూర్తి చేయకపోవడంతో రోగుల గదుల నుంచి వచ్చే మురుగు నీరు దుర్వాసన వెదజల్లుతోంది. – దాత ఏర్పాటు చేసిన శుద్ధి జలం యూనిట్ తరచూ మరమ్మతులకు గురవ్వడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. – రోగుల సహాయకులు అవసరమైన వసతులు లేకపోవడంతో ఆసుపత్రి ఆవరణలోనే నేలపై దోమల మధ్య విశ్రాంతి తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

ఆసుపత్రికి రాయచోటి, రాజంపేట, పీలేరుతోపాటు శ్రీసత్యసాయి జిల్లా నుంచి రోజు 700 మంది వరకు వస్తుంటారు. అందుకు తగ్గట్టుగా వసతుల్లేకపోవడంతో రోగులకు సరైన వైద్య సేవలందడంలేదు. ఇక్కడ వివిధ వైద్య విభాగాలకు 24 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా 21 మంది పనిచేస్తున్నారు. వీరిలో సగం మందికి ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. వీరు రోగులను తమ ఆసుపత్రులకు రెఫర్ చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మరోపక్క మందుల కొరత పీడిస్తోంది. వైద్యులు రాసిన మందుల్లో చాలా వరకు లేవని సిబ్బంది చెప్పి వెనక్కి పంపుతుండడం గమనార్హం.

నా పేరు ఖాదర్‌వలీ. మాది మాధవరం. ఇంటి వద్ద కాలువపై రాయి పెడుతుండగా ప్రమాదవశాత్తు పడడంతో కాలికి తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వస్తే పారిశుద్ధ్య సిబ్బందేగాయానికి కట్టుకట్టి కడపకు వెళ్లమన్నారు.

నా పేరు రాజేంద్ర. మాది సుండుపల్లి మండలం బెస్తపల్లి. తలకు గాయం కావడంతో ఆసుపత్రికి వస్తే సిబ్బంది కట్టుకట్టి కడపకు వెళ్లమని పంపించేశారు. కనీసం మందులు కూడా ఇవ్వ లేదు. కడపకు వెళ్లే పరిస్థితి లేక వైద్యుని కోసం వేచి ఉండాల్సి వచ్చింది.మంత్రి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

ఆసుపత్రిలో వసతుల కల్పన, సమస్యలను మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లాం. అత్యవసర పరిస్థితుల్లోనే రోగులను రెఫర్ చేస్తున్నాం.

# నీరు ఇంకింది.. ఇసుక ఆగింది

కర్నూలు : తుంగభద్రలో ఇసుక నిల్వలు ఖాళీ అయ్యాయి.. సుంకేసుల జలాశయంలో నీటిమట్టం తగ్గడంతో డీసిల్టింగ్ పాయింట్లలో తవ్వకాలు నిలిపేశారు. ప్రస్తుతం 1,500 టన్నులు అందుబాటులో ఉంది ఉదయానికి ఖాళీ కానుంది. సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల పరిధిలో ఐదు డీసిల్టింగ్ పాయింట్లున్నాయి. సుంకేసుల జలాశయం వెనుక ప్రాంతంలో.. తుంగభద్ర నదిలో నీరు ఉంటేనే డ్రెడ్జింగ్ చేసి బోట్ల సాయంతో ఇసుక తవ్వకాలు చేపడతారు. ప్రస్తుతం ఎగువ నుంచి నీరు రావడం లేదు.. జలాశయంలో 0.750 టీఎంసీ ఉన్నా బోట్ల ద్వారా వెళ్లి ఇసుక తవ్వకాలు జరిపేందుకు వీలవుతుంది. ప్రస్తుతం 0.5 టీఎంసీ మాత్రమే ఉండటంతో తవ్వకాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎగువ నుంచి నీరు రాకపోతే డీసిల్టింగ్ పాయింట్లు మూతపడే పరిస్థితి నెలకొంది.

**అనుమతులకు నిరీక్షణ**

మరళి–1లో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలకు అనుమతి ఉన్నప్పటికీ కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఇక మరళి–2 ఇసుక రీచ్‌లో సెమీ మెకనైజ్డ్ యంత్రాలతో ఇసుక



తవ్వకాలకు అనుమతులున్నాయి. రీచ్ వరకు ఇసుక రవాణా చేసేందుకు రోడ్డు వేయాల్సి ఉంది. ఈ రెండు రీచ్‌లలో అనుమతులు వచ్చేందుకు, రహదారి నిర్మాణానికి 10–15 రోజుల సమయం పడుతుంది. ఈ రెండు రీచ్‌ల నుంచి 50 వేల టన్నుల ఇసుక లభ్యత ఉంది.

**అక్కడికెళ్లాలంటే తడిసిమోపెడు**

కర్నూలు నగర ప్రజలు ఇసుక కోసం కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి ఇసుక రీచ్‌లపై ఆధారపడాల్సి వస్తోంది. కౌతాళం మండలం గుడికంబాలి, నదిచాగి ఇసుక రీచ్‌ల్లో ప్రస్తుతం 3 లక్షల టన్నుల నిల్వలున్నాయి. గుడికంబాలిలో ఒక టన్ను రూ.39, నదిచాగిలిలో రూ.40 మాత్రమే.

కర్నూలు నగరవాసులకు ఇసుక కావాలంటే 150 కిలోమీటర్ల దూరం వెళ్లి తెచ్చుకోవాలి.

డీసిల్టింగ్ పాయింట్ల నుంచి నంద్యాలకు నిత్యం సుమారు 2 వేల టన్నుల ఇసుక తరలిస్తున్నారు. బుధవారం నుంచి పూర్తిగా ఆగిపోనుంది. కౌతాళం మండలం నదిచాగి, గుడికంబాలి నుంచి నంద్యాలకు 18 టన్నుల ఇసుక లోడు లారీకి రవాణా ఛార్జీలతో కలిసి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రవాణా భారం పడనుంది.

డీసిల్టింగ్ పాయింట్ల నుంచి కర్నూలుకు 18 టన్నుల ఇసుక లారీ వచ్చేందుకు రూ.10 వేలు ఖర్చవుతుంటే.. అదే కౌతాళం మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి కర్నూలుకు ఇసుక రవాణా చేసేందుకు ఒక లారీకి రూ.10 వేల వరకు అదనపు భారం పడుతుంది.

# 'పల్లె'వించని ప్రగతి

నంద్యాల : ఊళ్లను మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఉపాధికి దూరం చేశారు. గత పాలకుల స్వార్థంతో 2021 పుర ఎన్నికల ముందు లక్ష్మీపురం, పెద్దపాడు, పందిపాడు గ్రామాలను కర్నూలు నగర పాలకలో, రైతునగరం, కాంతినగర్, పొన్నాపురం కాలనీ, బీటీ నగర్, పొన్నాపురం, వెంకటేశ్వరపురం, ఉడుమాల్పురం గ్రామాలను నంద్యాల మున్సిపాల్టీలో విలీనం చేశారు. పంచాయతీలుగా ఉన్నప్పుడు ఉపాధి నిధులు దండిగా వచ్చేవి.. పనులు జరిగేవి.. కూలీలకు ఉపాధి దొరికేది.. మున్సిపాలిటీల్లో విలీనం చేసి పన్నులు పెంచారు.. ప్రగతిని దూరం చేశారు.. నాలుగేళ్లుగా సమస్యల్లో నలిగిపోతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**61 వేల మందికి అవస్థలు**

విలీనమైన గ్రామాల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. పది గ్రామాల్లో 61 వేల మంది నివాసం ఉంటున్నారు. విలీనానికి ముందు రైతునగరం పంచాయతీ పరిధిలో 275, కాంతినగర్ 125, ఉడుమాల్పురం 285, పొన్నాపురంలో 450, లక్ష్మీపురంలో 350, పెద్దపాడు 250, పందిపాడులో 320 మంది జాబ్‌కార్డులు ఉండేవి.

ఉపాధి జాబ్‌కార్డులున్న వారంతా ఉపాధిహామీ పథకం కింద పనులకు వెళ్తూ సంపాదించుకునే వారు. ఆయా గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేసిన తర్వాత పనులు చేపట్టడం లేదు. జాబ్‌కార్డులు చెల్లుబాటు కావడం లేదు. ఉపాధిహామీ పథకానికి అనుబంధంగా ఉన్న అన్ని రాయితీ పథకాలను రద్దు చేశారు.

**వేధిస్తున్న అసౌకర్యాలు**

నంద్యాల మున్సిపాల్టీలో విలీనమైన ఉడుమాల్పురం, వెంకటేశ్వరపురం గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. కుంట నుంచి మోటార్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటినే ఈ గ్రామాల ప్రజలు తాగుతున్నారు.కాంతినగర్ కాలనీలో ట్యాంకు సిద్ధమైనా మున్సిపాల్టీ నుంచి నీరు సరఫరా చేయడం లేదు. దీంతో ప్రజలు నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది.పొన్నాపురం, బీటీ.నగర్, పొన్నాపురం కాలనీలు బోరు నీటిపైనే ఆధారపడ్డాయి.

ఒక్కో గ్రామానికి రూ.2 కోట్ల నష్టం

ఒక గ్రామంలో 100 మంది ఉపాధి కూలీలు పనికి వెళ్తున్నట్లయితే.. ఒక్కో వేతనదారు ఏడాదిలో వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకుంటే 10 వేల పని దినాలు జరిగినట్లు లెక్క. రోజు కూలి రూ.300 లెక్కన వేసుకుంటే ఏడాదికి రూ.30 లక్షలు కూలి రూపంలో కోల్పోయినట్లే. ఇదే సమయంలో 40 శాతం ఇచ్చే మెటీరియల్ కాంపోనెంట్ నిధులు మరో రూ.20 లక్షలు నష్టపోయినట్లే. మొత్తం రూ.50 లక్షలు కోల్పోయినట్లే. గత నాలుగేళ్లలో ఉపాధిహామీ పనులు జరగకపోవడం వల్ల ఒక్కో విలీన గ్రామం రూ.2 కోట్ల మేర నష్టపోవాల్సి వచ్చింది.

**రాయితీ పథకాలకు దూరం**

ఉపాధిహామీ పథకం గ్రామాలకే పరిమితం. ఈ పథకం కింద కూలి పనులు కల్పించడంతో పాటు గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపడతారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 90 శాతం రాయితీతో మినీ గోకులాలను ప్రభుత్వం మంజూరు చేస్తోంది.జాబ్‌కార్డులు ఉన్న వారికే పశుగ్రాస క్షేత్రాలను మంజూరు చేస్తున్నారు. ఈ రెండు పథకాలకు విలీన గ్రామాల ప్రజలు దూరమయ్యారు. మరోవైపు చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో పంటకుంటలు, ఇళ్ల ముంగిట తవ్వుకునే ఇంకుడు గుంతలనూ వీరికి మంజూరు చేయడం లేదు.

# డిజిటల్ బాట.. అక్రమాలకు అడ్డుకట్ట

ముమ్మిడివరం : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చే పనులు చివరి దశకు చేరాయి. దస్త్రాలను డిజిటలైజేషన్ చేసి ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతులకు అందించే సేవల్లో పారదర్శకత, రుణాల మంజూరు, ఇతర వ్యవహారాల్లో అక్రమాలకు ఆన్‌లైన్ విధానంతో అడ్డుకట్ట వేయవచ్చు.

**అంతా పాత పద్ధతిలో..**

పీఏసీఎస్‌లు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కాకినాడ) పరిధిలో పనిచేస్తున్నాయి. రైతులకు రుణాలు, సున్నా వడ్డీ, బంగారం కుదువపెట్టుకుని రుణాలు, డిపాజిట్ల సేకరణ ఇలా బ్యాంకింగ్ రంగానికి సంబంధించి అన్ని సేవలూ అందిస్తున్నారు. రైతులకు ఎరువులు, విత్తనాల విక్రయాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నోడల్ ఏజెన్సీలుగా పీఏసీఎస్‌లు పనిచేస్తున్నాయి. వీటన్నిటినీ దస్త్రాల్లో పొందుపర్చడం, రశీదులు చేతిరాతతో ఇవ్వడం మినహా ఆన్‌లైన్ విధానం లేదు. దీంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.

**కేంద్రం ఆదేశించినా..**

జాతీయ స్థాయిలో ఒకే విధమైన సహకార వ్యవస్థ అందుబాటులోకి



తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితమే కార్యాచరణ రూపొందించింది. కేంద్రమే నిధులు సమకూర్చి కంప్యూటర్లు, ప్రింటర్లు వంటి పరికరాలు అందజేసింది. గత వైకాపా ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడంతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం 80 శాతానికిపైగా దస్త్రాల కంప్యూటరీకరణ పూర్తయింది.

**పారదర్శకతకు అవకాశం**

పీఏసీఎస్‌లలో ఆన్‌లైన్ సేవలు వచ్చే ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తీసుకురావడానికి డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతం చేశాం. సాంకేతిక సమస్యలు అధిగమిస్తూ ముందుకు సాగుతున్నాం. ఆన్‌లైన్ విధానం అందుబాటులోకి రావడంతో పారదర్శక సేవలకు అవకాశం ఉంటుంది. ఎస్.మురళీకృష్ణ, జిల్లా సహకార అధికారి

జిల్లా సమాచారం ఇలా..

జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు: 166

సంఘాల్లో సభ్యులు: 1.30 లక్షలు

లాభాల్లోని సంఘాలు: 117

నష్టాల్లో కొనసాగుతున్నవి: 49

# వసతుల్లేక.. అవస్థలు పట్టక

నిడదవోలు : ఉపాధిహామీ వేతనజీవులకు ఎండల నుంచి ఉపశమనం కోసం గతంలో టెంట్లు సమకూర్చేవారు. పనిచేసే సమయంలో గాయమైతే ప్రథమ చికిత్స అందించేందుకు కిట్లు అందుబాటులో ఉంచేవారు. ఎండనుంచి ఉపశమనం కలిగించేలా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ సరఫరా చేసేవారు. ఇవన్నీ గత తెదేపా హయాంలో కల్పించిన సౌకర్యాలు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఇవన్నీ దూరమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గతంలో మాదిరిగా వసతులు సమకూరుతాయనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం సైతం వారి ఇబ్బందులను గుర్తించింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డ్వామా అధికారులు ఆదేశాలు జారీచేశారు.

గత తెదేపా హయాంలో ఉపాధి పనులు చేసేచోట నీడకోసం టెంట్లు వేసేవారు. తాగడానికి నీరు, గాయమైన ప్రథమ చికిత్స మందులు, వడదెబ్బకు గురైతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేవి. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇవన్నీ కనుమరుగయ్యాయి. పనిచేసే సమయంలో గాయమైతే గట్లపై ఉండే ఆకురసం రాసుకుని, తర్వాత ఆర్ఎంపీ వైద్యుడిని సంప్రదించాల్సిన పరిస్థితి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీపంలోని ఆరోగ్య ఉపకేంద్రాల వద్ద మెడికల్ కిట్లు అందుబాటులో ఉన్నాయి, వాటిని తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో సిబ్బంది తీసుకెళుతున్న దాఖలాలు లేవు. వడదెబ్బ తగిలిన కూలీకి ఉపశమనం కలిగించే ఓఆర్ఎస్ ప్యాకెట్లు పనిచేసే ప్రదేశంలో ఎక్కడా కనిపించడం లేదు. దీంతో కూలీలు ఇంటికి వచ్చేసరికి నీరసించిపోతున్నారు. పనిచేసే చోట మజ్జిగ మాట అటుంచి తాగునీటి సదుపాయమైనా లేదు. వెంట తీసుకెళ్లిన నీరే ఒబ్బిడిగా వాడుకోవాల్సిందే. వేసవి నేపథ్యంలో కూడా తీసుకెళ్లిన నీటిసీసాలు ఎండ తీవ్రతకు వేడెక్కిపోతున్నాయి. టెంట్లు లేక చెట్లనీడన సేద తీరాల్సిన దుస్థితి. ఉపాధిహామీ పథకం అమలులో తీసుకొచ్చిన మార్పులు వేతనజీవులపై శరాఘాతంగా మారాయి. రెండు పూటల పనికి దూరంగా వెళ్లి రావడానికి పలు ఇబ్బందులు పడుతున్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నాం..**

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఉపకేంద్రం వద్ద ఉన్న మెడికల్ కిట్లు తీసుకుని కూలీలకు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశాం. తాగునీటికి అయ్యే ఖర్చును వారి వేతనంలో కలిపి అందిస్తున్నాం. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా, నీరసించిపోకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించాం. ఎక్కువ మంది కూలీలు ఉన్న చోట ప్రత్యామ్నాయంగా నీడ కోసం కొబ్బరి, తాటాకు పందిళ్లు వేయాలని చెబుతున్నాం. మజ్జిగ సరఫరాకు సంబంధించి ఉన్నతాధికారులకు నివేదించాం. రామ్‌ప్రసాద్, ఏపీడీ, డ్వామా

జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే...

మండలాలు 18

పంచాయతీలు 300

మొత్తం జాబ్‌కార్డులు 1.68 లక్షలు

మనుగడలో ఉన్నవి 1.28 లక్షలు

మొత్తం కూలీలు 2.59 లక్షలు

ప్రస్తుతం అన్నీ రకాల పనులకు వచ్చేవారు 1.78 లక్షలు

రోజూవారీ కూలీలు 10,428

# 'తూము'తవ్వండి.. మడి తడపండి




కర్నూలు : ఉమ్మడి జిల్లాలో కృష్ణమ్మ పారుతున్నా చేనుకు నీరు చేరడం లేదు.. పదేళ్ల కిందట హంద్రీ కాల్వ తవ్వారు.. చివరికి భూములిచ్చిన రైతు పొలానికీ నీరు అందడం లేదు.. పంట కాల్వలు తవ్వాలని ఏళ్లుగా అన్నదాతలు విన్నవిస్తున్నారు. రూ.660 కోట్లతో విస్తరణ పనులకు 'కూటమి' ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.. ఈ నేపథ్యంలో ప్రధాన కాల్వ వెంట 'తూము'లు నిర్మిస్తే బాగుంటుందని ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.. మల్యాల నుంచి పత్తికొండ వరకు 18 చోట్ల తూములు ఏర్పాటు చేస్తే 16,670 ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరు ఇవ్వొచ్చని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఒక్కో దాని వెంట 5-8 క్యూసెక్కులు ప్రవహించేలా రంధ్రం ఏర్పాటు చేసి గేటు బిగిస్తే అవసరమైన సమయంలో విడుదల చేసుకోవచ్చు.. లేదంటే మూసి వేయొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

**విస్తరణకు కూటమి అడుగులు**

హంద్రీనీవా ప్రధాన కాల్వలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 2,200 క్యూసెక్కుల నుంచి 3,850 క్యూసెక్కులకు పెంచేలా విస్తరించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. జూన్ 15 నాటికి పూర్తయ్యేలా శరవే'గంగా' పనులు చేపడుతున్నారు.

రూ.256 కోట్లతో ప్యాకేజీ-1 పనులు, రూ.440 కోట్లతో ప్యాకేజీ-2 పనులను పూర్తి చేయనున్నారు. ప్యాకేజీ-2లో 89వ కి.మీ.ల నుంచి 134 కి.మీ.ల దూరం వరకు ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో ఉంది. విస్తరణ అనంతరం కాల్వ వెడల్పు 10 నుంచి 17 మీటర్ల వరకు ఉండనుంది.

11 మండలాలు.. 124 గ్రామాలు

రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీరు అందించాలన్న ఉద్దేశంతో హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టును 2012-2013లో చేపట్టారు. శ్రీశైలం జలాశయం నీటిని ఎత్తిపోస్తూ చిత్తూరు జిల్లా వరకు తీసుకెళున్నారు. ప్రధాన కాల్వ నందికొట్కూరు, కర్నూలు గ్రామీణ, కల్లూరు, కోడుమూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి, దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, పత్తికొండ మండలాల మీదుగా వెళ్తోంది. ప్రధాన కాల్వపై 69.130 కి.మీ.(కృష్ణగిరి) వద్ద 0.164 టీఎంసీలు, 106.100 కి.మీ.(పందికోన) వద్ద 1.126 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా జలాశయాలు నిర్మించారు. మల్యాల, బ్రాహ్మణకొట్కూరు, మల్లేపల్లి, కృష్ణగిరి, కంబాలపాడు, ఆలంకొండ, గుండ్లకొండ వద్ద నీటిని ఎత్తిపోస్తూ ముందుకు తీసుకెళ్తారు.

పనులు నిషేధించిన వైకాపా

హంద్రీనీవా కాల్వను విస్తరిస్తాం.. పంట కాల్వలు తవ్వి ఆయకట్టును స్థిరీకరిస్తామని గత వైకాపా ప్రభుత్వం మాటలు చెప్పింది.. ఇదిగో విస్తరణ అంటూ నిర్మాణ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నా పనులు ప్రారంభించలేదు. ఐదేళ్ల కాలంలో పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. తీరా జీవో 365 తీసుకొచ్చి ఐదేళ్ల వరకు పనులు చేయకూడదని నిషేధం విధించారు. ఈ ఏడాది ఆగస్టుతో అది పూర్తవనుండటంతో తిరిగి పనులు చేసేందుకు అవకాశముంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

**చెంతనే నీరు.. చేనుకు చేరని తీరు**

పందికోన జలాశయం కింద 61,400 ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉండగా అతికష్టంగా 18,500 ఎకరాలకు అందిస్తున్నారు. ఈ జలాశయం ఆయకట్టు పరిధిలో పూర్తిస్థాయి పనులు చేపట్టలేదు. ఎడమ, కుడి కాల్వలు అర్ధంతరంగా వదిలేశారు. కృష్ణగిరి జలాశయం కింద 5,090 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించారు.

ఏటా ఆగస్టు చివరి నుంచి ఫిబ్రవరి వరకు ప్రధాన కాల్వలో నీటి ప్రవాహం ఉంటుంది. ఎక్కడా పంట కాల్వలు లేవు. రైతులు ప్రధాన కాల్వలో పైపులు వేసి నీటిని తీసుకెళ్తున్నారు. కాల్వ ఒడ్డుపై డీజిల్ ఇంజిన్లు, పైపులకు ఒక్కో రైతు ఏటా రూ.లక్షలు ఖర్చు పెడుతున్నారు. చుక్కనీటి కోసం అన్నదాతలు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

ప్రధాన కాల్వ పొడవు 135 కి.మీ.

మండలాలు: 11

గ్రామాలు: 124

నీటి కేటాయింపు 5.50 టీఎంసీలు

నీరు ఇవ్వాల్సిన ఆయకట్టు 80 వేల ఎకరాలు

సాగు నీరు అందుతోంది 27 వేల ఎకరాలు

# ఓర్వకల్లు.. పరిశ్రమల ఇల్లు



కర్నూలు: ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్ (పార్కు) అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రోగ్రాం' కింద మౌలిక సదుపాయాల కోసం నిధులు విడుదల చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 13,830 ఎకరాలు సేకరించింది. అందులో 9,455.41 ఎకరాల్లో పారిశ్రామికవాడను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2,624.64 ఎకరాల్లో రూ.1771 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు 'కూటమి' ప్రభుత్వం 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్' (నిక్‌డిట్)తో ఒప్పందం కుదుర్చుకొంది. ఆయా పనులు చేపట్టేందుకు ఏపీఐఐసీ అధికారులు టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

**దిగ్గజ సంస్థలతో ఒప్పందం**

జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెస్ గ్రూప్, బీఎన్ గ్రూప్‌లు సంయుక్తంగా రూ.14వేల కోట్లతో సెమీకండక్టర్ తయారీ పరిశ్రమను నెలకొల్పనున్నాయి. రెండున్నరేళ్లలోనే ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. 130 ఎకరాల్లో నిర్మించబోయే ఈ పరిశ్రమ ద్వారా రెండువేల మందికి ప్రత్యక్షంగా, 10 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది.

1200 ఎకరాల్లో రూ.13వేల కోట్ల పెట్టుబడితో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. ఎలక్ట్రిక్ వాహనాలను ఇక్కడ తయారు చేయనున్నారు. ఈ ఒక్క పార్క్‌లోనే దశలవారీగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. డ్రోన్‌హబ్‌ను 300 ఎకరాలు కేటాయించారు. రూ.వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టడం ద్వారా ఐదువేల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది

**నిత్యం 74 ఎంఎల్‌డీల నీరు**

ఓర్వకల్లు పారిశ్రామికవాడకు ముచ్చుమర్రి నుంచి నిత్యం 74 ఎంఎల్‌డీల నీరు వచ్చేలా పనులు చేస్తున్నారు. తొలిదశలో రోజుకు 42 ఎంఎల్‌డీలు, తర్వాత దశలో రోజుకు 74 ఎంఎల్‌డీల నీరు తరలించేలా పైపులైన్ పనులు చేపడుతున్నారు. మొత్తం 57 కి.మీ.ల మేర పైపులైన్లు వేయాల్సి ఉండగా 16 కి.మీ. మిగిలింది.

**రైలు మార్గం సుగమం**

సరకు రవాణాకు రైలు మార్గం ఎంతో అవసరం.. ఇదే విషయాన్ని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఇటీవల రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఓర్వకల్లు మీదుగా బేతంచెర్ల వరకు రైల్వేలైను నిర్మాణం చేపడితే అటు ప్రయాణికులు, ఇటు సరకు రవాణాకు వీలుంటుందని సూచించారు. అదేవిధంగా సరకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు వీలుగా అన్ని సదుపాయాలతో ఓర్వకల్లులో రైల్వే సైడింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయా అంశాలపై రైల్వే అధికారులు డీపీఆర్ సిద్ధం చేసే పనిలో పడ్డారు.

**విమానాశ్రయం విస్తరణ**

సరకు రవాణాకు వీలుగా కర్నూలు విమానాశ్రయాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రెండు కి.మీ. పొడవున్న రన్‌వేను 2.8 కి.మీ. మేర, 30 మీటర్ల వెడల్పును 45 మీటర్లకు విస్తరించనున్నారు. రాత్రి వేళ విమానాల రాకపోకలు సాగించేందుకు వీలుగా వసతులు కల్పించనున్నారు. ఆయా పనులకు రూ.13 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

# తరగని నిధులు.. కదలని పనులు

నంద్యాల : గనుల లీజుదారుల నుంచి జిల్లా ఖనిజాభివృద్ధి నిధికి దండిగా డబ్బులు సమకూరుతున్నాయి. అవి పల్లె ఖాతాకు చేరడం లేదు. 2019-20 నుంచి గత ఆర్థిక సంవత్సరం ముగిసే వరకు ఉమ్మడి జిల్లాలో ఈ మొత్తం రూ.162.33 కోట్ల వరకు జమైంది. ఇందులో నంద్యాల జిల్లాలో రూ.109.78 కోట్లు, కర్నూలు జిల్లాలో రూ.52.55 కోట్లు ఉన్నాయి. వీటిని జిల్లా కలెక్టర్, గనుల శాఖ అధికారులు, ఇన్‌ఛార్జి మంత్రి నిర్ణయం మేరకు ఖర్చు చేయాల్సి ఉంది. సమన్వయ లోపంతో వీటిని ఏటా సరిగ్గా వినియోగించడం లేదు. ఫలితంగా రూ.62 కోట్లు మిగిలిపోయింది.

ఏటా 12.50 శాతం జమ గనుల ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా మినరల్ ఫౌండేషన్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ)ను ఏర్పాటు చేశారు. ఏటా వసూలు చేసే సీనరేజ్‌లో 12.50 శాతం మొత్తాన్ని డీఎంఎఫ్‌టీ కింద జమ చేస్తారు. గనుల తవ్వకాలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితమయ్యే 10-25 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని జీవో నంబరు 36 చెబుతోంది. మంచినీరు, విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఉమ్మడి జిల్లాలో ఐరన్ ఓర్, వైట్‌షెల్, సిలికా శాండ్, గ్రానైట్, గ్రావెల్, ఇసుక, రోడ్ మెటల్, బెరటీస్, సోప్ స్టోన్, క్వార్ట్జ్, ఎల్లో ఓఛర్ తదితర ఖనిజాలు లభిస్తాయి. గనులు, పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# మోరంపూడి పైవంతెనపై వెలుగులేవీ?

రాజమహేంద్రవరం : మోరంపూడి పైవంతెన(ఫ్లైఓవర్)పై వాహనాల రాకపోకలకు అనుమతించి ఆరు నెలలు దాటినా కొన్ని పనులు నేటికీ పూర్తికాలేదు. గడువు పెంచుకుంటూ పోతున్నారే తప్ప వాటిని పూర్తి చేయడం లేదు. వంతెనపై విద్యుత్తు దీపాల ఏర్పాటు పనులోన్లూ తీవ్ర జాప్యం చేస్తుండడంతో వాహనచోదకులు రాత్రివేళలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులు పూర్తిచేయడంలో గుత్తేదారు సంస్థ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు.



**ఆది నుంచీ అంతే..**

ఎన్‌హెచ్ఏఐ పర్యవేక్షణలో 1.42 కిలో మీటర్ల మేర రూ.60 కోట్లతో చేపట్టిన మోరంపూడి పై వంతెన పనుల్లో ఆది నుంచి జాప్యం జరుగుతూనే ఉంది. ఇక్కడ ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ఎట్టకేలకు గతేడాది సెప్టెంబరు 8న పనులు పూర్తికాకుండానే లాంఛనంగా ప్రారంభించి పైనుంచి వాహనాల రాకపోకలకు అనుమతించారు. వంతెనపై విద్యుత్తు దీపాల ఏర్పాటు, రెండో లేయర్, మార్కింగ్, కింద ఇరువైపులా సర్వీసు రోడ్ల ఏర్పాటు పనులు మాత్రం ఇప్పటికీ పూర్తికాలేదు. గతేడాది డిసెంబరు నెలాఖరు నాటికే వీటిని పూర్తి చేస్తామని చెప్పుకొచ్చినప్పటికీ అది జరగలేదు. వంతెనపై ఇరువైపులా విద్యుత్తు కేబుల్ వేసినా ఇంకా స్తంభాలు ఏర్పాటు చేయలేదు. మార్చి నాటికి పెండింగ్ పనులన్నీ పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పినా నత్తనడకనే సాగుతున్నాయి. కింద సర్వీసు రోడ్లు కూడా అభివృద్ధి కాలేదు. గుంతలమయంగా ఉండటంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడక తప్పడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి మోరంపూడి పైవంతెన పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# కాసుల వేటకు కళ్లెం పడేనా?

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని పోస్టుమార్టం నిర్వహించాల్సి వస్తే బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మృతదేహం వచ్చిన దగ్గర నుంచి పోస్టుమార్టం చేసి అంబులెన్సులో పంపేవరకు అవస్థే. ప్రైవేటు ఫ్రీజర్లు.. అంబులెన్సుల దందా.. పోస్టుమార్టం కిట్లకు వసూళ్లు.. ఇలా ఒకటేమిటి అన్నింట్లోనూ దోచేస్తున్న పరిస్థితి ఉండేది. దీనిపై పలు ఫిర్యాదులు రావడంతో నలుగురిపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. మార్చురీ వద్ద పరిస్థితి గతేడాది సెప్టెంబరు 3న 'కన్నీటిలో కాసులవేట' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. పలుమార్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సైతం ఈ సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జీజీహెచ్‌లోని పోస్టుమార్టం కిట్‌కు సుమారు రూ.500 ఖర్చవుతుంది. అలాంటిది ఒక్కో మృతదేహానికి బాధితుల వద్ద రూ.3 వేల నుంచి 5 వేలు వసూలు చేస్తున్నారు. ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని అడ్డం పెట్టుకుని రేటు మాట్లాడుకుంటున్నారని.. వారు చెప్పిందాంట్లో కొంచెం తక్కువ నగదు ఇచ్చినా పోస్టుమార్టం చేయడానికి గంటల తరబడి ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**వ్యవహారం వెనక ఎవరు?**

కలెక్టర్ చర్యలతో శవాగారం వద్ద దోపిడీ ఆగుతుందా అంటే ప్రశ్నార్థకమే. మార్చురీ వద్ద వసూళ్లు, డబ్బు డిమాండ్ చేయడం తదితర వ్యవహారమంతా ఆసుపత్రి ఉన్నతాధికారులకు తెలియకుండానే జరిగిందా? అనే విమర్శలొస్తున్నాయి. నేరుగా బాధితుల వద్ద ఓ పొరుగు సేవల ఉద్యోగి వసూళ్లకు పాల్పడుతుంటే ఆ విభాగ వైద్యులు ఏం చేస్తున్నారనే ప్రశ్నలొస్తున్నాయి. ఏదైమైనా లోతైనా విచారణ చేస్తే



మరింత మంది బయటికొచ్చే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది.

**అంబులెన్సుల దోపిడీ ఆపాలి..**

మృతదేహాలను తరలించేందుకు జీజీహెచ్‌లో రెండు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఒక్కోసారి ఇవి మృతదేహాలను తీసుకెళ్లినప్పుడు మార్చురీ సిబ్బంది, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది సమాచారంతో కొందరు ప్రైవేటు అంబులెన్సులతో రంగంలోకి దిగిపోతున్నాయి. వారు చెప్పిందే రేటు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. బయటి నుంచి తాము వేరే అంబులెన్సు తెచ్చుకుంటామన్నా ఒప్పుకోకుండా ఘర్షణలకు దిగుతుండడం గమనార్హం. దీన్ని పూర్తిగా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

**శవపరీక్షలకు డబ్బులు డిమాండ్ చేసిన నలుగురిపై వేటు**

శవపరీక్షలు (పోస్టుమార్టం) కోసం డబ్బులు డిమాండ్ చేస్తున్న రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో నలుగురు సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుమార్టం అసిస్టెంట్‌గా పని చేస్తున్న పొరుగుసేవల సిబ్బంది పి.భవానీ ప్రసాద్ బాధితుల నుంచి రూ.5 వేలు తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరపగా వాస్తవమేనని ఆయన అంగీకరించారన్నారు. సెక్యూరిటీ సిబ్బంది బాబ్జీ, రామ్‌కుమార్, రామకృష్ణలకు కూడా కొంత మొత్తం ఇచ్చినట్లు తేలడంతో ఆ నలుగురిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది సేవాభావంతో విధులు సక్రమంగా నిర్వహించాలని, అవినీతికి పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే ఉండదని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు.

## లేడీ సూపర్ స్టార్ తగ్గడానికి కారణం అదా?

లేడీ సూపర్ స్టార్ నయనతార మెగాస్టార్ చిరంజీవి 157వ సినిమా ప్రమోషనల్ వీడియో తో సర్ ప్రైజ్ చేసిన సంగతి తెలిసిందే. ఓసినిమాకు సంబంధించి నయన్ ఇలా ప్రచారంలో పాల్గొనడం చూసి కొన్ని సంవత్స రాలవుతుంది. తాను స్టార్ గా ఎదిగిన తర్వాత ప్రచారం అనే పదాన్ని తన డిక్షనరీ నుంచి తొలగించింది. ప్రచారం కోసమే అదనంగా పారితోషికం చెల్లిస్తామన్నా నోవే అంటూ కొనసాగింది. కానీ 157వ సినిమా మొదలు కాకముందే ప్రమోషనల్ వీడియోతో ప్రేక్షకుల ముందుకు రావడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. నయనతార ఇలా ప్రచారంలో పాల్గొందా? అని మాట్లాడుకుంటున్నారు. ఇకపై అన్ని సినిమాల ప్రచారా లకు నయన్ హాజరవుతుందా? అన్న చర్చ కూడా సాగుతుంది. మరి నయన్ ప్రచారంలో పాల్గొనడం వెనుక అసలు కారణాలు ఏంటి? అన్నది ఇంతవరకూ బయటకు రాలేదు. అయితే తాజాగా నయన్ పబ్లిసిటీ వెనుక ఓ రీజన్ వైరల్ అవుతుంది. హీరోయిన్ల మధ్య పోటీ పెరగడంతో నయన్ ప్రచారం పై ఉన్న కండీషన్ తొలగించిందంటున్నారు. ముఖ్యంగా సౌత్ భామల



నుంచి పోటీ తీవ్ర మవ్వడంతో ఇదే కొనసాగితే అవకాశాలపై ప్రభావం పడుతుం దనే భయంతో నయన్ ఓ మెట్టు కిందకు దిగినట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. పైగా వాళ్లంతా అదనంగా ఎలాంటి పారితోషికం తీసుకో కుండానే దర్శక, నిర్మాతలకు అన్ని రకాలుగా అందుబాటులో ఉంటున్నారు. హీరోయిన్ల మధ్య పరిస్థితులు కూడా మునుపటిలా లేవు. ఓవర్ నైట్ లో నే స్టార్ అవుతున్నారు. ఆ స్టార్ డమ్ ని తెలివిగా కొన సాగిస్తున్నారు. అందుకు ప్రచారాన్ని ఆయుధంగా వినియోగిస్తున్నారు. రష్మిక మందన్న బాలీవుడ్ లో కేవలం రెండు సినిమా సక్సెస్ తోనే ఫేమస్ కాలేదు. అక్కడ కల్చర్ కు తగ్గట్టు మౌల్డ్ అయింది. ప్రచారం పరంగా అక్కడ ఎలాంటి అనుకూల వాతావరణం కల్పించాలో? క్రియేట్ చేసి ఓ స్ట్రాటజీతో వెళ్లింది. ఇది వర్కౌట్ అవ్వడం అమ్మడికి కలిసొచ్చింది. ఇదే తరహాలో మిగతా సౌత్ భామలు పబ్లిసిటీ విషయంలో ముందుంటున్నారు. రాబోయే రోజుల్లో పరిస్థితులు మరింత మారు తాయి. వీటన్నింటిని నయనతార పసిగట్టే అలెర్ట్ అయినట్లు కనిపిస్తుంది.

## బుక్ మై షో గేమ్‌పై బిగ్ డౌట్?

ఈ మధ్యకాలంలో తెలుగు చిత్ర పరిశ్రమలో బుక్మైషో యాప్ చుట్టూ కొన్ని అనుమానాలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. ప్రేక్షకుల ఇన్‌స్టంట్ స్పందనతో హిట్ ఫ్లాప్ డిసైడ్ అయ్యే రోజుల్లో, ఒక్క టికెట్ బుకింగ్ యాప్‌పైనే అనుమానాలు వస్తుండటం ఫోకస్ లోకి వస్తోంది. మరీ ముఖ్యంగా ఓ ప్రముఖ నిర్మాత వరుసగా వాట్‌సాప్ గ్రూపుల్లో తన అసంతృప్తిని బయటపెడుతున్నా, గిల్డ్‌లో పెద్ద నిర్మాతలు మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారు అన్నది ఇండస్ట్రీలో ఇప్పుడు హాట్ టాపిక్. ప్రస్తుతం వస్తున్న ఆరోపణలు ప్రకారం బుక్ మై షోలో బాట్స్ ద్వారా లైక్స్, ఇంటరెస్టింగ్ కౌంట్లు పెంచుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. టికెట్ బుక్ చేయని వారు కూడా ఓటింగ్ చేయగలుగుతున్న విధానం వల్ల నిజమైన ఆడియన్స్ స్పందన ఎక్కడ అనేది గుర్తించలేకపోతున్నామని నిర్మాతలు వాపోతున్నారు. కొందరు సినిమాలకు ఓవర్ హైప్, రివ్యూలు ముందుగానే ప్రాజెక్ట్ చేయడం వల్ల కంటెంట్ బలమైన సినిమాలు అవమానాన్ని ఎదుర్కొంటున్నాయని వాదిస్తున్నారు. ఇదంతా ఇండస్ట్రీ కోసం జరుగుతున్నా, బుక్ మై షోను అడగాల్సిన పెద్ద పెద్ద నిర్మాతలు మాత్రం నిశ్శబ్దం పాటిస్తున్నారన్నది గమనార్హం. ఎందుకంటే వీరిలో చాలామంది థియేటర్ల నిర్వహిస్తున్నవారే కావడం, బుక్ మై షో నుండి కోటి నుంచి 20 కోట్ల వరకూ రుణాలు తీసుకున్న సంబంధాలున్నాయని టాక్ వినిపిస్తోంది. ఇంకో కోణంగా చూస్తే, ఈ బుక్ మై షో సంస్థ స్వయంగా మల్టీప్లెక్స్‌లలో పెట్టుబడులు పెడుతోందన్న వాదన కూడా బలంగా వినిపిస్తోంది. ఇటీవలే ఓ సీనియర్ హీరో నిర్మిస్తున్న మల్టీప్లెక్స్ ప్రాజెక్టులో బుక్ మై షో రూ.20 కోట్లు పెట్టుబడి పెట్టినట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బుక్ మై షో వ్యాపార విధానాలపై బహిరంగంగా విమర్శలు చేయాలంటే కొందరికి తలవంపు అయినట్లే. ఇక ఇందులో కొందరు ప్రముఖ గిల్డ్ సభ్యులు కూడా ఉన్నారు. అందులో ప్రముఖులు కూడా ఈ వ్యవహారంపై ఇప్పటివరకు స్పందించకపోవడంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





## ఈ రెండు టీజర్లలో క్రియేటివిటీ ఎక్కువగా ఏ టీజర్ లో కనిపించింది?





ఈ సీజన్ లో థియేటర్లలో సందడి చేయబోతున్న ఓ రెండు సినిమాల టీజర్లు ప్రధానంగా ప్రజల్లో చర్చకు వచ్చాయి. ఇవి రెండూ భారీ వీఎఫ్ఎక్స్ ఆధారిత టీజర్లు. అత్యంత భారీతనం నిండిన విజువల్స్ తో దూసుకొచ్చాయి. అయితే ఈ రెండు టీజర్లలో క్రియేటివిటీ ఎక్కువగా ఏ టీజర్ లో కనిపించింది? అభిరుచి, కొత్తదనం ఏ టీజర్ లో ఉంది? అంటూ నెటిజనులలో డిబేట్ మొదలైంది. ఆసక్తికరంగా ఈ డిబేట్ లో పెద్ద స్టార్లు నటించిన సినిమాకి సంబంధించిన టీజర్ తో పోలిస్తే, అభిరుచిలో, వీఎఫ్ఎక్స్ నాణ్యతలో, కంటెంట్ పరంగా చిన్న హీరో నటించిన టీజర్ ప్రశంసలు అందుకుంది. పెద్ద హీరోల కోసం బడా నిర్మాణ సంస్థ ఏకంగా వందల కోట్ల పారితోషికాలు చెల్లించుకోవాలి. కానీ అంత పెద్ద మొత్తం పారితోషికంతో పని లేకుండా ఒక సాధారణ భత్యంతో పని చేసే ఒక యువహీరో తన టీజర్ తో తన లుక్స్ తో, తన ఛరిష్మాతో ఆశ్చర్యపరిచాడు. విడుదల చేసింది చిన్న గ్లింప్స్ కావొచ్చు.. కానీ ఇది దూసుకెళుతోంది. తెలుగు సినిమా ఖ్యాతిని మరో స్థాయికి ఇనుమడింపజేసే సినిమా ఇది అవుతుందని నిరూపించబోతోంది. ఈ సినిమా మరేదో కాదు.. మిరాయ్. ప్రఖ్యాత పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి కార్తీక్ ఘట్టమనేని అనే యువ ప్రతిభావంతుడు తెరకెక్కిస్తున్నారు. అతడి ఆలోచన, అభిరుచి, వీఎఫ్ ఎక్స్ పనితనాన్ని తీసుకున్న విధానం, యాక్షన్ ఎపిసోడ్స్ ఎంపిక ప్రతిదీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ఇక హనుమాన్ తో పాన్ ఇండియాలో మ్యాజిక్ చేసిన యువహీరో తేజ సజ్జా, మిరాయ్ లో ఇంకా అద్భుతంగా కనిపిస్తున్నాడు. అతడి బాడీ లాంగ్వేజ్, ఫ్లెక్సిబిలిటీ భవిష్యత్ స్టార్ గా ఆవిష్కరిస్తోంది. ఇక బడ్జెట్లు పెడితే తెలుగు డైరెక్టర్లు హాలీవుడ్ రేంజు సినిమాలు తీయగలరనడానికి ఈ టీజర్ ఒక నాణ్యమైన ఉదాహరణగా నిలుస్తోంది. అయితే బడా హీరోలతో వచ్చిన ఆ టీజర్ ఏదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. హృతిక్ రోషన్- ఎన్టీఆర్ లాంటి అగ్ర హీరోలతో యష్ రాజ్ ఫిలింస్ నిర్మిస్తున్న 'వార్ 2' భారీ విజువల్స్ - వీఎఫ్ ఎక్స్ కంటెంట్ తో రూపొందుతోంది. అయితే ఇక్కడ ఒకటే సమస్య. ప్రతిసారీ చూసేసిన విజువల్స్ నే తిరిగి చూపిస్తే, అది ఆడియెన్ కి కొత్తగా కనిపించదు... కిక్కివ్వదు.. రొటీన్ ఛేజ్ లు.. జంప్ లు.. స్టంట్స్ వగైరా ఇండియన్ ఆడియెన్ కి కొత్తేమీ కాదు. దానికి మించి ఇంకేదైనా చేయాల్సి ఉంటుంది. హృతిక్ ని ధూమ్ 2, క్రిష్ ఫ్రాంఛైజీలో చూసిన కళ్లు, ఇప్పుడు వార్ 2లో కొత్తగా చూడటం లేదు. ఇక యంగ్ టైగర్ ఎన్టీఆర్ మాత్రం ధూమ్, వార్ తరహా సినిమాలో నటించడం తన అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా ఉంటుంది. కానీ దీనికి ముందు ఆర్.ఆర్.ఆర్ తో అంతకుమించిన మ్యాజికల్ వార్ యాక్షన్ ఎపిసోడ్స్ లో తారక్ ని చూసిన ప్రజలకు ఇంకా ఇంకా స్పెషల్ ఏదైనా కావాలి. అయితే ఇలాంటి విజువల్స్ లో కూడా తారక్ ని ఇంకా మెరుగ్గా క్రియేటివ్ గా ఆవిష్కరించాల్సి ఉంటుందని దర్శకుడు అయాన్ ముఖర్జీకి గుర్తు చేయడానికి విశ్లేషకులు వెనకాడటం లేదు. మారిన ప్రేక్షకుల అభిరుచి, పెరిగిన విజ్ఞానం దృష్ట్యా క్రియేటివిటీలో ఇంకా కొత్తదనం చాలా అవసరం. బడ్జెట్ల పరంగా చూస్తే మిరాయ్ కంటే, వార్ 2 బడ్జెట్ ఎన్నో రెట్లు ఎక్కువ. కానీ ఏం ప్రయోజనం. ఇప్పుడు బాలీవుడ్ చిత్రసీమ ఇన్ సెప్షన్, ఇంటర్ స్టెల్లార్ లను మించిన సినిమాలను దేశీ మాస్ కి కూడా ఎక్కేలా, స్థానికతతో చూపించాల్సి ఉంటుంది. అలాంటి సినిమాల్లో మాత్రమే తారక్, హృతిక్ లాంటి ట్యాలెంట్ ను ఉపయోగించుకోవాలి. అనవసరంగా ప్రతిభను వృథా చేయకూడదు. ఆగస్టులో వార్ 2 విడుదలవుతుండగా, సెప్టెంబర్ లో మిరాయ్ విడుదలవుతుంది. ఈ రెండిటిలో ఏది బెస్ట్ అనేది ప్రేక్షకులే తేల్చాల్సి ఉంది.

## విశ్వంభర వెనకడుగు దేనికి..?




మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర రిలీజ్ ఎప్పుడు ప్రస్తుతం మెగా ఫ్యాన్స్ కి ఉన్న అతి పెద్ద డౌట్ ఇదే. ఈ ఏడాది సంక్రాంతికే సినిమాను తీసుకొచ్చే ప్లాన్ చేసిన మేకర్స్ సడెన్ గా చరణ్ మూవీ కోసం వాయిదా వేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. అది ఓకే అనుకున్న ఫ్యాన్స్ కి సినిమా రిలీజ్ డేట్ విషయంలో దర్శక నిర్మాతలు చేస్తున్న ఆలస్యం చూస్తుంటే మరింత డౌట్ పెరుగుతుంది. బింబిసార సినిమాతో మెప్పించిన వశిష్ఠ చెప్పిన కథ నచ్చడంతో విశ్వంభర ఫిక్స్ చేసుకున్నాడు చిరంజీవి. సినిమా అనౌన్స్ మెంట్ వీడియోతో ఆసక్తి కలిగేలా చేసినా గ్రాఫిక్స్ విషయంలో కాస్త శ్రద్ధ వహించాల్సిందే అని ఆడియన్స్ నుంచి కామెంట్స్ వచ్చాయి. ఇప్పుడు సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయకపోవడానికి రీజన్ కూడా అదే అని అంటున్నారు. ఈమధ్య సీజీ వర్క్ విషయంలో సినీ ప్రియులంతా మంచి ఫోకస్ తో ఉన్నారు. సరైన వి.ఎఫ్.ఎక్స్ వర్క్ లేకపోతే మాత్రం తిప్పి కొడుతున్నారు. ఈమధ్య వచ్చిన చాలా సినిమాలకు అలాంటి రిజల్ట్ ఇచ్చారు. విశ్వంభర సినిమా కథలో గ్రాఫిక్స్ కూడా భాగం కాబట్టి ఈ సినిమాను విజువల్స్ పరంగా ది బెస్ట్ ఉండేలా చూస్తున్నారు. ఐతే అది కాస్త అనుకున్న టైంలో పూర్తి చేయలేక రిలీజ్ ఎప్పుడన్నది చెప్పలేకపోతున్నారు. మరోపక్క సెట్స్ మీద ఉన్న సినిమాలు అన్నీ కూడా ఒక దాని వెంట మరొకటి రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తూ డేట్స్ లాక్ చేసుకుంటున్నాయి. వాటితో పాటు విశ్వంభర రిలీజ్ ఎప్పుడని తెలుసుకోవాలని మెగా ఫ్యాన్స్ ఆసక్తిగా ఉన్నారు. కానీ యువి క్రియేషన్స్ మాత్రం విశ్వంభర రిలీజ్ ఎప్పుడన్నది ఇంకా డిక్లేర్ చేయలేదు. జూలై 22న రిలీజ్ చేయాలనే ప్లానింగ్ లో ఉన్నారన్న టాక్ వినిపిస్తుంది. మరోపక్క చిరంజీవి బర్త్ డే కానుకగా విశ్వంభర రిలీజ్ చేస్తారంటూ చెబుతున్నారు. మరి విశ్వంభ్ర వెనకడుగు వేయకుండా త్వరగా రిలీజ్ అయితే చూడాలని మెగా ఫ్యాన్స్ ఉత్సాహంగా ఉన్నారు. స్టార్ సినిమాలు ఇలా రిలీజ్ డేట్ ఎప్పుడన్న క్లారిటీ లేకపోతే ఫ్యాన్స్ లో టెన్షన్ కామనే. ఐతే మెగాస్టార్ విశ్వంభర సినిమా రిలీజ్ విషయంలో ఎప్పటికి క్లారిటీ వస్తుంది అన్నది చూడాలి. విశ్వంభర సినిమాలో చిరు సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా మీనాక్షి చౌదరి, ఆషిక రంగనాథ్ లు కూడా ఇంపార్టెంట్ రోల్స్ లో నటిస్తున్నారు.

## తెలుగమ్మాయి టాలెంట్ ను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం

ఆరడుగుల అందగత్తె ఫరియా అబ్దుల్లా టాలీవుడ్ లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. అందం, నటనతో పాటూ అమ్మడికి అన్ని విషయాల్లోనూ టాలెంట్ ఉంది. తాజాగా గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ 2024లో ఫరియా స్పెషల్ జ్యూరీలో అవార్డు దక్కించుకుంది. ఈ విషయాన్ని జ్యూరీ వెల్లడించగానే ఫరియా ఎంతో ఎమోషనల్ అవుతూ సోషల్ మీడియాలో తన ఆనందాన్ని పంచుకుంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా రాష్ట్ర చలనచిత్ర అవార్డుల విజేతలను అనౌన్స్ చేసింది. ప్రముఖ విప్లవ గాయకుడు గద్దర్ జ్ఞాపకార్థంగా తెలంగాణ ప్రభుత్వం అతని పేరుని ఈ అవార్డులకు పెట్టింది. సినీ ఇండస్ట్రీలోని కొత్త టాలెంట్ ను గౌరవించడమే లక్ష్యంగా ఈ అవార్డుల వేడుక జూన్ 14న హైదరాబాద్ లో ఎంతో ఘనంగా సెలబ్రిటీల



మధ్య జరగనుంది. అయితే అవార్డు విజేతల్లో మత్తు వదలరా2 లో ఫరియా పాడిన నక్కో మామా అనే ర్యాప్ సాంగ్ కు అవార్డు దక్కింది. మత్తు వదలరా2 సర్‌ప్రైజింగ్ బ్లాక్ బస్టర్ గా నిలవగా, ఆమె పాడిన ఈ ర్యాప్ సాంగ్ ఓ స్పెషల్ సాంగ్ గా మారింది. ఈ విషయంలో ఫరియా తన సంతోషాన్ని షేర్ చేసుకుంటూ ఈ అవార్డు వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని, ఈ అవార్డు ఇచ్చినందుకు గద్దర్ అవార్డుల జ్యూరీకి ధన్యవాదాలని, దీనికి కారణమైన మత్తువదలరా2 టీమ్ కు డైరెక్టర్ రితేష్ రాణాకు, మ్యూజిక్ డైరెక్టర్ కాలభైరవకు థ్యాంక్స్ చెప్పింది. ఈ అవార్డు వచ్చాక అందరి దృష్టి ఫరియాపై ఉన్నప్పటికీ ఆమె మాత్రం చాలా వినమ్రంగా ఉంటూనే కేవలం సోషల్ మీడియాలో ఒక పోస్ట్ ద్వారా తన ఆనందాన్ని షేర్ చేసుకుంది. ఈ నోట్ లో తనతో పాటూ అవార్డులు వచ్చిన మిగిలిన విజేతలకు కూడా ఆమె కంగ్రాట్యులేషన్స్ చెప్పగా, ఇలాంటి అవార్డులు ఆర్టిస్టుల నుంచి ఇంకా బెస్ట్ వర్క్ ను బయటకు తీసుకొస్తాయని చెప్పింది.

## అంజలి సూపర్ స్టైలిష్ గ్లామర్ లుక్

తెలుగు అమ్మాయి అయిన అంజలి తమిళ సినిమా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా దూసుకు పోతుంది. తెలుగులోనూ ఈమె పలు సినిమాల్లో నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో స్టార్‌డం దక్కలేదు. తెలుగు సినిమాలతో పోల్చితే తమిళ్ సినిమాలతో అంజలికి ఎక్కువ గుర్తింపు లభించింది. ప్రస్తుతం తమిళ్‌లో పలు పెద్ద సినిమాల్లో నటిస్తున్న అంజలి సోషల్ మీడియా ద్వారా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా అంజలి ఏ ఫోటోలు షేర్ చేసినా సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటాయి. అలాంటిది స్టైలిష్ లుక్‌తో పాటు గ్లామర్ పిక్స్ షేర్ చేస్తే వైరల్ కాకుండా ఎలా ఉంటాయి. సింపుల్ ఔట్ ఫిట్‌లోనూ స్టైలిష్



లుక్‌తో మెరిపించే విధంగా అంజలి సర్‌ప్రైజ్ చేసింది. ఆకట్టుకునే బ్యూటీఫుల్ మేకోవర్‌తో పాటు, డీసెంట్ హెయిర్ స్టైల్‌తో, డిఫరెంట్ డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన అంజలి షేర్ చేసిన ఈ ఫోటోల్లో డిఫరెంట్‌గా ఫోటోలకు ఫోజ్‌లు ఇచ్చింది. నడుము అందం చూపించడంతో చూపు తిప్పుకోనివ్వడం లేదు. కొందరు హీరోయిన్స్ స్కిన్ షో చేస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది. కొందరు స్కిన్ షో చేస్తేనే వారి ఫోటోలను చూడగలం. కానీ అంజలి స్కిన్ షో చేయకుండానే తన అందంను చూపించి చూపు తిప్పుకోనివ్వడం లేదు. ఒకప్పుడు కాస్త బొద్దుగా అనిపించే అంజలి ఇప్పుడు సన్నగా నాజూకుగా తయారు అయింది. సినిమాల్లో కంటే ఇలా ఫోటో షూట్స్‌లో మరింత అందంగా కనిపిస్తుంది. అంజలి 1986 జూన్ 16న ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా రాజోలులోని ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది. అంజలికి ఒక సోదరితో పాటు ఇద్దరు సోదరులు ఉన్నారు. స్కూలింగ్‌ను రాజోలులో పూర్తి చేసిన అంజలి చెన్నైకి వెళ్లి మ్యాథ్స్‌లో డిగ్రీని పూర్తి చేసింది. కుటుంబ సభ్యుల మద్దతుతో అంజలి సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చింది. తెలుగు సినిమాల్లో మొదట నటించిన పెద్దగా గుర్తింపు రాకపోవడంతో తమిళ సినిమా ఇండస్ట్రీలో ప్రయత్నాలు చేసింది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536